
The Real Personality Development Magazine

# యుగశక్తి గాయత్రి

జులై - 2006


రూ. 8-00



పరమపూజ్య గురుదేవులు

## పండిత శ్రీరామశర్మ ఆచార్య


# మా ప్రచురణలు



ఆత్మకథ



ఏకాంత సహచరులు





నేను ఏమిటి?




గాయత్రి ఉపాసన




యుగశిల్పి సంగీతము




మానసిక సంతులనం



ప్రతిభావంతులారా
లేవండి ముందుకురండి!



ధైర్యం విడువకండి

## గాయత్రీ చేతనా మరియు ధ్యాన కేంద్రం,

## హైదరాబాదు.

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి



సజల శ్రద్ధ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః


**సంకల్పం**
**సంరక్షణ**
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 7**
**సంచిక 4**
**జులై 2006**
**వ్యయ ఆషాఢం**
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**

**సలహాలు, సూచనలకు:**
**శ్రీ అశ్విని సుబ్బారావు - 09848043256**


## సద్గురువు స్వరం

అంతఃకరణలోని మౌనంలో గురుదేవుల పరావాణి ఇలా నినదిస్తోంది –

నేను సదా నీవెంట ఉన్నాను. నేను నీకోసమే జీవిస్తున్నాను. నా అనుభూతి యొక్క ఫలాన్ని నీకు ఇస్తున్నాను. నీవు నా హృదయ సంపదవు; నా కళ్లలో వెలుగువు. ఆ ప్రభువులో మనం ఒకల్లమే. దారుణ సంఘర్షణలలో, కణకణలాడే మంటల్లో నిన్ను త్రోయడానికి నాకు భయం లేదు. ఎందుకంటే– నీ శక్తి ఎంతో నాకు తెలుసు. నీవు చేసేదంతా నా సమక్షంలోనే చేస్తున్నావు.

నా సాహిత్యంలో నా ఇచ్ఛలను వెదకు. నా గురువు నాకు ఇచ్చిన బోధలను నేను నీకు ఇచ్చాను. వాటిని అనుసరించు. నా ఇచ్ఛలపట్ల, నా భావాలపట్ల మెలకువ, స్థిరత్వం, భక్తి – దీనిలోనే ఉంది శిష్యత్వం. మన ఇద్దరి మధ్య అవధులు లేని ప్రేమ ఉంది. గురు శిష్యుల సంబంధం వజ్రంకన్న దృఢమైనది, మృత్యువుకన్న బలీయమైనది.

గుర్తుంచుకో. ఇంద్రియాలు సదా ఆత్మతో సంఘర్షిస్తూ ఉంటాయి. వాటిని నమ్మకు. అవి సుఖ దుఃఖాలకు చలిస్తూ ఉంటాయి. వాటికి అతీతుడవు కావాలి. నీవు ఆత్మవు. నాశనంలేని నా అంశవు. శరీరం ఏ క్షణంలో అయినా నశించవచ్చు. కనుక నీ దృష్టిని సదా లక్ష్యంపై స్థిరంగా ఉంచు. నీ మనస్సును నా భావాలతో పూర్తిగా నింపుకో. మృత్యు క్షణాలలో కాక – ఈ క్షణంలోనే నీ మనస్సును విముక్తంగా, పవిత్రంగా ఉంచు. అప్పుడు – మృత్యువు అకస్మాత్తుగా నిన్ను కబళించినా, నీవు సిద్ధంగా ఉంటావు. ఈ క్షణంలోనే నీకు మృత్యువు సంభవిస్తుందనే విధంగా జీవితాన్ని గడుపు. అప్పుడే నీవు నిజంగా జీవించగలుగుతావు.

ప్రతి వ్యక్తీ తన ఆదర్శాలకోసం పలు విధములయిన కష్టాలను సహించవలసివస్తుంది. నీవూ అన్ని విధముల గీటురాళ్లనూ సహించు; ఆపదలను ఎదిరించు. ఆదర్శ జీవనం గడపు. పరమేశ్వరుని పేరిట నిర్భయుడవు కావాలి. భగవానునిపై నిజంగా ఆధారపడితే, భయాలన్నీ పారిపోతాయి.

నీవు నా సంతానానివి. జీవితంలోనూ మృత్యువులోను, సుఖంలోనూ దుఃఖంలోనూ, మంచిలోనూ చెడులోనూ నేను నీవెంట ఉన్నాను. నేను నిన్ను రక్షిస్తాను. నేను నిన్ను ప్రేమిస్తాను. ఎందుకంటే – నేను నీతో ముడిపడి ఉన్నాను. పరమేశ్వరునిపట్ల ప్రేమ నన్ను నీతో ఏకం చేస్తోంది. నేను నీ ఆత్మను. నాయనా! నీ హృదయం నా నివాస స్థలం. మరి చింత ఎందుకు? నిశ్చింతగా ఉండు. నిర్భయంగా ఉండు.

★★★

తీసుకోవడంలోకన్న ఇవ్వడంలో సంతృప్తి హెచ్చు.

# సద్గురు వచనామృతం



## ధర్మాత్ముడు ఎవరు?

*నిజమైన ఆధ్యాత్మిక వ్యక్తి హృదయంలో ప్రేమ, నిజాయితీ, సత్యం, ఔదార్యం, దయ, శ్రద్ధ, భక్తి, ఉత్సాహం జనిస్తాయి. ఇవన్నీ ఆత్మయొక్క సహజ గుణాలు. ఇవే మనిషి యొక్క శాశ్వత శక్తులు. జీవితమంతా ఈ శక్తులతో పొంగిపొరలే వరకు మనిషి వీటిని పొందడానికి కృషి చేయాలి. ఈ గుణాలను జీవితంలో కలిగి ఉన్న వ్యక్తియే వాస్తవానికి ఆధ్యాత్మిక వ్యక్తి. ఈ సత్యం ఆధారంగా అతడు పరమాత్మను కలుసుకోగలుగుతాడు.*

*భక్తి మార్గం ఒక మతానికో, ఒక కర్మకాండకో పరిమితం కాదు. అది ఆత్మయొక్క గాంభీర్యంలో నిలచి ఉంది.*

*దేవుడు, దేవుడు అని వల్లెవేసినంత మాత్రాన వ్యక్తి ధర్మాత్ముడు కాడు. పరమాత్ముని ఆదేశాల ప్రకారం, ఆయన చెప్పిన మార్గంలో నడచే వ్యక్తులే ధర్మాత్ములు. పరమాత్ముని ఆదేశాలను విని, వాటిని అనుసరించే వ్యక్తులు ధన్యులు.*

*అందమైన ఈ జీవితంలో అడుగు పెట్టిన ఆత్మకు ఆంతరిక జ్ఞానపు తలుపు తెరచి ఉంది. విశుద్ధ హృదయుడైన మనిషి ధన్యుడు. ఎందుకంటే - అతడే పరమాత్మను దర్శిస్తాడు. ఆ దర్శనంలో ఉన్న ఆనందం మాటలకు అందనిది.*

★★★

# విషయ సూచిక

**ముఖచిత్రం : పరమపూజ్య గురుదేవులు**


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం : | 1 |
| 2. | సద్గురు వచనామృతం<br>విషయ సూచిక | 2 |
| 3. | వేద మంత్రం | 3 |
| 4. | పరమపూజ్య గురుదేవుల ప్రథమ దర్శనం | 4 |
| 5. | గురుకృపాలహరి | 7 |
| 6. | గురుభక్తికి శిఖరాగ్రం గురుదేవుల జీవనం | 10 |
| 7. | సద్గురువుగా గురుదేవుల విలక్షణ భూమిక | 14 |
| 8. | గురుదేవుల సాధనలో మూడు అద్భుతాలు | 18 |
| 9. | పరమేశ్వర ప్రాప్తికి రాచబాట త్యాగం | 21 |
| 10. | సాఫల్యానికి సోపానం మనో నిగ్రహం | 22 |
| 11. | దేశరక్షణకు ఉపకరించిన సిద్ధి | 25 |
| 13. | ధర్మ సంస్కృతులకు మూలవిరాట్టు మహిళ | 26 |
| 14. | ప్రాణాకర్షణకు సులభపద్ధతులు | 30 |
| 15. | మనిషికి నిజమైన మిత్రము అంతరాత్మ | 32 |
| 16. | వానప్రస్థం వాస్తవానికి రెండవ జన్మ | 36 |
| 17. | వృద్ధులపట్ల యువతరం బాధ్యత | 39 |
| 18. | స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి - 3 | 42 |
| 19. | విజయవాడలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం | 46 |
| 20. | సంజీవని విద్య శిబిరం | 47 |
| 19. | సద్గురు లీలామృతం | 48 |


# చందాదారులకు విజ్ఞప్తి

1. మనియార్డరుద్వారా తమ పత్రిక చందాలను పంపే చందాదారులలో కొందరు మనియార్డరు రసీదులలో తమ చిరునామాలను వ్రాయడం లేదు. చిరునామా తెలియకపోతే పత్రికను పంపడం సాధ్యపడదు కదా. కనుక ఆ రసీదులలో చిరునామాను తప్పకవ్రాయాలి.
2. పత్రిక చందాదారులుగా చేరేవారు తమ పూర్తి చిరునామా (రాష్ట్రం, జిల్లా, గ్రామం, పిన్‌కోడ్ నంబరు) వ్రాయాలి. పాత చందాదారులు తమకు వచ్చే పత్రిక కంప్యూటర్ నంబరును పేర్కొనాలి.
3. డిడిలు, చెక్కులు పంపేవారు "SRI VEDAMATA GAYATRI TURST, BUSINESS DIVISION" - అని వ్రాయాలి.
4. ఒక నెలలో పత్రిక అందకపోతే, ఆ నెల 15వ తేదీలోగా ఆ విషయం మాకు తెలియజేయాలి. అప్పుడు మరొక పత్రికను పంపగలుగుతాము.

- పత్రికా విభాగం

**అధిక ప్రసంగానికి ప్రేరణ అజ్ఞానమే.**

# వేద మంత్రం

## జీవన యజ్ఞానికి తేజస్సు అవసరం

**యేనేదం భూతం మువనం భవిష్యత్ పరిగృహీతమమృతేన సర్వమ్ ।**

**యేన యజ్ఞస్తాయతే సప్తహోతా తన్మే మనః శివ సంకల్పమస్తు ॥** (యజుర్వేదం 34/4)

**భావార్థం** : వేటివలన నాశరహిత భూత భవిష్య వర్తమానాలలో యోగసాధన ద్వారా జ్ఞానం ప్రాప్తించుకొంటామో, వేటి వలన జీవన యజ్ఞం యొక్క సంపూర్ణ కార్యాలు విధి పూర్వకంగా పూర్తవుతాయో – అవి మన మనస్సులలో శుభ, కళ్యాణకర ఆలోచనల వలననే నెఱవేరుతాయి.

**సందేశం** : దేవతలు, మానవులు, దానవులని మూడు శ్రేణులను మనం కల్పన చేస్తాము. వీరిలో దానవులు హీనులు, మానవులు మధ్యములు, దేవతలు శ్రేష్ఠులు. దానవులు దుర్గుణాలతో నిండిఉంటే, మానవులలో మంచి–చెడూ రెండూ ఉంటాయి. దేవతలు సర్వగుణ సంపన్నులుగా ఉంటారు. వారు పరోపకారులు, తేజస్సు కలిగి ఉంటారు. దేవతలలో అసామాన్యమైన సామర్థ్యం, తేజస్సు ఉంటుంది. పరమాత్మ కణకణంలో ఉన్నాడు. కానీ తేజస్సు కారణంగానే అతడు మనకు సాక్షాత్కరిస్తాడు.

వైదిక ధర్మం కర్మ సిద్ధాంతం మీద ఆధారపడిఉన్నది. మనుష్యుడు కర్మచేయకుండా ఒక్కక్షణం కూడా ఉండలేడు అనేది మొదటిది. కర్మఫలం తప్పక అనుభవించాలి అనేది రెండవది. ఉత్తమ, శ్రేష్ఠ కర్మలకు ఫలం ఉత్తమంగా, అశుభ, దుష్ట కర్మలకు ఫలం చెడుగా ఉంటుందనేది మూడవది. కర్మల గతి చాలా విచిత్రం. అప్పుడప్పుడు కర్మఫలం గురించి సందేహం కలుగుతుంది. కానీ ఈ సందేహం నిరాధారం. ఉరివేసేముందు అపరాధికి కోరిన వస్తువు ఇవ్వబడుతుంది. ఇలాంటిదే ఈశ్వరుని విధానం.

మన మనస్సు ఎంత సమర్థమైనదంటే – వివేక పూర్వకంగా చింతన చేసి తన భూత భవిష్య వర్తమానాలను నిరంతరం లోతుగా అధ్యయనం చేస్తూ ఉంటే, అది తన వాస్తవిక స్థితిని తేలికగానే తెలుసుకో గల్గుతుంది. తాను మానవుడు అవుతున్నాడా, దానవత్వపు గుణాలను పెంచుకుంటున్నాడా, లేక దైవీకార్యాల ద్వారా దేవతలతో సమానంగా యశస్వి, తేజస్వి అవుతున్నాడా అనేదానిని అతడు స్వయంగా తెలుసుకో గలుగుతాడు. తేజస్సు అనేది దేవత్వపు సర్వశ్రేష్ఠ గుణం. తేజస్సు అనేది మన స్వభావంలో కలిసిపోయి ఉండే ఆంతరంగిక ప్రవృత్తి. ఏ ఆటంకాన్నీ లెక్క చేయకుండా తన అభీష్ట కార్యములో ఆవేశపూర్వకంగా లగ్నమగుటయే తేజస్సు. వాస్తవానికి ఈ సంఘర్షమయ ప్రపంచంలో ఎవరు తేజస్విగా ఉంటారో వారే జీవిస్తారు; వారే ఉన్నతిని పొందుతారు. జీవన యజ్ఞంలో వారి పనులన్నీ యధావిధిగా పూర్తవుతాయి.

మన మనస్సులో శుభ ఆలోచన ఉన్నప్పుడే ఇది సంభవం. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరాలనే రాక్షసులను కనీసం తొంగి చూడనివ్వకూడదు. మనస్సులో ఎప్పుడూ పాపపు ఆలోచనలు రానివ్వకూడదు. చెడుదారిలో వెళ్ళకుండా మనల్ని మనం కాపాడుకోవాలి. మనం ఎల్లప్పుడూ చెడు ఆలోచనలను దూరం చేసుకుంటూ శుభము, కల్యాణ కరమైన కర్మలనే సంకల్పిస్తూ ఉండాలి. సంకల్పమాత్రం చేతనే ఏమీ కాదు. మన సంకల్పా న్ననుసరించి కర్మలు చేయాలి. అప్పుడే సాఫల్యం మన చేతి కందుతుంది. ఎక్కువ మంది ఎల్లవేళలా గాలిమేడలు కడుతూఉంటారు. పెద్ద పెద్ద మాటలు చెపుతూ ఉంటారు. దాన్ని సాకారం చేయుటకు తగిన కార్యశూరత వారిలో ఉండదు. శ్రేష్ఠమైన ఆ ఆలోచనలు నెమ్మది నెమ్మదిగా లుప్తమైపోతాయి.

శ్రేష్ఠ ఆలోచనలు నెరవేర్చుటలో సోమరితనం తగదు.

★★★

**దయగల హృదయమే దేవాలయం.**

## ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-1

# పరమపూజ్య గురుదేవుల ప్రథమ దర్శనం

*పరమపూజ్య గురుదేవులతో అత్యంత సన్నిహితంగా, ఆత్మీయంగా జీవించి, వారి అనురాగాన్ని అనుభూతి పొందిన ప్రముఖులలో శ్రీలీలాపత్ శర్మ ఒకరు. గురుదేవులతో తాము గడిపిన సమయంలో జరిగిన సంఘటలను వర్ణిస్తూ వారు "అవర్ గురుదేవ్" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. తమ గ్రంథానికి వ్రాసిన ముందుమాటలో వారిలా అన్నారు - "గురుదేవులకు నన్ను నేను పూర్తిగా సమర్పించుకొన్న తర్వాత వారితో నా సుదీర్ఘమైన సంబంధంద్వారా నాకు తెలిసిన ఆసక్తికరమైన విషయాలు ఈ పుస్తకంద్వారా ప్రజాసేవలో నిమగ్నులైన వ్యక్తులందరికీ తెలుస్తాయి." గ్రంథాన్ని ఆంగ్లభాషనుండి అనువదించినవారు గాయత్రీ పరివార్ వరిష్ఠ కార్యకర్త విజయవాడ వాస్తవ్యులు శ్రీ పరుచూరు నాగేశ్వర రావు.*

---

దాత్రాలోని గాయత్రీ పరివార్ కార్యకర్తలలో మొదటివారు శ్రీద్వారికా ప్రసాద్ బడేరియా. తర్వాత గురుదేవులు ఆయన పేరును 'ద్వారికా ప్రసాద్ చైతన్య జీ'గా మార్చారు. వారిని మనమందరం 'చైతన్యజీ' అని పిలుస్తున్నాము. వారు దాత్రాలో నాకు గురుదేవుల సాహిత్యం చదవమని ఇచ్చారు. ప్రతిరోజూ ఆ సాహిత్యాన్ని చదవడం ప్రారంభించాను. నా పరిస్థితి ఎలా తయారైందంటే - గురుదేవుల సాహిత్యాన్ని చదవని రోజు నాకు జ్వరం వచ్చినట్లు ఉండేది. నాకు పుస్తక పఠనంపై ఆసక్తి మెండు. గురువుగారి రచనలపట్ల నాకు ఎంతో ఆసక్తి ఉండేది. అంత ఆసక్తి గురుదేవుల పట్ల కూడా ఉండేది కాదు. వారి క్రొత్త ప్రచురణ వచ్చినప్పుడల్లా చైతన్యజీ నాకు దానిని చదవడానికి ఇచ్చేవారు.

ఒకరోజున వారు నాకు చెప్పారు - పూజ్య గురూజీ పంచకుండీ యజ్ఞానికి అక్కడకు వస్తున్నారని. ఆ యజ్ఞానికి నా సహకారం అందజేస్తానని చెప్పాను. అంతటి మహోన్నత వ్యక్తిని చూడాలని ఉందని చైతన్యజీకి చెప్పాను. వారు నాకు తన భార్య నగలు ఉన్న సంచీ ఇస్తూ, ఆ నగలు అమ్మి డబ్బు సమకూర్చమని చెప్పారు. ఇంకా కొంత ధన సహాయం చేయగల్గితే యజ్ఞానికి కావలసిన సామగ్రి సమకూర్చడానికి సరిపోతుందని చెప్పారు. అప్పటికి చైతన్యజీకి 20-21 సంవత్సరాల వయస్సు మాత్రమే. ఆ సమయంలో నేను వస్త్ర పరిశ్రమల సమాఖ్యకు అధ్యక్షుడుగా ఉండేవాడిని. ఆ యజ్ఞానికి ఎంత డబ్బు అవసరమవుతుందని అడిగాను. సుమారు 5000 రూపాయలు సేకరిస్తే సరిపోవచ్చని చెప్పారు. అంత చిన్న మొత్తంతో పంచకుండీ యజ్ఞం ఎలా చేయగల్గుతారని అడిగాను. తర్వాత వారిని మా సమాఖ్య కార్యదర్శితో కలిపి వస్త్ర పరిశ్రమ యజమానుల వద్దకు పంపాను. ఆరోజే సుమారు రూ.3,100/-లు వసూలైంది. ఆ డబ్బు చూసి చైతన్యజీ చాలా సంతోషించారు. యజ్ఞం నిర్విఘ్నంగా జరుగుతుందని చెప్పారు.

ఇది 1956లో జరిగిన సంఘటన. భవ్యమైన యజ్ఞవేదిక తయారైంది. ఒక మిల్లు ఇంజనీరును, ఆయన సిబ్బందిని యజ్ఞానికి సహాయపడవలసిందని కోరాను. ఎందుకంటే - అప్పటికే నేను గాయత్రీమాత భక్తుడను; ఈ యజ్ఞానికి ఆధ్వర్యం వహించవలసిందని చైతన్యజీ కోరారు. తర్వాత దాత్రాలో కలశయాత్ర జరిపారు. ఆరోజుల్లో దాత్రాలో ఒక 'సన్యాసి ఆశ్రమము' ఉండేది. దానికి రోజూ నేను వెళ్లేవాడిని. చైతన్యజీ నుండి ఆ కలశయాత్ర జరిగే మార్గాన్ని తెలుసుకున్నాను. అది భవ్యమైన కలశయాత్ర. కలశయాత్ర సన్యాసి ఆశ్రమానికి చేరగానే పది మంగళ స్నానాలు చేయవలసిందిగా చైతన్యజీ నాకు చెప్పారు. నేనలా చేశాను. తర్వాత కలశపూజ జరిగింది. ఆ కార్యక్రమం నాపై చాలా ప్రభావం చూపింది. అక్కడ నుండి యాత్ర బయలుదేరింది. దారి గాయత్రీ కీర్తనలతో మారుమ్రోగింది. యజ్ఞశాలకు రాగానే కలశపూజ జరిగింది. ప్రసాదం పంచబడింది. యజ్ఞానికి ప్రణాళిక రూపొందించాము. ఆరోజు కార్యక్రమం పూర్తి అయింది.

పూజ్య గురుదేవులు వచ్చే రోజున, వారిని స్వాగతించడానికి రైల్వే స్టేషనుకు వెళ్లాము. రైలు వచ్చింది. మా అందరి చేతులలో పూలమాలలు ఉన్నాయి. మొదటి తరగతి, రెండవతరగతి బోగీలలో గురుదేవుల కోసం గాలించాము. వాటిలో గురూజీ లేరు. త్రిపుండ్రాలతో, రుద్రాక్షమాలలతో, కాషాయ బట్టలు ధరించిన, ఒక సన్యాసిరూపంలో గురుదేవులను ఊహించుకున్నాను. కాని ఆరకమైన వ్యక్తి ఎవరూ బండి దిగిన జాడ లేదు. గురుదేవులు రాలేదని నిరుత్సాహపడ్డాను. ఇంతలో మూడవ తరగతి పెట్టెనుండి

**దీర్ఘ జీవనంకన్న దివ్య జీవనం మిన్న.**

పెద్దమనిషిలా కనుపించే వ్యక్తి ఒకరు రేకుపెట్టె, పరుపుచుట్ట చంకలో పెట్టుకొని దిగి నడిచివస్తున్నారు. చైతన్యజీ పరుగెత్తివెళ్ళి వారికి పాదాభివందనం చేసి, వారి సామానులు అందుకున్నారు. ఆయన బంధువు ఎవరో వచ్చారని మేము అనుకున్నాము. వారు మోకాళ్ళవరకు ఉన్న పొడవాటి లాల్చీ ధరించి, కోటు వేసికొని ఉన్నారు. గురుదేవులు రాలేదా అని చైతన్యజీని అడిగాను. వారే గురుదేవులని చైతన్యజీ సంజ్ఞచేసారు. మేమందరం వారికి పాదాభివందనం చేసాము. భారతీయ సంస్కృతికి ప్రతీకగా వారు ఉన్నారు. వారిని యజ్ఞశాలదాకా ఊరేగింపులో తీసుకొని వచ్చాము. ఉదయం యజ్ఞం, సాయంత్రం గురుదేవుల ప్రవచనం జరిగాయి. వారి ప్రవచనం విన్న నేను "ఈయన విప్లవకారుడైన మనీషి" అన్నాను. విప్లవాత్మకమైన ఉపన్యాసం అది. ప్రస్తుత సమాజం పట్ల వారికి బాగా కోపంగా ఉంది. ప్రవచనం పూర్తి అయిన తర్వాత వారు చైతన్యజీతో, "నాయనా! చాలా మంచి ఏర్పాట్లు చేసావు. యజ్ఞానికి, భోజనాలకు మంచి ఏర్పాట్లు చేసావు. దీనికి నీవు చాలా కష్టపడి ఉంటావు. చాలా పెద్ద మొత్తం ఖర్చుపెట్టి ఉంటావు" – అన్నారు. చైతన్యజీ వినమ్రతతో ఇలా అన్నారు – "గురుదేవా! మీ ఆశీస్సులతో, ఈ ఏర్పాట్లన్నిటికీ కావలసిన ధనం ఒక్కరోజులోనే సమకూరింది, నలుగురైదుగురు సహకరించారు." నావైపు చూపి, "వీరు ఒక పండిట్. పరిశ్రమల సమాఖ్యకు అధ్యక్షులు. వీరే నాకు ఒక్కరోజులో – నాలుగైదు గంటలలో – రూ. 3,100/–లు వసూలుచేసి ఇచ్చారు. దాంతో ఏర్పాట్లు చేయడానికి వీలైంది." – అన్నారు. గురూజీ నాతో కొంచం సేపు ముచ్చటించారు. తర్వాత నేను మా మిల్లుకు తిరిగి వెళ్లాను. మరునాటి ఉదయం చైతన్యజీతో కలసి గురుదేవులు మా మిల్లుకు నడచి వచ్చారు. నన్ను తమ దగ్గరగా కూర్చోబెట్టుకున్నారు. నా పిల్లల చదువులు, నా కుమార్తె విషయం అడిగారు. నా పెద్ద కుమార్తెకు వివాహం అయిందనీ, తర్వాతి ఇద్దరు కుమారులూ చదువుకుంటున్నారనీ చెప్పాను. ఒక తండ్రి తన కుమారుణ్ణి అడిగేవిధంగా నా పిల్లల ఆరోగ్యం గూర్చి, కుటుంబ పరిస్థితులనుగూర్చి వివరంగా అడిగారు. మా అమ్మగారు నా రెండవ ఏటనే చనిపోయారు. మా నాన్నగారు నా పదో ఏట చనిపోయారు. మా నాన్నగారికి నేను ఒక్కడినే సంతానం. నా జీవితంలోని సంఘటనలన్నీ వివరంగా వారికి తెలిపాను. అలా చాలాసేపు గడిచింది. పూర్వజన్మ నుండి గురుదేవులతో నాకు బంధుత్వం ఉన్నట్లు నేను భావించాను. మా నాన్నగారు తిరిగి వచ్చారా అనిపించింది. వారు నా భార్యను పిలిచారు. ఆమె ఆరోగ్యం గూర్చి అడిగారు. అలా చాలా విషయాలు అడిగారు. ఆరకంగా వారు నాపై చెరగని ముద్ర వేశారు. వారు తిరిగి యజ్ఞశాలకు బయలుదేరుతుంటే నేను వారితో అక్కడికి వెళ్లాను. యజ్ఞం ముగించిన తర్వాత గురుదేవుల ప్రవచనం.

యజ్ఞంలో పాల్గొన్న వారందరినీ, తమలోని ఒక్కొక్క చెడుగుణాన్ని విడిచిపెట్టవలసిందని వారు కోరారు. ఒక మంచి అలవాటును సంకల్పించుకోమని కోరారు. ఆవిధంగా చేయనివారికి యజ్ఞ ఫలితం ఉండదని చెప్పారు. "నన్ను ఇక్కడికి రప్పించారు. ఇలా దక్షిణ ఇవ్వకుండా నన్ను పంపకూడదు. ఎవరు యజ్ఞంలో పాల్గొనకపోయినా ఇలాంటి దక్షిణ ఇస్తారో, వారికి యజ్ఞ ఫలితం అందుతుంది" – అన్నారు. ఒక్కొకరినీ పిలిచి వారు విడిచిపెట్టిన చెడుగుణాన్ని గూర్చి, తీసుకున్న మంచి నిర్ణయం గూర్చి అడిగారు. వందలమంది బీడీలు, సిగరెట్లు త్రాగటాన్ని, మాంసాహారాన్ని, త్రాగుడును వదిలివేశారు. గాయత్రీ మంత్ర జపం, పెద్దలకు పాదాభివందనం చేయటం, తియ్యగా మాట్లాడటం, భగవంతునికి అర్పించిన తర్వాత మాత్రమే భోజనం చేయడం మొదలగు మంచి గుణాలు స్వీకరించారు.

ఈ పద్ధతి నేను ఇదివరకెప్పుడూ చూడలేదు. అదే విషయాన్ని గురూజీని అడిగాను. దానికి గురూజీ, "యజ్ఞం అనేది ఒక చిహ్నం మాత్రమే. కర్మకాండలే సమస్తం కాదు. ఒక చెడుగుణం విడిచిపెట్టడం, ఒక మంచి గుణాన్ని స్వీకరించడం అనేది యజ్ఞంయొక్క నిజమైన లక్ష్యం. కేవలం మంత్రాలు చదివి, ప్రవచనం ఇచ్చేవారు ప్రజలను పెడదారి పట్టిస్తున్నారు. తమ అహంకారాన్ని తృప్తిపరచుకుంటున్నారు" – అని చెప్పారు. ఇది నాపై చెరగని ముద్ర వేసింది.

గురూజీ బయలుదేరేటప్పుడు నన్ను పిలిచి, ఉత్తరాలు వ్రాస్తూ ఉండమనీ, తన భావాల్ని ప్రచారం చేయమనీ చెప్పారు. ద్వారికా ప్రసాద్ చైతన్య ఒక చిన్న కుర్రాడు, అతనికి సహాయపడమనీ చెప్పారు. "నాకు లభించినంత సమయాన్ని మీ భావాల్ని ప్రచారం చేయడానికి వినియోగిస్తాను" – అని తెల్పాను. తర్వాత గురుదేవుల నుండి ఉత్తరాలు వస్తూ ఉండేవి. (వీటిని లేఖలతో మార్గదర్శనం అనే పుస్తకంలో ప్రచురించాను) నేను కూడా గురూజీకి ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడిని. నేను గాయత్రీ పరివార్‌కు చేరువయ్యాను.

**దురదృష్టాన్ని భరించే శక్తి లేకపోవడం మరింత దురదృష్టకరం.**

అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. పూజా కార్యక్రమాలు చేసే విధానాన్ని తెలుసుకున్నాను. యజ్ఞాలు చేయడానికి ఇంటింటికీ వెళ్లేవాడిని కూడా.

## శిశువు ఆయుష్షును పొడిగించిన గురుదేవులు

మోహన్‌లాల్ దలాల్ మా మిల్లులో బ్రోకరుగా పని చేసేవాడు. సంవత్సరం వయస్సు ఉన్న అతని కుమారుడు మరణించాడు. అతనిని ఓదార్చడానికి వెళ్లాను. అతను నిర్వేదంతో "ఎన్నాళ్లు నేను ధైర్యంగా ఉండగలను? నా ముగ్గురు కొడుకులు సంవత్సరంలోపు వయస్సులో మరణించారు. నాకు నమ్మకం నశించిపోయింది. నేను ఆత్మహత్య చేసుకుంటాను" – అన్నాడు. నాకు చాలా దుఃఖం కలిగింది. అతనికి ధైర్యం చెపుతూ, "ఈ సారి జన్మించే నీ కుమారునికి పూర్ణ ఆయుర్దాయం ఉంటుంది. అతను జన్మించగానే గాయత్రీ యజ్ఞం చేసి, నామకరణ సంస్కారం జరిపిద్దాము" – అన్నాను. తర్వాత కొన్నాళ్లకు అతనికి మగబిడ్డ జన్మించాడు. నేను వెళ్ళి "ఈ పిల్లవానికి పూర్తి ఆయుష్షు ఉంటుంది" – అని నమ్మకంగా చెప్పాను. పంచకుండీ యజ్ఞానికి ఏర్పాట్లు చేసాను. చైతన్యజీ ఎంతో అందమైన యజ్ఞశాల నిర్మించారు. మోహన్‌లాల్ తన బంధుమిత్రుల నందరినీ ఆహ్వానించాడు. పరివార్ కార్యకర్తలందరూ సహకరించి యజ్ఞాన్ని జయప్రదంగా నిర్వహించారు. ఈ విషయాన్ని నేను గురుదేవులకు తెలుపలేదు. వైభవంగా యజ్ఞం నిర్వహించబడింది. దాదాపు ప్రజలంతా పాల్గొన్నారు. బిడ్డకు నామకరణ సంస్కారం జరిపించే సమయం ఆసన్నమైంది. నేనే బిడ్డకు నామకరణం చేయాలని మోహన్‌లాల్ కోరాడు. బిడ్డకు "గురుప్రసాద్" అని నామకరణం చేసాను. మూడురోజులు యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. నాలుగో రోజు పూర్ణాహుతి తర్వాత వచ్చిన భక్తులు యజ్ఞ ప్రదక్షణాలు చేస్తున్నారు. "యజ్ఞరూప ప్రభో హమారే" అనే కీర్తన అంతటా ప్రతిధ్వనిస్తూంది.

అనూహ్యంగా ఆసమయంలో యజ్ఞశాలకు నిప్పు అంటుకుంది. యజ్ఞశాల బూడిదగా మారింది. కాని గురూజీ, మాతాజీ, గాయత్రీమాత పటాలు మాత్రం చెక్కుచెదరలేదు. వేలాదిమంది ప్రజలు ఉన్నారు. కాని ఎవరికీ గాయం కల్గలేదు. చిన్న దెబ్బైనా తగలలేదు. అక్కడ ఇతర పురోహితులు కూడా ఉన్నారు. గాయత్రీ మంత్రాన్ని తప్పుగా ఉచ్చరించడంవల్ల, స్త్రీలు యజ్ఞంలో పాల్గొన్నందువల్ల ఇలా జరిగిందని గోలచేశారు. మోహన్‌లాల్ బంధువులంతా భయభ్రాంతులైనారు. కన్నీళ్లు వరదలై ప్రవహించాయి. ఏడ్పులతో భయానక వాతావరణం ఏర్పడింది. నాకు దిగ్భ్రాంతి కల్గింది. పశ్చాత్తాపం కల్గింది. అయినా వెంటనే ధైర్యాన్ని కూడదీసికొని మైకులో – "సోదర సోదరీమణులారా! ఈ యజ్ఞం నా ప్రేరణతో జరిగింది. ఏదైనా పొరపాటు జరిగితే శిక్ష నాకు జరగాలి. మంచి జరిగితే యజ్ఞంలో పాల్గొన్న వారందరికీ జరగాలి" – అన్నాను. ఎంతో సముదాయించిన తర్వాత ఏడ్పులు శాంతించాయి. నేను మిల్లర్ల సమాఖ్యకు అధ్యక్షుడిని కనుక ఎవరూ నాకు వ్యతిరేకంగా మాట్లాడలేదు. కాని నా హృదయాన్ని భయం ఆవహించింది. ఆరాత్రంతా నాకు నిద్ర లేదు.

తెల్లవారి నా కార్యాలయానికి వెళ్లేసరికి ఉత్తరాలు నా బల్లపై ఉన్నాయి. అందులో పై ఉత్తరం గురూజీ నుండి వచ్చిన ఇన్‌లాండ్ లెటర్. దాన్ని తెరచి చదివాను. అగ్నిప్రమాదానికి ఒక రోజు ముందు వ్రాయబడిన ఉత్తరం అది. గురూజీ తన పూజాకార్యక్రమం తర్వాత వ్రాసిన ఉత్తరం అది. అందులో, "నాయనా! నీ కొడుకుకు పూర్ణాయుర్దాయం ఉంటుందని నీవు ఒకరికి చెప్పావు. కాని అతడు పూర్వ జన్మలలో చేసిన కర్మలవల్ల అతని కొడుకులు అల్పాయుష్కులౌతారు. ఈ బిడ్డ కూడా అల్పాయుష్కుడే. కాని యజ్ఞం చేయడంవల్ల పూర్ణాయుష్షు లభిస్తుందని నీవు ఆయనకు నమ్మకం కల్గించావు. గాయత్రీ మాత దయవల్ల, యజ్ఞభగవానుని దయవల్ల బిడ్డకు పూర్ణ ఆయుర్దాయం కల్గుతుందని నమ్మకం కల్గించావు. అగ్నిప్రమాదంతో యజ్ఞశాల ఏడ్పులతో, రోదనలతో నిండుతుంది. నీవుకూడా దిగులు చెందుతావు. కాని విచారించకు. గాయత్రీ మాత, యజ్ఞ భగవానుడు బిడ్డ జీవిత కాలాన్ని పొడిగించారు. కాని ఆ ఇంటిలో జరగవలసిన దుఃఖకర సంఘటన యజ్ఞంలోనే జరుగుతుంది." – అని వ్రాశారు. ఆ ఉత్తరాన్ని నాదగ్గర ఉంచుకొని, ఆబిడ్డ జాతకచక్రం వ్రాయించి గ్వాలియర్‌లోని జోతిష్యునికి చూపించాము. ఆబిడ్డ జీవితకాలం చాలా స్వల్పం అని చెప్పారు ఆయన. ఆ ఉత్తరం చదివిన తర్వాత నేను ఇలా అనుకున్నాను – "నేను గురుదేవులకు వ్రాయలేదు కదా. ఆయనకు ఇదంతా ఎలా తెలిసింది?" అప్పుడు నాకు అర్థమైంది – గురుదేవులు 'త్రికాలదర్శి' అని; గాయత్రీ సాధనతో ఎన్నోమైళ్ళ దూరంలో జరిగే విషయాన్ని గూడా వారు తెలిసికోగల్గుతారని. ఈ సంఘటనతో గురూజీపై నా నమ్మకం భక్తి, శ్రద్ధ అధికమైనాయి.

★★★

**దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ళు, తర్వాత ఇనుప గొలుసులు.**

# గురుపూర్ణిమ వ్యాసం

# గురుకృపాలహరి

జ్ఞానేశ్వర మహారాజు శ్రీమద్భగవద్గీతపైన మహారాష్ట్ర భాషలో రచించిన గొప్ప వ్యాఖ్యాన గ్రంథము జ్ఞానేశ్వరి. ఆ గ్రంథంలో గురుతత్త్వ విషయం బహూథా ప్రవచింపబడింది. అందులో కొన్ని విషయాలు మననం చేద్దాము.

జ్ఞానేశ్వరి గ్రంథము గురువందనంతో ప్రారంభమైంది. ఆ గురువందన రూప మంగళాచరణానికి భావానువాదం గ్రహిద్దాము.

"ఓ గురుభగవాన్! తమరు అందరు దేవతలకంటె శ్రేష్ఠులు. ఆనందము, బుద్ధి రూప ప్రభ జ్యోతిర్వంతములగుటకు కారణమైన సూర్యుడవు నీవే. నీవు సర్వాంతరాత్మకుడవు. అందరి హృదయములందు 'నేను బ్రహ్మను' అను జ్ఞానదీప్తి కలిగించువాడవు నీవే. సముద్రమువలె నీవు అనంత గంభీరమైనవాడవు. పదునాలుగు లోకములు నీయందు వెలుగుచున్నవి. నీవు దీనదయాళువు, కరుణాసాగరుడవు. బ్రహ్మ విద్యా వధూ ప్రియుడవు. ఎవరికైతే నీ తత్త్వము తెలియదో వారికి లోకము లోకముగా కన్పించును. కాని నీ తత్త్వము తెలిసినవారికి లోకమునం దెల్లెడల నీ మూర్తియో గోచరించును.

"నీ జ్ఞానబోధామృతపానం వలన మాయాతిక్రమణం జరుగుతుంది.

"నీటిలోని తీపితనము నీవలన, భూదేవి భారము వహింప కలుగుట నీ ప్రతాపమువలన. సూర్య చంద్రుల్ని కాంతి సంపన్నులను చేస్తూ నీ తేజస్సు ముల్లోకాలనూ వెలిగిస్తున్నది. నీ శక్తివలననే వాయువు సర్వదిక్కులందు పరిభ్రమిస్తున్నది. ఆకాశం అనంతమవడం కూడా నీయందే జరుగుతున్నది.

"నీ ప్రభావం వలన జ్ఞానం నలుప్రక్కలకూ వ్యాపించింది. నీ స్వరూప యథార్థ్యాన్ని గ్రహింపలేక పోవుటవలన శ్రుతులైన వేదాలను వర్ణించు పరిశ్రమ చేయవలసి వచ్చింది. కాని వేదమునందు నీ వర్ణన జరిగినంతవరకు నీ ప్రత్యక్ష దర్శనం లభించుటలేదు. నీ దర్శనం లభించినపుడు, నా స్థితి వేదముల స్థితి – రెండూ ఒకే విధంగా గలవు. ఆ స్థితి ఎట్టిదనగా – నిశ్చలమైపోవుట.

"ప్రళయకాలంలో జగత్తు జలమయమైపోయినప్పుడు ఒక నీటిబొట్టు లెక్కయేమున్నది? పెద్ద పెద్ద నదులు, సముద్రాలు కలిసిపోయి – ఏక జలరాశి అయి గుర్తించుటకు వీలు లేకుండా ఉంటాయి. సూర్యోదయ కాలంలో చంద్రబింబం కన్పిస్తూ ఉన్నప్పటికీ దాని తేజో మహత్త్వ మేపాటిది? నీవు ప్రత్యక్షమైనప్పుడు నీ సమక్షంలో నా స్థితి, వేదాల స్థితి – అట్లాగే ఉంటుంది.

"ద్వైతభావం నిర్జింపబడి పరాసహిత వైఖరీవాణి శాంతి పొందినపుడు నీ వర్ణన ఏవిధంగా చేయగలం? ఎంతదూరం చేయగలం?

"ఎవరైనా సరే గురుమూర్తిని సంపూర్ణంగా వర్ణించడానికి సమర్థులు కానప్పుడు స్తుతిమార్గాన్ని వదలి అనన్యభావంతో గురు చరణములకడ శిరస్సు ఉంచడమే శ్రేయస్కరం. అది చివరి మార్గం. అది ఉత్తమమార్గం."

జ్ఞానేశ్వర మహారాజు గురుకృపా దృష్టిని వర్ణిస్తూ చాలా పద్యాలు వ్రాశాడు.

హే! గురుదైవ కృపాదృష్టీ! నీవు నిత్య జయశీలివి. నిర్మలవు. ఉదార రూపవు. ఆచ్ఛాదనలేని ఆనంద ప్రభవు. విష సర్పముచేత కరవబడి మూర్ఛపోయిన మానవునిలోని విషాగ్నిని నీ కృపాకిరణములచే తొలగిస్తావు. నీ కృపాసాగర మగ్నుడైనవానిని సంసార తాపమేమి చేయగలుగుతుంది?

"స్నేహామృత రూపణీ! నీ కృపా విశేషం చేత సాధకులకు యోగ సుఖాలు ప్రాప్తిస్తున్నాయి. వాళ్ళకు బ్రహ్మభావన కూడా కలుగుతున్నది – నీ ఆధార శక్తియొక్క భుజంమీద కూర్చోబెట్టుకుని సాధకుని గమ్యస్థానం చేరుస్తున్నావు. సాధకులకు ఉపదేశసారమన్న చనుబాలిచ్చి తల్లియై రక్షణ అను ఊయెలలో ఊపుతున్నావు. మానసిక విషయ వాసనలందు పరాఙ్ముఖత్వము కలిగించి మనః ప్రాణాలను చలనరహితం చేస్తున్నావు. జీవన కళామృతపానాన్ని

**దుర్బుద్ధి తాను నింపిన విషపాత్రలో సగం తానే త్రాగుతుంది.**

చేయించి "హంసస్సోహం" అను అఖండ అనాహత ధ్వని సంగీతంతో సమాధి సుఖాన్ని కలిగిస్తున్నావు. ఈ విధంగా నీవు సాధకులకు తల్లివి. నీ పాద స్పర్శచేత జ్ఞానప్రాప్తి కలుగుతుంది. నీ ఆశ్రయాన్ని నే నెన్నటికీ మరిచిపోను."

జ్ఞానేశ్వరుడు శ్రీ గురు మహిమను వర్ణించుట - ఎవరికైనా సాధ్యముకాని పని అని గ్రహించి గురువుకి వినయంగా విన్నపాలు చేశాడు.

"హే గురో! సాధకులకు నీ కృపా రూపమైన గణేశ ప్రసాదము లభించినపుడు, ఆ సాధకులెంత అల్పవయసువారైనా వారికి శాస్త్రములందున్న ప్రగాఢ గంభీర రహస్యాలు కరతలామలకములవుతాయి. ఉదారమైన నీ వచస్సుద్వారా అభయము లభించినపుడు సర్వ సాహిత్య రహస్యాలూ, సర్వజగద్రహస్యాలూ తెలుస్తాయి. ప్రేమ స్వరూపమైన నీ మృదు వచనం శ్రవణములకు విన్పించినపుడు మహాగ్రంథ రచనాశక్తి అనుగ్రహింపబడినదన్నమాట. ఆ రచనాశక్తియందు బృహస్పతి కూడా నిలువలేడు. ఇతరుల లెక్కయేమి? ఈవిధంగా నీ కృపాదృష్టి వరదాన రూపిణి అయింది. నీ కృపాలబ్ధి కలిగిన జీవుడు ఈశ్వరునితో తుల్యుడగుచున్నాడు. నే నీ వాక్యాల నెట్లు వ్రాయగలుగుచున్నాను? గురుకృపా విలాసమే.

"సూర్యమండలంలో మలాన్ని తీసివేయాలని తలపోయుట, కల్పవృక్షానికి (పువ్వులు) కాయలు కాయాలని కోరడం, క్షీరసాగరాన్ని భోజన పదార్థంగా వినియోగించు కోవాలనుకోవడం, కర్పూరానికి సుగంధం చేర్చడం, చందనానికి చల్లదనం చేర్చాలనుకోవడం, ఆకాశంకంటె ఎత్తు కావాలని భావించడం - ఎట్లా వ్యర్థాలో - అదే విధంగా సద్గురువు యొక్క మహిమను సంపూర్ణంగా గ్రహించుటకు చేసే ప్రయత్నము కూడా. అటువంటి కృషి ఫలించాలంటే గురు కృప మాత్రమే సాధనం. ఇట్లు భావించి సద్గురువునకు నమస్కరిస్తున్నాను. బుద్ధికి ఉన్న శక్తి ఆధారంతో గురుశక్తి సామర్థ్యాలను వర్ణించడానికి పూనుకోవడం - మంచి ముత్యముపైన మంచినీళ్ళు పోయడం వంటిది. మేలిమి బంగారంపైన పాదరసాన్ని పోయడం వంటిది. గురు మహిమలను వర్ణించుట అసాధ్యమైన పని. చేయతగిన దేమనగా శ్రీగురు చరణముల సన్నిధిలో శిరమువంచుట. అదే యోగ్యమైన పని."

శ్రీ మద్భగవద్గీత పదమూడవ అధ్యాయానికి (క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము) వ్యాఖ్య రచించేటప్పుడు ఆచార్యో పాసనమందు జ్ఞానేశ్వర మహారాజు మనస్సు ఆనంద నాట్యము చేసింది. గురుభక్తిలో ఆయన చెప్పిన భిన్నాంగాలు (1) మానసిక సేవ, (2) శారీరక సేవ, (3) గురు వియోగమున తపన, (4) శరీర పతనానంతరం కూడ శ్రీ గురుసేవా నిమిత్తము శారీరక తత్వాలు ప్రకృతిలో విలీనమగు ప్రక్రియా ఆకాంక్ష.

గురువును మానసికంగా ఉపాసించడాన్ని గురించి జ్ఞానేశ్వర మహారాజు రమణీయంగా వ్రాశాడు.

సాధకుడు అంతరంగంలో అత్యంత ప్రేమానురక్తితో శ్రీ గురు చరణాలను ధ్యానముచేస్తే - అతని హృదయమందిరంలో గురుమూర్తి వచ్చి తప్పక నివసించునని చెప్పుతాడాయన. జ్ఞాన రూపమైన తటాకం మీద ఆనందరూపమైన మందిరాన్ని నిర్మించి అందులో శ్రీ గురురూపమైన శివలింగ స్థాపన చేసికొని ధ్యానరూపమైన అమృతంతో అభిషేకం చేయాలి.

"అంతస్సున బోధ రూపమైన సూర్యోదయం. జరిగినప్పుడు సాత్విక రూప బుద్ధి శ్రద్ధలను నివేదన చేయాలి. దేహాభిమాన రూప ధూపాన్ని ప్రజ్వలింపచేసి జ్ఞానరూపమైన దీపంతో గురువుకి హారతి ఇవ్వాలి. శ్రీ గురు రూపంతో ఐక్యతా భజనమే నైవేద్యము. తానే స్వయంగా పూజారి అయి శ్రీ గురువు సాక్షాత్తు శంకరుడని తెలిసి స్తుతించాలి."

వైష్ణవ భక్తులకోసము కూడా జ్ఞానేశ్వర మహారాజు ఒక విధానాన్ని వివరించాడు. శ్రీ గురువును భగవాన్ శ్రీ మహావిష్ణువని శిష్యుడు తన హృదయ సింహాసనమీద అధివసింపజేసి వైష్ణవ పద్ధతిలో ధ్యాన ఆవాహనాది పూజాదికము చేయుట - గురువుపై అనేక విధములుగా భక్తిభావ వ్యక్తీకరణం చేయుట.

జ్ఞానేశ్వర మహారాజు గురువును మాతృమూర్తియైన గోవుగా కల్పనంచేసి శిష్యుని దాని వెనుక పరువులెత్తుచున్న వత్సముగా భావించాడు. మరొకచోట గురువును తల్లిగా భావించి శిష్యుడైన తాను చనుబాలు త్రాగు పిల్లవాడై ఆనందానుభవాన్ని పొందాడు.

**దుర్మార్గులు భయానికి విధేయులు. సన్మార్గులు ప్రేమకు విధేయులు.**

సముద్రంలో అనేకములైన అలలు వచ్చినట్లుగా తన హృదయంలో గురువుయందు భక్తి శ్రద్ధ, ప్రేమ, అనురాగం, సేవాభిలాష మొదలైన భావాలు ఆధారంగా పెక్కు ధ్యాన విధానాలను కల్పించాడాయన. గురువుకి చేయదగిన బాహ్యసేవలను గురించి కూడా జ్ఞానేశ్వర మహారాజు చేసిన కల్పనలు మనోజ్ఞంగా ఉన్నాయి.

"నేను గురువున కెంత సేవ చేస్తానంటే - గురువు నా సేవకు సంతృప్తిచెంది ఏదైనా వరమడుగమన్నప్పుడు - అనగా నాయొక్క పరిశుద్ధ నిష్కళంక సేవ వలన ప్రసన్నుడై వరము కోరుకోమన్నపుడు - ఆయనకు ఏఏ రూపములవలన ఉపభోగ సాధనమగునో - ఆయా రూపాలన్నీ నేనే పొందగలిగేటట్లు అనుగ్రహం పొంది సర్వ సేవలూ నేనే చేస్తాను.

"శ్రీ గురువు అనేక మందికి తల్లివంటివాడు. కాని నేను శపథము చేసి శ్రీ గురు కృపను నా ఒక్కనికే తల్లిగా చేసుకుంటాను. వాయువు ఎంత దూరమైనా వ్యాపిస్తుంది. కాని నాలుగు దిక్కులలోపలనే ఉంటుంది కదా! అదే విధంగా నేను పంజరమై శ్రీ గురుకృపను నాలోపల మాత్రమే దాచుకుంటాను."

శ్రీ గురు స్నేహమున ఆనంద తన్మయత్వము జ్ఞానేశ్వరుని కల్పన. గురుసేవ విషయంలో ఆయన చెప్పిన విషయాలు గమనించవలసినవి.

"నేను శ్రీ గురుదేవునికి విశ్రాంతి గృహ మౌతాను. కాని అప్పుడు కూడా ఆయనకు సేవచేస్తూనే ఉంటాను. ఆయన చరణ కమలముల క్రింద వచ్చు గడప, ద్వారము, ద్వారపాలక చిత్రము అన్నీ నేనే అయి ఉంటాను. అంతే కాదు. శ్రీ గురువులకు పాదుకలై శ్రీ గురుచరణాలను ఆశ్రయిస్తాను. నేను ఛత్రాన్ని అయి శ్రీ గురువుల ముఖముపై ఎండ పడకుండా నీడ పట్టుతాను. శ్రీ చరణులకు నిత్య సన్నిధానవర్తిగా - సేవలు చేయు శిష్యునిగా - పాదములు కడుగుకొనుటకు పాద్యజలముగా - ఆ నీటికాశ్రయ మిచ్చిన పాత్రగా కూడా నేనే ఉంటాను. శ్రీ గురువులకు ఆసనంగా, వస్త్రంగా, చందనముగా - వంటకముగా - భోజనముగా - అన్నీ నేనే అయి ఉంటాను."

శరీరము త్యాగము చేసిన తరువాత కూడా తన శరీరంలోని పంచభూతాలు గురుప్రీత్యర్థము విలీనం కావలెనని కోరుకుంటాడాయన.

"ఈ శరీరంలో ఉన్న మట్టిని శ్రీ గురుచరణములు ఎక్కడ ఉంటాయో ఆ స్థలములో కలుపుతాను. ఈ శరీరంలో ఉన్న జలవిభాగాన్ని శ్రీ గురువులు సంపూర్ణ స్పర్శభాగ్యము కలిగిన జలాశయములోనే కలుపుతాను. ఈ శరీరంలోని తేజో విభాగాన్ని - ఏ దీపంలో కలుపుతానంటే - లోకులు శ్రీ గురుదేవునికి హారతి ఇవ్వడానికి ఏ దీపం ఉపయోగిస్తారో - ఆ దీపంలో లేక ఏ దీపము శ్రీ గురువుల మందిరాన్ని ప్రకాశింపచస్తుందో అట్టి దీపంలో, శ్రీ గురువుల యొక్క పాదకమలాలకు ఎక్కడ వీవనలు పట్టబడుతున్నాయో - అక్కడ ఉన్న వాయువులో ఈ శరీరంలోని ప్రాణవాయువును లీనంచేస్తాను. శ్రీ గురుమూర్తికి సేవలో ఛత్రము పట్టబడుచున్న చోటునందున్న ఆకాశంలో ఈ శరీరంలోని ఆకాశాన్ని కలుపుతాను. జీవించి ఉన్నా - మరణించినా - గురుసేవనుండి దూరము కాను."

జ్ఞానేశ్వర మహారాజు గురుసేవయొక్క అపరిమితత్వ మెట్టిదంటే - అపార అనంతమైన గురుసేవచేసి మరల గుర్వాభిముఖంగా సంచరిస్తుంది. ఆయన భావించిన గురుసేవకు విశ్రాంతి విరామాలు లేవు. ఆయన భావనలో గురుసేవ నిత్యనైమిత్తిక కర్మ. ఆయన వాక్కు నిత్య గురునామస్మరణం చేస్తూ ఉంటుంది. ఆయన గురువాక్యాలకు సర్వ శాస్త్రాధికమైన మన్నన ఇస్తాడు.

**ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురోఃపదమ్**
**మంత్రమూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోఃకృపా**

ఏ నీటిని గురువు స్పృశిస్తాడో అది గంగాజలములకంటే పవిత్రమైన తీర్థ జలము. శ్రీ గురుపాదధూళి శిరోధార్యము - దాని ముందు మోక్షము కూడ తక్కువేనట.

జ్ఞానేశ్వరుని భావాలు గమనించినవాళ్ళు మరి విచారించ వలసిన దేమీలేదు, గురుసేవలో సాంసారిక, పారమార్థిక, భోగ, స్వర్గ అపవర్గములు ఏమిలేవు? కృపామూర్తి అయిన గురువు సేవను పరిత్యజించి వ్యర్థంగా తిరిగితే ఏమి సిద్ధిస్తుంది ? ఎవడు అన్నిటిని వదలి గురుసేవ ఒక్కటే తన లక్ష్యంగా నిలుపుకొంటాడో - అట్టివాడు కృతకృత్యుడైనట్లే, అట్టి గురుసేవకుడు ధన్యజీవి.

- తుమ్మలపల్లి రామలింగేశ్వర రావు

**దుష్టులకు బలం హింస; గుణవంతులకు బలం సహనం.**

## ముఖచిత్ర కథనం - 1

# గురుభక్తికి శిఖరాగ్రం గురుదేవుల జీవనం

*గురుభక్తి కథలూ, గాథలూ పురాణాలలో, చరిత్రలో కోకొల్లలు. ఆధునిక యుగంలోనూ గురుభక్తికి ప్రతిరూపాలయిన మహనీయులు జీవితాలు కనిపిస్తాయి. వారిలో పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ జీవితం గురుభక్తికి శిఖరాగ్రం, చరమసీమ, పరాకాష్ఠ. ఆ గురుభక్తి విశిష్టతను వివరించే వ్యాసం ఇది. గురుదేవుల వాఙ్మయం ప్రథమ ఖండంలోని 9.33 - 9.35 పుటలలో ప్రచురితమైన హిందీ వ్యాసానికి అనువాదం ఇది. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి కలిగిఉన్న వ్యక్తులందరికీ అవశ్య పఠనీయం ఈ వ్యాసం.*

---

సూర్యునిలో ఎంత వెలుగు ఉన్నప్పటికీ, కనుపాప పనిచేయకపోతే అంతటా చిమ్మచీకటే. శిష్యుని విషయంలోనూ ఇది నిజం. గురువు ఎంతో సమర్థుడూ, యోగ్యుడు అయి ఉండవచ్చు. వ్యక్తి అంతరంగంలో శిష్యత్వం లేకపోతే - గురువు యోగ్యత పనిచేయదు. గురువు విత్తనాన్ని నాటతాడు. నీరు పెడతాడు. ఎరువు వేస్తాడు. అయితే, భూమి సారవంతంగా ఉండాలి. బంజరు భూమిలో నాటే విత్తనాలు, పెట్టే నీరూ, వేసే ఎరువూ వృథా అవుతాయి.

పరమపూజ్య గురుదేవులను మనమంతా సద్గురువుగా పొందాము. వారి జ్ఞానం, వారి తపస్సు మనకు వెలుగు నిచ్చాయి, జవం జీవం ఇచ్చాయి. వారి ప్రాణశక్తి మనల్ని పోషించింది, పరిపాలించింది. వారు తమను తాము ఎలా పరిగణించుకున్నారో వారినే అడుగుదాం. వారు ఒక ప్రవచనంలో ఇలా అన్నారు -

### 'గురువు చేతుల్లో తోలుబొమ్మను నేను'

"నేను సమర్పితుడైన శిష్యుణ్ణి. గురువు చేతుల్లో యంత్రాన్ని, తోలుబొమ్మను మాత్రమే. నా గురువు ఎప్పుడు ఏది చేయిస్తే అప్పుడు అది చేశాను. ఆయన ఎలా ఉంచితే అలా ఉన్నాను. నాదంటూ ఒక ఇచ్ఛ ఉన్నదనే ఆలోచనే రాలేదు నాకు ఎన్నడూ. నా జీవితం అనే మురళిలో గురువు స్వరాన్ని ఆలాపిస్తూవచ్చాను."

సద్గురువును పొందడం ఒక అద్భుత వరం, ఒక శాశ్వత సౌభాగ్యం. శిష్యునిగా తనను తాను మలచుకున్న వానికే దక్కుతుంది అది. గురువును వెదుకుతూ తిరిగేవారు వేలాదిగా ఉన్నారు. అయితే - రామకృష్ణ పరమహంస పొరుగున నివసిస్తూ కూడ ఆయనను 'పిచ్చి బ్రాహ్మడు' అని వెక్కిరించినవారూ అనేకులు ఉన్నారు. దయానంద మహర్షికి అతి సన్నిహితంగా ఉంటూ కూడ కొద్ది రూపాయలకు ఆశపడి ఆయనకు విషం ఇచ్చినవారు ఉన్నారు. పేరు ప్రతిష్ఠలను ఆశించి ఏసుక్రీస్తును శిలువ ఎక్కించి చరిత్ర చీకటి పుటలకు ఎక్కినవారూ ఉన్నారు.

వీరందరి జీవితాలూ లోకోత్తరులైన మహామానవుల సంపర్కంలో గడిచాయి, వీరు కోరుకుంటే తమ యోగ్యతలను పెంచుకుని ధన్యులు అయేవారే. కానీ అలా జరగలేదు. ఎలా జరుగుతుంది? సద్గురువును గుర్తించడానికీ, స్వీకరించడానికీ అలౌకికమైన దృష్టి అవసరం అవుతుంది. అలాంటి దృష్టి కేవలం శిష్యునిలోనే ఉంటుంది.

### శిష్యునికి మాత్రమే దొరుకుతాడు గురువు

సూఫీ ఫకీరు షేక్ ఫరీద్ జీవితంలోని ఒక సంఘటన. అప్పుడు ఆయన నవ యువకుడు. తిరుగుతూ తిరుగుతూ ఆయన ఒక చెట్టు దగ్గరకు వచ్చాడు. అక్కడ ఒక సాధువు కూర్చొని ధ్యానం చేస్తున్నారు. ఆయనను కుదిపి లేపి, 'బాబా! మమ్మల్ని కూడ భగవంతునివద్దకు చేర్చండి' - అని అడిగాడు. 'భగవంతుని వద్దకు చేర్చేవాడు గురువు' - అని ఆయన జవాబు చెప్పారు.

'మరి, నా గురువు ఎవరు?'

'నేను గుర్తు చెపుతాను. వెదకుకో'

**ప్రార్థన చేసే పెదవులకన్న సహాయపడే చేతులు పవిత్రమైనవి.**

'అలాగే. గుర్తు చెప్పండి.'

'నీ గురువు ఒక చెట్టు కింద కూర్చొని ఉంటాడు. ఆయన ముఖం చుట్టూ కాంతి వలయం ఉంటుంది. ఆయన కళ్లు తేజస్సుతో వెలుగుతూ ఉంటాయి. ఆయన శరీరం నుండి పరిమళం వెలువడుతూ ఉంటుంది.'

వెంటనే షేక్ ఫరీద్ అన్వేషణకు బయలుదేరాడు. రోజులు గడిచేకొద్దీ ఆయనలోని తపన తీవ్రతరం అయింది. 20 సంవత్సరాలు గడిచాయి. ఓడిపోయి, ఫరీద్ తిరిగివచ్చాడు. తిరిగివచ్చేసరికి - ఒక చెట్టుక్రింద ఒక సాధువు కూర్చొని ఉన్నారు. ఆయన చుట్టూ కాంతివలయం, సుగంధం - ఇలా అన్ని లక్షణాలూ కానవచ్చాయి. ఫరీద్ ఆనందంతో ఆయన కాళ్లమీద పడ్డాడు. సాధువు ప్రసన్నులై ఆయన వీపు నిమిరారు. ఫరీద్ లేచి ఆ సాధువు ముఖంవైపు చూచాడు. అరే! ఇదేమిటి? గురువు లక్షణాలను వర్ణించిన సాధువే ఈయన. ఫరీద్ ఆయనను అడిగాడు -

"బాబా! 20 సంవత్సరాలపాటు నన్ను ఎందుకు త్రిప్పారు?"

సాధువు ఇలా అన్నారు -

"అప్పుడు నావద్దకు కుతూహలం, ఉద్ధృతి కలిగిన పిల్లవాడు ఫరీద్ వచ్చాడు. ఇప్పుడు 20 సంవత్సరాల కఠోర తపస్సువల్ల నిగ్గుతేలి సమర్పితుడైన శిష్యుడు ఫరీద్ వచ్చాడు. నాయనా! గురువు శిష్యుడికి మాత్రమే దొరుకుతాడు. నీవు శిష్యుడవు కాగానే మేము నీకు దొరికాము."

## గురుభక్తికి పరీక్ష

గురుదేవుల అంతఃకరణం నుండి వెలువడిన ఈ భావతరంగాలే హిమాలయవాసి అయిన మహా ఋషిసత్తాను వారి ఇంటికి లాగికొనివచ్చాయి. అప్పుడు ఆయన వయస్సు 15 సంవత్సరాలు మాత్రమే. అయితే, చాలాకాలం వ్రతం చేయడంవల్ల ఆయన మనోభూమి అలా నిర్మాణం అయింది. సంకల్పం, ధైర్యం, శ్రద్ధ అనే మూడు గుణాలు ఏకమైనప్పుడు వ్యక్తిలో అలాంటి మనోభూమి నిర్మాణం అవుతుంది. ఆ మనోభూమి అధ్యాత్మయొక్క దివ్య అవతరణను ధారణ చేయగలుగుతుంది. ఈ పాత్రతయే శిష్యత్వం. గురువు దొరకడంలోకాక - పాత్రతను పెంచుకోవడంలో సమయం పడుతుంది.

ఏకలవ్యుడు చేసిన ద్రోణాచార్యుని మట్టిబొమ్మ ద్రోణాచార్యునికన్న గొప్ప పని సాధించింది.

కబీరు అంటరానివాడు. అందువల్ల ఆయనకు దీక్ష ఇవ్వడానికి రామానందుడు నిరాకరించాడు. అప్పుడు కబీరు ఒక ఉపాయం ఆలోచించాడు. కాశీఘాట్‌లో రామానందుడు రోజు స్నానానికి వచ్చే దారిలో మెట్టుమీద తెల్లవారుజామునే కబీరు పడుకున్నాడు. రామానందుడు బయలుదేరేసరికి, ఆ చీకటిలో ఆయన కాలు కబీరు గుండెమీద పడింది. ఆవిధంగా కబీరు పాత్రతకు పరీక్ష జరిగింది. రామానందుడు కబీరును తన శిష్యునిగా స్వీకరించారు.

పాత్రతకు పెట్టిన పరీక్షలో నెగ్గకుండా సద్గురువు దొరకడు. ఏదో కారణాన దొరికినా - పాత్రత లేని వ్యక్తి వట్టి చేతులతో తిరిగి రావలసివస్తుంది. ఎంతో శ్రమించి కష్టించి సంపాదించినదాన్ని పాత్రతలేని వ్యక్తి యొక్క విలాసాలకూ, అహంకారానికీ, దుబారాకూ అందజేయడం జరగదు. తీసుకునే వ్యక్తికి ఉన్న ప్రామాణికత ఏ స్థాయిదో, ఇచ్చే దానిని ఎలా ఉపయోగిస్తాడో తెలుసుకునే విజ్ఞత ఇచ్చే వ్యక్తికి ఉంటుంది. ఈ గీటురాయిపై గీసినప్పుడు నిలువనివారి పప్పులు ఉడకవు.

## విచిత్రములైన పరీక్షలు

ఈ పరీక్షలు విచిత్రంగా, విలక్షణంగా, కఠోరంగా ఉంటాయి. గురుజిఎఫ్ విషయంలో ఔస్‌పెన్‌స్కీ ఇలా వ్రాశారు - ఆయన క్రొత్తగా వచ్చేవారిపట్ల చాలా కటువుగా వ్యవహరించేవారు. అతడు వాటిని సంతోషంగా భరిస్తే, ఆయన తన రహస్య సాధనలను అతడికి బోధించేవారు. ఒకసారి ఒక పాత శిష్యుడు ఆయనను అడిగాడు - మీ వ్యక్తిత్వం ఇంత ప్రేమమయం కదా; మీరు ఇంత కఠోరంగా ఎందుకు వ్యవహరిస్తారు, అని. గురుజిఎఫ్ ఇలా జవాబిచ్చారు - నేను

**బంధువులను మనకు భగవంతుడు ఇస్తాడు. స్నేహితులను మనం వెదుక్కోవాలి.**

రాళ్ళలోనుండి వజ్రాలను ఏరుతున్నాను. వజ్రాలను ఏరి వాటిని పదునుపెడతాను. రాళ్ళను పారవేస్తాను.

రామకృష్ణ పరమహంస తమ సిద్ధులన్నింటినీ వివేకానందునికి ఇవ్వాలని అనుకున్నారు. ఆ సమయంలో వివేకానందుని కుటుంబం ఆకలితో అలమటిస్తోంది. అయినా, తుచ్ఛమైన సిద్ధులు కాక, తనకు ఈశ్వరీయ ప్రేమ కావాలని వివేకానందుడు స్పష్టంగా తెలిపాడు.

తనకు శిష్యరికం చేయాలని వచ్చిన ఒక వ్యక్తితో విజయకృష్ణ గోస్వామి ఇలా అన్నారు - 12 సంవత్సరాలపాటు గోవర్ధన పర్వతానికి నిర్విరామంగా ప్రదక్షిణాలు చేసి, 13వ సంవత్సరంలో నావద్దకురా. అందుకు కారణం అడగగా, ఆయన ఇలా అన్నారు - 12 సంవత్సరాలపాటు తపించే ధైర్యం లేని వ్యక్తికి నా శిష్యుడయే అర్హత లేదు.

గురుదేవులు అత్యంత కఠోరమైన పరిస్థితులను లెక్కలేనన్ని మారులు ఎదుర్కొన్నారు. ఆ పరీక్షల గురించి వారిలా వ్రాశారు -

## శిష్యుడిని క్షాళనచేసే పద్ధతి

"గురువు, భగవంతుడు తమ కోర్కెలు తీర్చే సాధనాలని జనం భావిస్తారు. తన ఇష్టం వచ్చినట్లు వారిని నడపాలని కోరుకుంటారు. అయితే, సాధనాత్మక జీవనంలో ఈ వికృతి సాగదు. సాధన ప్రారంభమే వ్యక్తి తన ఇచ్ఛలూ, కోరికలూ అన్నింటినీ వదులుకోవడంతో జరుగుతుంది. చాకలి ఉతికినట్లు బండమీద బాదిబాది, నా గురువు నన్ను క్షాళన చేశారు. దూదేకేవాడు ఏకినట్లు నన్ను ఏకారు."

వారి జీవితమంతా ఇలాంటి కఠిన పరీక్షల క్రమం నిరంతరంగా సాగింది. అయినా, వారి అస్తిత్వం నుండి ఒకే స్వరం నినదిస్తూ వచ్చింది -

## గురుదేవుల సర్వసమర్పణ

"గురువంటే గురువే. ఆదేశమంటే ఆదేశమే. అనుశాసనమంటే అనుశాసనమే. సమర్పణ అంటే సమర్పణయే. మార్గదర్శకునిపై నమ్మకం ఉంచాను. నన్ను నేను ఆయనకు అప్పగించుకున్నాను. ఇక - అక్కరకు రాని మాటలు చెప్పడం, పనిలో తర్కం, సందేహం ఎందుకు?"

మరో సందర్భంలో వారిలా వ్రాశారు -

"మేము మా శరీరం, మనస్సు, మెదడు, ధనం, అస్తిత్వం, అహంకారం - అన్నింటినీ మార్గదర్శకునికి అమ్మివేశాము. మా శరీరాన్నే కాక అంతరంగాన్ని కూడ ఆయన కొన్నారు. నాకు కోరిక అనేది మిగులలేదు. భావనల పొంగును అంతనూ ఆ అజ్ఞాత శక్తి నియంత్రణకు అప్పగించాము."

## గురువుతో అద్వైత సిద్ధి

అస్తిత్వాన్ని ఇలా సమర్పించడం ఎంతో భయం కలిగిస్తుంది. నేను లేకపోతే, నాది లేదు. అప్పుడు ప్రపంచంలో జీవించి ప్రయోజనం ఏమిటి ? అంతా నష్టమే. ఈ విషయంలో గురుదేవులు తమ అనుభవాన్ని ఇలా వర్ణించారు -

"ఇది నష్టం వచ్చే వ్యాపారం కాదు - లెక్కలేనన్ని రెట్లు లాభం వచ్చే వ్యాపారం. మేము మమ్మల్ని, మా శరీరాన్ని, మా మనస్సును ఆయనకు అమ్మాము. అందుకు బదులుగా ఆయన తనను తాను మాకు అప్పగించుకున్నారు. మా తుచ్ఛత ఆయన చరణాలకు సమర్పించబడింది. వారు తమ దివ్యత్వాన్ని మాపై వర్షించారు. వెదురు ముక్క తనను తాను పూర్తిగా బోలుగా తయారుచేసుకుని మురళిగా ప్రియతముని పెదవులను తాకింది. దాని నుండి మనోహరమైన రాగ రాగిణులు వెలికి సాగాయి.

"అప్పుడు నా ఇచ్ఛకు అస్తిత్వం లేకుండా పోయింది. ఆయన ప్రతి ఇచ్ఛా నా ఇచ్ఛగా మారినప్పుడు - అద్వైత స్థితి ఏర్పడింది. బ్రహ్మకూ, జీవునికీ కలయిక ఏర్పడినప్పుడు వచ్చే బ్రహ్మానందంవలె అది ఎంతో సుఖదాయకం అనిపించింది. నిండు మనస్సుతో, ప్రతిఫలం ఆశించకుండా, సమగ్రమూ సంపూర్ణమూ అయిన ఆత్మసమర్పణ చేయబడినప్పుడు - ఆయన కూడ తన గొప్పతనంలో, ఉదారతలో, ప్రతిఫలం ఇవ్వడంలో ఎలాంటి లోటూ రానివ్వలేదు. మాలో ప్రత్యక్షంగా కనపడేదానికన్న వేయి రెట్లు, లక్ష రెట్లు పరోక్షంగా దాగి ఉంది. ఇది మా సంపాదన కాదు. అక్షరాలా ఇది మార్గదర్శక సత్తా

**పడవ నీటిలో నిలవవచ్చు. నీరు పడవలో నిలువకూడదు. సంసారంలో ఉండవచ్చు. సంసారాసక్తి ఉండకూడదు.**

ఇచ్చిన వరమే. ఆయనతో మా ఆత్మ వివాహం చేసుకున్నది. తనను తాను అర్పించుకున్నది. ఫలితంగా – ఆయన వైభవమంతామా చేతికి వచ్చింది. ఈవిధంగా – ఈ సమర్పణ మాకు నష్టపడే బేరంగాకాక లాభపడే బేరంగా పరిణమించింది."

## వరంగా తిరిగివచ్చిన సమర్పణ

గురుశిష్య సంబంధం రాగాత్మక సంబంధం. ప్రేమ సంబంధాలకు అత్యున్నత ఆదర్శం. సాంసారిక సంబంధాలలో అన్నింటికన్న సన్నిహితమైనవి రెండే రెండు – తల్లీ బిడ్డల సంబంధం, భార్యా భర్తల సంబంధం. అయితే, ఈ సంబంధాల భావ భూమిక శరీరానికీ, మనస్సుకూ పరిమితమైనది. మరోప్రక్క – గురుశిష్య సంబంధం ఆత్మయొక్క వ్యాపకత్వంలో ఫలిస్తుంది, పరిపుష్టం అవుతుంది. గురుదేవుల మాటలలో –

"మా మార్గదర్శకునిపట్ల ఆయన ప్రేమ ఎలాంటిది?"

మరి, మర్గదర్శకులకు మాపట్ల చాలా హెచ్చు ప్రేమ ఉంది."

ఆ అనుభూతిని వారి మాటలలోనే వినండి –

## విశ్వప్రేమగా ఎదిగిన గురుప్రేమ

"మా మార్గదర్శకులపట్ల మా ప్రేమ సాధన పతివ్రత అయిన స్త్రీ యొక్క అనన్య ప్రేమ వంటిది. ఆయన ప్రసన్నత మా ప్రసన్నత. ఆయన ఇచ్ఛ మా ఇచ్ఛ. ఎన్నడూ ఏదీ కోరాలనే – అడగాలనే ఆలోచనే రాలేదు నాకు. ఇదే ఆలోచిస్తూ వచ్చాను; నావద్ద ఉన్నదంతా, నా సంపద, నా శక్తియుక్తులు అన్నీ ఈ ఆరాధ్యుని చరణాలకు సమర్పితంకావాలి; ఆయన ఆశయాల కోసం ఖర్చు కావాలి. అలాంటి అవకాశాలు ఎప్పుడు వస్తే, ఎన్ని వస్తే – మా సంతోషం, మా ఉల్లాసం అంతగా పెరిగేది. గురుదేవులపట్ల జరిగిన మా ప్రేమ – సాధన మరో రూపంలో అద్భుత వరమై తిరిగివచ్చింది.

"ఆయన ఇచ్చిన ప్రతి ఆదేశం, ప్రతి సంకేతం బ్రహ్మవచనంగా శిరోధార్యం అయింది. 'ఏదీ అడగకూడదు, అంతా ఇవ్వాలి' – అన్నది అజరామరమైన ప్రేమ సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని మేము ఇద్దరం శిఖరాగ్రం వరకు అమలు జరిపాము. ఆవైపు నుండి ఏది జరిగింది అనేది మా వర్ణనా శక్తికి అందనిది. మావైపు నుండి మేము ఇంతవరకే చెప్పగలం – భగవంతుని నిర్దేశంకన్న మిన్నగా మేము ఆయన నిర్దేశాన్ని శిరసావహించాము. రుచించనిదీ, కష్టం కలిగించేదీ అయిన సందర్భం ఏదైనా వచ్చినప్పటికీ – మేము దానిని సహజంగా స్వీకరించాము. ప్రేమయొక్క విధానం అదే. ప్రేమకు పాత్రులం కావడానికి మావైపు నుంచి మేము చేయగలిగింది అంతా చేశాము. ఫలితంగా గురుదేవుల అనుగ్రహ అమృతం కూడ మాపై నిరంతరంగా వర్షించింది. **ప్రేమతత్వ సంవర్ధన సాధన గురుభక్తితో ప్రారంభమై పరమేశ్వర భక్తిగా పరిణమించింది.** ఈ సాధనలో మాకు ఎంత హెచ్చు ఆనంద ఉల్లాసాలు అనుభవం అయినాయంటే – వాటిముందు ఎంత గొప్ప ప్రాపంచిక సుఖం అయినా దిగదుడుపే అయింది. మా గురువుపట్ల పెరుగుతూ వచ్చిన మా ప్రేమ–సాధన ఆత్మ–ప్రేమగా, విశ్వ–ప్రేమగా వికసిస్తూ వచ్చింది. ఆ ఆంతరిక భూమిక యొక్క ప్రతిధ్వని దర్శకులకు ఒక దివ్య జీవనంగా కానవచ్చింది."

పరమపూజ్య గురుదేవుల గురుప్రేమ వెలుగులో మనంకూడ పరీక్షించుకుందాం – మన శిష్యత్వం ఎలా ఉందని. మనిషి ఎవరిని ప్రేమిస్తే వారి అభ్యున్నతి కోసం, వారి సుఖం కోసం ఎంతటి మహత్తర త్యాగాలకయినా సిద్ధపడతాడు. అంతఃకరణలో గురుప్రేమ అనే పవిత్ర జ్యోతి జ్వలిస్తూ ఉంటే – మన శరీరం, మనస్సు, అంతఃకరణ, భౌతిక సాధనాలు అన్నింటిలో అత్యధిక భాగాన్ని సమాజ సంస్కృతుల సేవకు అంకితం చేయడానికి మనం వెనుకడుగు వేయము. అప్పుడు ఎలాంటి ఆవేశం ఉప్పొంగుతుందంటే – సాంసారికమైన ప్రలోభనం ఏదీ దానిని అడ్డుకోలేదు. మన ఆరాధ్యుని కోసం, వారి ఆదర్శాల కోసం సర్వస్వాన్నీ సమర్పించినప్పటికీ – అంతఃకరణ దివ్య ఆనందంతో పొంగిపొరలుతుంది. ఆ ఆనందాన్ని భక్తియోగ రహస్యవేత్తలు మాత్రమే తెలుసుకోగలుగుతారు.

★★★

**ఆశ దుఃఖానికి హేతువు.**

## ముఖచిత్ర కథనం - 2

# సద్గురువుగా గురుదేవుల విలక్షణ భూమిక

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశౌ హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

(భగవద్గీత 2 - 61)

అనగా -

సాధకుడు ఇంద్రియాలన్నింటినీ అదుపులో ఉంచుకుని నిండు మనస్సుతో నన్ను ధ్యానిస్తూ కూర్చోవాలి. ఎందుకంటే - ఇంద్రియాలను అదుపు చేసిన వ్యక్తియొక్క బుద్ధి స్థిరంగా ఉంటుంది.

ఇది స్థితప్రజ్ఞుడైన యోగి లక్షణం; ఆదర్శ సాధకుని పరిభాష, బ్రాహ్మీ స్థితిలో ఉండి, బ్రహ్మానందాన్ని పొందిన మహాయోగి పరమపూజ్య గురుదేవులు. వారి జీవితం మూర్తీభవించిన స్థితప్రజ్ఞత్వం. బాహ్యమైన అలజడులకు ఏమాత్రం చలించకుండా వారు తమ సాధనలో నిమగ్నం అయ్యేవారు.

### గురువు నిర్దేశం శిరోధార్యం

ఇది తాంత్రిక స్థాయి సాధన. నేడు సైతం వారి కారణ శరీరం ఆ సాధనను కొనసాగిస్తూనే ఉంది.

"ప్రజాసేవా రంగంలో ప్రవేశించే ప్రతి వ్యక్తీ మొదట సాధకుడు కావాలి" - అని గురుదేవులు చెప్పేవారు. సాధన ప్రతి మనిషికీ తప్పనిసరి అని వారు పేర్కొనేవారు. ఎందుకంటే - "సాధన ద్వారా భగవత్ చేతన ప్రవహించాలని పరమేశ్వరుడు కోరుతాడు. సాధన ద్వారా పరమేశ్వరుడు తన వైభవాన్ని మానవ వ్యక్తిత్వంలో వ్యక్తీకరిస్తాడు." వారిలా చెప్పేవారు - "సాధన వ్యక్తిత్వంలో గొప్ప విప్లవం."

గురువుకు తనకు తాను సమర్పించుకున్న శిష్యుడు గురువు నిర్దేశాల ప్రకారం నడుచుకుంటే, అతడి వ్యక్తిత్వం వికసిస్తుంది. ఆ వికాసం ఆధ్యాత్మిక వికాసానికి వేదిక. ఒకోసారి శిష్యుడు అతివాదపు ఆకర్షణలో పడి, పలువిధములైన ప్రక్రియలను చేపట్టుతాడు. కానీ, దానివల్ల ఏదీ చేతికి అందదు. అంతే కాదు. సాన్నిహిత్యంవల్ల లభించిన అవకాశాన్ని కోల్పోతాడు. ఒక సంఘటన ఈ వాస్తవాన్ని బోధిస్తుంది.

### అనుష్ఠానానికి నాలుగు అంతరాయాలు

శాంతికుంజ్‌లో చాంద్రాయణ సాధన శిబిరం నడుస్తోంది. ఇతరులు బయటనుండి వచ్చి సాధన చేస్తున్నారనీ, శాంతికుంజ్‌లో ఉన్న మాకు ఆ అవకాశం లేకపోతోందనీ నాకు చాలా బాధ కలిగింది. అనుమతి ఇస్తే శిబిరంలో పాల్గొంటానని గురుదేవులను అడిగాను. గురుదేవులు అందుకు కాదనలేదు, అవుననీ అనలేదు. వారిలా అన్నారు - "నీవు ఇక్కడ చేస్తున్న మిషన్ కార్యమే నీ సాధన. అయితే - కనీసంగా మూడు మాలలు, అత్యధికంగా 11 మాలలు జపం చేయడానికి రోజూ ఒక గంట సమయం కేటాయించు. దాన్ని ఒకేసారి కాని, రెండు భాగాలుగా కాని చెయ్యి. నీవు ఇది చేస్తే చాలు. మిగతాది మేము చూసుకుంటాం." వారి మాటమీద నమ్మకం ఉంచి, నా కార్యకుశలతను నేను పెంచుకోవలసింది. కానీ, నేనిలా అన్నాను - "మీరు అనుమతి ఇస్తే అయిదు చాంద్రాయణాలతోపాటు అయిదు లక్షంబావు జప అనుష్ఠానాలు చేయాలనే కోరిక తీవ్రంగా ఉంది. అనుమతి ఇస్తే నామీద కృప చూపినట్లు అవుతుంది." ప్రేమమూర్తి అయిన గురుదేవులు వద్దనలేదు. అవుననీ అనలేదు. చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

సరైన తిథి చూచి, సాధనా, అనుష్ఠానం ప్రారంభించాను. తెల్లవారుజామునే లేచి సాధన చేయవలసి వచ్చేది. ఆ తర్వాత అధ్యయనం, రచన, ఇతర మిషన్ పనులు జరిగేవి. నాలుగైదు రోజులపాటు ఈ దినచర్య సక్రమంగా సాగింది.

ఆరవరోజు ఉదయం గురుదేవులు తమ నిర్దేశాలను

**దుష్టులు తమ తప్పులను దాచుతారు. మంచివాళ్ళు తమ తప్పులను సరిదిద్దుకుంటారు.**

వ్రాయడానికి పిలిచారు. వారి ఎదుట కూర్చున్నాను కాని, మనసంతా ఎన్ని మాలలు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని మాలలు చేయాలి అనే విషయంమీద లగ్నమై ఉంది. మాటల సందర్భంలో గురుదేవులు అక్కడ ఉన్న కార్యకర్తలతో ఇలా చెప్పారు –

“మీరందరూ కర్మయోగులు కావాలి. మీరంతా మాలలు లెక్కపెడుతూ కూర్చుంటే, ఇది భజనానందుల, బాబాల మఠం అయిపోతుంది. సమాజ నవ నిర్మాణంకోసం చేపట్టిన పథకాలు ఏమవుతాయి? పలాయనవాదుల గుంపు తయారవుతుంది ఇక్కడ.”

కొంతసేపు చర్చ జరిగింది. సమావేశం పూర్తయింది. అందరూ క్రిందకు దిగారు. గురుదేవులు వెనుకనుంచి పిలిచి, నన్ను ఆపి, ఇలా అన్నారు – “నీవు ఇవాళ లేబరేటరీ పరికరాలు తేవడంకోసం చండీగఢ్, అంబాలా వెళ్ళు, వీరేశ్వర్‌ను వెంట తీసుకువెళ్లు.”

అనుష్ఠానం జరిపి సిద్ధులు పొందాలనే కలలలో మునిగి ఉన్న నా ఆలోచనకు దెబ్బ తగిలింది. ఆ పని నెలరోజుల తర్వాత చేయకూడదా – అని అడిగాను. ఈలోగా అనుష్ఠానం పూర్తవుతుందని నా ఉద్దేశ్యం. ఇలా ఆదేశం అందింది – “వెంటనే వెళ్లాలి. ఆ నిర్ణయం జరిగిపోయింది. బ్రహ్మవర్చస్‌కు ఉపకరణాలు వెంటనే అవసరం అవుతాయి.”

తల ఊపి క్రిందకు దిగాను. అయినా, వందనీయ మాతాజీ గురుదేవులను ఒప్పించవచ్చనే ఆశాకిరణం మిగిలింది. ఆ రాత్రి చర్చించి మరునాడు ఉదయం చెపుతానని మాతాజీ అన్నారు. రాత్రి గడిచింది. జపం పూర్తిచేసుకుని ప్రణామం చేయడానికై మేడమీదకు వెళ్ళాను. గురుదేవులు ఇలా అడిగారు – “ఏం బాబూ! తయారు కాలేదా? త్వరగా బయలుదేరాలి. అప్పుడే పని పూర్తి చేసుకుని రెండు రోజులలో రాగలుగుతావు. చూడు. జపం గురించి ఆలోచించకు. నీ మిగతా జపం మేము చేస్తాం. ఆహారం పూర్వంలాగే తీసుకో. నాటకాలు జరపకు.” నిర్ణయం జరిగిపోయింది. ఇక వెళ్లవలసిందే.

బస్సులో అంబాలా వెళుతూ ఇలా ఆలోచించాను – ‘ఇలాంటి విఘ్నాలు వస్తూనే ఉంటాయి; సామాగ్రి తెచ్చుకుని, ఏర్పాట్లు చేసుకుని వచ్చే పూర్ణిమ నుండి అనుష్ఠానం ప్రారంభిస్తాను.’

అంబాలా, చండీగఢ్‌లలో పని అయిదు రోజులలో పూర్తయింది. తిరిగి వచ్చి, గురుదేవులకు పాదాభివందనం చేసి, అనుష్ఠానానికి అనుమతి అడిగాను. ‘పూర్ణిమ రానివ్వు, చూద్దాం’ – అన్నారు వారు.

బనారస్ వెళ్ళి బ్రహ్మవర్చస్ గ్రంథాలయం కోసం గ్రంథాలు తీసుకువచ్చే పథకాన్ని పూర్ణిమకు ముందే గురుదేవులు రచించసాగారు. ఈ పథకం నెలరోజుల తర్వాత అమలు జరగాలనీ, దానిలో నాపేరు ఉండకూడదనీ, మరొకరు వెళ్లాలనీ నేను మనసులో కోరుకున్నాను.

పూర్ణిమనాడు వందనీయ మాతాజీ చేత చేతికి రక్షాసూత్రం కట్టించుకున్నాను. గురుదేవుల వద్దకు వెళ్లి ప్రణామం చేశాను. నా నుదుట తిలకం చూచి వారిలా అడిగారు – “ఇవాళ పుట్టిన రోజూ, తిలకం ధరించావు?” నేను వెంటనే ఇలా జవాబిచ్చాను – “పుట్టిన రోజు కాదండి. ఇవాళ పూర్ణిమ. గతంలో మధ్యలో ఆగిపోయిన అనుష్ఠానాన్ని పూర్తి చేయాలని అనుకున్నాను.”

గురుదేవులు నవ్వుతూ ఇలా అన్నారు – “మంచిదే, చెయ్యి.” ఆశీస్సు అందింది. ఇక ఇబ్బంది లేదు – అనుకున్నాను. అనుష్ఠానం ఆరంభించాను. 12 రోజులు గడిచాయి. అప్పుడు తెలిసింది – ఇవాళో రేపో నేనే బనారస్ వెళ్లవలసి ఉంటుందని. వీలైతే 20 రోజుల తర్వాత ఆ నిర్ణయం అమలు జరగాలని పై కోర్టుకు (మాతాజీకి) అపీలు చేసుకున్నాను. ప్రయోజనం లేకపోయింది. గురుదేవులు ఇలా అన్నారు – “ఈ పని ముఖ్యమైనది. కనుక ఇదే ముందుగా చేయాలి. మిగతా విషయాలు మాకు వదిలివెయ్యి.”

బనారస్ యాత్ర జరపవలసివచ్చింది. పది రోజులు పట్టింది. అయితే, ఎంతో విలువైన సాహిత్యం సేకరించబడింది. అనుష్ఠానాన్ని ప్రారంభించాలని మూడవసారి ప్రయత్నించాను.

**ఇచ్చిపుచ్చుకోవడాలు లేకుండా సమాజ జీవితం ఉండదు.**

మూడవ సారీ, నాల్గవసారీ కూడ ఇదే పునరావృతం అయింది. గురుదేవులు నా ఆత్మిక ఉన్నతిని కోరడంలేదని నాకు అనిపించింది. నేను తప సాధన చేయాలని కోరుతున్నాను. నన్ను కర్మయోగిని చేయాలని వారి ఉద్దేశ్యం. వారు స్వయంగా 24 లక్షల పురశ్చరణలు 24 జరిపారు. మరి నన్ను ఎందుకు చేయనివ్వరు? నేనిలా మథనపడుతూ ఉండగా, మేడమీద నుండి పిలుపువచ్చింది. నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని వారిలా అన్నారు –

"ఏమిటి సంగతి! జప తపాలవెంట ఇంతగా పరుగులు తీస్తున్నావేమిటి? నా మాటమీద నమ్మకం లేదా ఏమిటి? కేవలం మూడు మాలలు చెయ్యి. అత్యధికంగా 11 మాలలు చెయ్యి. సంవత్సరంలో రెండుమారులు నవరాత్రులు వస్తాయి. అప్పుడు అనుష్ఠానాలు చెయ్యి. గురువారాలు అస్వాద భోజనం చెయ్యి, అయితే ఆహారాన్ని అనవసరంగా తగ్గించకు. సాధనలో నియమపాలన, నిరంతరత్వం అవసరం. తప తితీక్షలలో అతివాదం వద్దు."

నేనిలా అన్నాను – "మాత రూపంలో కాని, జ్యోతి రూపంలో కాని గాయత్రీ మహాశక్తిని దర్శించాలని నా కోరిక. అందుకోసం అనుష్ఠానాలు జరపాలని తలపెట్టాను. కానీ, మీరు వాటిని పూర్తి చేయనివ్వలేదు. ఏదో ప్రారబ్ధం నన్ను వెన్నాడుతూన్నదేమో."

గురుదేవులు నవ్వి ఇలా అన్నారు – "అలాగా. నీకు గాయత్రీ మహాశక్తి దర్శనం కావాలికదా. మరి ఆ విషయం నాకెందుకు చెప్పలేదు."

## వెలుగుముద్ద అయిన గురుదేవులు

ఇలా చెప్పి, వారు మౌనం వహించారు. చూస్తూ ఉండగానే గురుదేవుల శరీరం ఒక వెలుగు ముద్దగా మారిపోయింది. సహజంగానే నా కళ్లు మూసుకుపోయాయి – అంత వెలుగును సహించలేక. ఆ తర్వాత గాయత్రీ మాత సాక్షాత్కరించింది. కొద్ది క్షణాల తర్వాత గురుదేవులు కూర్చొని నవ్వుతున్నారు. "ఇంకా కావాలా?" అని అడిగారు. నేనన్నాను – **"చాలు. మీరు నా కోరిక తీర్చారు. మనసులోని భ్రమలనూ, శంకలనూ తొలగించారు. సాక్షాత్తు ఆదిశక్తి రూపమైన గురుసత్తాపట్ల సమర్పణ ఇక ఎన్నడూ తగ్గదు. మీరు ఎలా చెపితే అలా చేస్తాను."**

ఈ సంఘటన కొందరికి అతిశయోక్తిగా, భ్రమగా అనిపించవచ్చు. కానీ, గురుదేవులను సన్నిహితంగా దర్శించినవారికీ, అర్థం చేసుకున్నవారికీ ఎలాంటి అనుమానమూ కలగదు. ఈ సంఘటన నా జీవితంలోని ఒక అమూల్య నిధి అయింది.

## గీతలోని అనన్య భక్తి

వాస్తవానికి గురుదేవులు చెప్పినది గీతలో కృష్ణపరమాత్మ బోధించినదే.

**నతు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుసా ।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగమైశ్వరం ॥**

11 – 8

అనగా –

కాని నీ ఇప్పటి మానవ నేత్రముతో నా విశ్వరూపాన్ని చూడలేవు. కనుక నీకు దివ్య నేత్రాన్ని ప్రసాదిస్తున్నాను. దానితో నా ఈశ్వర యోగమును చూడు.

**మయ్యేవ మన ఆధత్స్వమయి బుద్ధిం నివేశయ ।**

12 – 8

అనగా –

నాయందే నీ మనస్సును విశ్రమింపజేయి, నాయందే నీ బుద్ధిని స్థాపించు.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**

18 – 65

అనగా –

నాయందు మనస్సు కలవాడవు, నా భక్తుడవు అనురక్తుడవు, నాకు యజ్ఞం చేసివాడివి కమ్ము. నాకు

**ధనం లేని కోరిక, సమర్థత లేని కోపం ఆత్మవినాశనానికి దారితీస్తాయి.**

నమస్కరించు.

## సమర్పణలోనే సాఫల్యం

సాధనా రంగంలో గురుదేవులు సాధించిన సాఫల్యాలు వారిని సాక్షాత్తు సూర్యమయంగా చేశాయి. అవన్నీ ఈ సమర్పణ ప్రసాదించినవే.

1926 వసంత పంచమి రోజున వారు తమను తాము సూక్ష్మ శరీరంలో ఉన్న గురుసత్తాకు అప్పగించుకున్నారు. తమ యోగ క్షేమాలను చూచే పనిని ఆయనకు అప్పగించారు. తాను నిమిత్తమాత్రుడుగా నిలిచారు. 1990 గాయత్రీ జయంతి వరకు ఆ గురుసత్తా పనినే చేస్తూ గాయత్రీ మాత ఒడిలోనికి వెళ్లిపోయారు.

సమర్పణ ఆ స్థాయిలో ఉంటే, సాధన ఫలించడం తథ్యం. పని చాలా చిన్నది కావచ్చు. కానీ, అది దైవకార్యంకోసం జరగాలి. ఆయన యోజనలో అంతర్భాగం కావాలి. అప్పుడు సాఫల్యం లభించడం నిశ్చయం. గురుదేవుల ఆత్మకథ సాధన విజ్ఞానంలో మనకు నేర్పే పాఠం – ఆరాధ్యునిపట్ల సాంద్రమైన శ్రద్ధ, సంపూర్ణ సమర్పణ. ఆ సమర్పణ ఉన్నప్పుడు, వ్యక్తి సిద్ధులను వెదకడు. సిద్ధులే ఆయన వెంటపడతాయి. అతడు వాటికి దూరంగా పారిపోతూ ఉంటాడు.

## ఉపాసనలు సిగ్నల్‌లు మాత్రమే

గురుదేవులు జీవితమంతా సాధన చేశారు, సాధన చేయించారు. 40వ దశకంలో గాయత్రీ చర్చా కాలమ్‌ను ప్రారంభింపజేసిన తర్వాత క్రమంగా పంచకోశ సాధన, కల్పసాధన, ప్రాణ ప్రత్యావర్తన సాధన, కుండలినీ సాధన, జీవన సాధన, కుటీ ప్రవేశం మున్నగు వాని కేంద్ర బిందువు సాధకుని సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సాధనామయం చేయడం. అందుకు మొదటిమెట్టు ఆత్మ శోధన (ఆత్మ క్షాళన). 1973 జూన్ నెల అఖండజ్యోతి ప్రాణ ప్రత్యావర్తన ప్రత్యేక సంచికలో వారిలో వ్రాశారు –

“చిన్న చిన్న పూజలూ, కర్మకాండలూ ఆత్మ కళ్యాణం లేక దైవ అనుగ్రహాన్ని అందిస్తాయని భావించడం పూర్తిగా భ్రమ. ఉపాసనాత్మక ప్రక్రియలు రైలు పట్టాల ప్రక్క ఉండే సిగ్నల్‌ల వంటివి; రోడ్లప్రక్క ఉండే సైన్ బోర్డుల వంటివి. అవి దిశను చూపుతాయి. అంతే. పని సత్‌ప్రవృత్తులను అవలంబించడంవల్ల, పుణ్య కార్యాలు చేయడంవల్ల జరుగుతుంది. కనుక – ప్రాయశ్చిత్తం ద్వారా ఆత్మక్షాళన అనే ఆత్మిక ప్రగతి పథాన్ని చేపట్టవలసి ఉంటుంది.”

(61,62 పుటలు)

## ప్రాయశ్చిత్తం, ఆత్మక్షాళన

అయితే, పవిత్రత పెంపుదల నిరంతరం జరిగే ప్రక్రియ. గురుదేవులు ఈ ప్రక్రియను సులభం చేశారు. ఆత్మక్షాళన చేసుకుని, పవిత్రతను కణ కణంలో నింపుకుని, ప్రతివ్యక్తీ సాధనా రంగంలో ముందుకు పోగలుగుతాడని చెప్పారు. గీతాకారుని వలె వారు ఇలా హామీ ఇచ్చారు కూడా –

**అపి చేత్ సుదురాచారో భజతే మామ్ అనన్యభాక్ ।**
**సాధురేవ సమంతవ్యః సమ్యగ్వ్యవసితోహి సహః ॥**

9 – 30

అనగా –

ఘోరమైన దురాచారి అయినా అనన్య భావంతో నా భక్తుడై నన్ను భజిస్తే – అతడు సాధువుగా పరిగణించ దగినవాడు అవుతాడు. ఎందుకంటే – అతని అనన్య భజన సంకల్పం సరైనది, సంపూర్ణమైనది.

## సంకల్పశీలత, పవిత్రత ఆవశ్యకం

ఈ సంకల్పశీలతనూ, కణ కణంలో వ్యాపించే ఉండే పవిత్రతనూ మనం కోరితే – గురుదేవుల కారణ శరీరం మనకు వాటిని ప్రసాదించడం నిశ్చయం. అప్పుడు మన సాధన సార్థకం అవుతుంది, సిద్ధిని కలిగిస్తుంది.

– 1993 మార్చి అఖండజ్యోతి నుండి

★★★

**నలుగురూ రావడం ఆరంభం. నలుగురూ కలియడం అభివృద్ధి. నలుగురూ కలసి పనిచేయడం విజయం.**

# ముఖచిత్ర కథనం - 3

# గురుదేవుల సాధనలో మూడు అద్భుతాలు

## సాధనలోని మూడు తత్త్వాలు

పరమపూజ్య గురుదేవుల సాధనలో మూడు తత్త్వాలు ఉన్నాయి - (1) గురువు పట్ల సమర్పణ, (2) విశ్వమానవులపట్ల ఆర్ద్రమైన సంవేదన, (3) జీవితంలోని ప్రతి రంగాన్నీ సర్వాంగ సుందరంగా చేయడానికై నిరంతర కృషి.

పేరు ప్రతిష్ఠలు రావాలనే కోరిక మనిషి స్వభావంలో ఉంది. మనిషి అందుకోసం సంఘర్షిస్తూ ఉంటాడు. అయితే అది దిగజార్చే ప్రక్రియ. సాధన మార్గంలో ఈ ప్రక్రియకు ఆస్కారం ఎక్కడిది? కానీ, అలవాటు మారదు. ఆ వెలుగు బాటలో సైతం చీకటి ప్రవేశిస్తుంది. "నేను గురూజీని అవుతాను", "నేను వివేకానందను అవుతాను" - అని మనిషి కలలుకంటూ ఉంటాడు. కానీ, సాధన అంటే అర్థం 'అహం'ను వదులుకోవడం.

## సమర్పణకు అర్థం

గురుదేవులు ఈ సాధనను ఎలా చేశారో వారి మాటలలో తెలుసుకుందాం -

"మేము మా శరీరాన్నీ, మనస్సునూ, మెదడునూ, ధనాన్నీ, అస్తిత్వాన్నీ, అహంకారాన్నీ అన్నింటినీ మార్గదర్శక సత్తా చేతుల్లో పెట్టాము. మా శరీరాన్నే కాక, మా అంతరంగాన్ని కూడ ఆయన జయించారు. నాదంటూ కోరిక ఏమీ మిగులలేదు. భావనలన్నింటినీ ఆ అజ్ఞాత శక్తి యొక్క నియంత్రణకు అప్పగించాము." "సమాజం గురించీ, ఇతరులను గురించీ మేము అనేక విషయాలపై పలువిధాలుగా ఆలోచిస్తాము. కానీ మా విషయంలో మాత్రం ఇంతవరకే ఆలోచిస్తాము - మా మాస్టరు మమ్మల్ని ఎటు తీసుకువెళితే అటే వెళతాము. ఆ మార్గం మా అభిరుచికీ, సౌకర్యాలకూ పూర్తిగా విరుద్ధం అయినా - సమర్పణ అంటే ఇదే. ప్రేమికురాలు తన ప్రియతమునిపై తన ఇచ్ఛను రుద్దితే - అది వ్యాపారం, వ్యభిచారం అయిపోతుంది. సమర్పణ చేసిన తర్వాత - మా మాస్టరుకు మా అభిరుచిని గురించి తెలిపేటంత లోతులేనిది కాదు మా ఆత్మ."

సమర్పణ ఎంత సమగ్రం అయితే - గురువు యొక్క చేతన, సిద్ధులు, శక్తి సామర్థ్యాలు మనకు అంత విస్తృతంగా అందుతాయి; జీవితం అంత వేగంగా పరివర్తన చెందుతుంది. ఆ సమర్పణ లోపిస్తే - హిమాలయ యాత్ర వ్యర్థమే అవుతుంది."

అలాంటి వ్యక్తుల గురించి గురుదేవులు 1971 జూన్‌నాటి హిమాలయ యాత్ర సమయంలో ఇలా పేర్కొన్నారు -

"మాతోపాటు హిమాలయ యాత్రకు వస్తామని ఎందరెందరో చెపుతూవచ్చారు. వారికి నేను చెప్పేది ఒక్కటే - ఆదర్శాల హిమాలయాలను నేను ఎలా ఎక్కానో అలా మీరు ఎక్కండి, అని. గురువుపట్ల అసందిగ్ధమైన సమర్పణయే గౌరీశంకర శిఖరం. ఆ శిఖరంపై నిలచిన వ్యక్తి చేతనయొక్క వినీల ఆకాశంతో ఏకం కాగలుగుతాడు. ఆధ్యాత్మిక జీవనంలో విలక్షణ రహస్యాలు ఎన్నెన్నో ఆ వ్యక్తికి సహజంగా వెల్లడి అవుతాయి."

గురుదేవుల జీవితంలో జరిగింది ఇదే. 15 సంవత్సరాల పిన్నవయస్సులో వెలిగిన సాధనాజ్యోతి నిరంతరంగా, నిర్విరామంగా, నిష్కంపంగా (కంపించకుండా) జ్వలిస్తూనే ఉంది. అవిశ్వాసం, అధైర్యం, విషమ పరిస్థితుల పెనుతుపాను ఆ జ్యోతిని ఆర్పలేకపోయింది; తగ్గించలేక పోయింది.

## సాధన అంటే జీవించే కళ

గురుదేవులు సాధనను, జీవితాన్నీ ఏకం చేశారు. ఈ అనుభూతి ఫలితమే జీవన సాధన. ఇది చెప్పడానికీ, వినడానికీ మామూలు విషయంగా కనబడవచ్చు. అయితే, సాధనా

**నవ్వుతూ చేసే చెడు పనుల ఫలితం - ఏడుస్తూ అనుభవించడం.**

విధానాలపై పరిశోధన జరిపిన వ్యక్తులు, సాధకుల జీవితాలను లోతుగా అధ్యయనం చేసినవారు ఈ విలక్షణమైన ఏకత్వాన్ని దర్శించి నిశ్చేష్టులు అవుతారు, ఆశ్చర్య చకితులు అవుతారు.

ఆధ్యాత్మిక రంగ చరిత్రలో ఇంతవరకు సాధన, జీవితం ఉత్తర ధృవం, దక్షిణ ధృవంగా ఉంటూవచ్చాయి. మానవ సమాజానికి మొదటి నుంచీ ఒక నమ్మకం ఉంది – "సాధన చేసే వ్యక్తి జీవితాన్ని వదులుకోవాలి. జీవితంపట్ల వ్యామోహం కలిగి ఉన్న వ్యక్తికి సాధన యొక్క ప్రయోజనం అందదు." హిందువులేకాక – క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు, పార్సీలు, యూదులు, జైనులు కూడ ఇలా నమ్ముతూ వచ్చారు. మానవ ప్రవృత్తులను ఇలా విడదీయడంవల్ల ఎంతో నిరాశ కలిగింది, ఎన్నో వేదనలు కలిగాయి. అయినా – మరో దారి లేకపోయింది.

జన మానసంలో నమ్మకం క్రమంగా బలపడిపోయింది – సాధకునికి జీవితంతో పని ఏమిటని, అతడు సన్యాసి అయిపోవాలని; జీవితంపట్ల ప్రేమ కలిగిన వ్యక్తికి సాధనతో పని ఏమిటని. ఒకరి స్వధర్మం మరొకరికి విధర్మం అయిపోయింది. ఫలితంగా – సన్యాసులూ, గృహస్థులూ రెండు సమూహాలుగా విడిపోయారు.

మానవ చరిత్రలో మొదటిసారి – గురుదేవులు జీవితాన్నీ, సాధననూ ఏకం చేశారు. వారిలా అన్నారు –

"ఏడుస్తూ విసుగుకుంటూ ఏదోవిధంగా వెళ్ళదీయ వలసినదేనా జీవితం నిజంగా. అనాగరికుడు వజ్రాన్ని గాజుముక్కగా పరిగణించి విసిరివేస్తాడు. అలాగే – ఎంతో విలువైన మానవ జీవితాన్ని మనిషి బరువుగా పరిగణిస్తాడు.... జీవితాన్ని కళాకారుని ప్రతిభతో తీర్చిదిద్దితే, మలచితే – దాన్ని స్వర్గమయ పరిస్థితులతో నింపవచ్చు. సాధన జీవించే కళ."

## గృహస్థం ఒక తపోవనం

ఆ కళలో నిష్ణాతులు గురుదేవులు. బుద్ధుని కరుణనూ, ఆదిశంకరుల జ్ఞానాన్నీ, మహావీరుని త్యాగాన్నీ కలిగి ఉండికూడా వారు అడవులకు వెళ్లలేదు. జీవితం పట్ల వైముఖ్యం చూపలేదు. అంతే కాదు. "గృహస్థం ఒక తపోవనం" అని ప్రకటించారు. ఆ గృహస్థాశ్రమంలో వారు వందనీయ మాతాజీతో పాటు సంయమనం, సేవ, సహనాలను సాధనచేస్తూ ఇద్దరు కుమారులకు, ఇద్దరు కుమార్తెలకు తండ్రిగా తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించారు. జీవితంలోని అన్ని రంగాల సమస్యలకూ వారు చూపిన పరిష్కారాలు హేతుబద్ధములు, సార్థకములు అయినవి. ఆహార విహారాలు, శిష్టాచారం, ఆత్మ సాధనలోని జటిల సమస్యలు – అన్నింటినీ ఆయన విశ్లేషించారు. వాటిపై అద్భుతమైన మార్గదర్శనం చేశారు. వారు ఆయా పరిష్కారాలను తమ వాణిద్వారా కాక, తమ ఆచరణద్వారా చూపారు. తద్వారా ఆయా రంగాలకు ప్రాణం పోశారు.

## అపేక్ష శూన్యతలో వ్యవహార కుశలత

ఈ విషయాలు మామూలు చేతనలో జీవించేవారికి సామాన్యమైనవిగా కనిపించవచ్చు. కానీ, సాధన ద్వారా చేతన యొక్క శిఖరాగ్రాలను దాటినవారికి ఇవి సహజములు కావని తెలుస్తుంది. శ్రీరామకృష్ణ పరమహంసకు తరచు భావ సమాధిలోనికి వెళ్లవలసి వచ్చేది. చైతన్య మహాప్రభువు నిరంతరం ఒకవిధమైన భావావేశంలో మునిగి ఉండేవారు. అపేక్షలు ఉన్నచోటనే వ్యవహార కుశలత ఉంటుంది. అపేక్షలు నశిస్తే వ్యవహార కుశలత నశిస్తుంది. అపేక్షలు నశించిన తర్వాత కూడ వ్యవహార కుశలతను నిలుపుకోవడం మహాయోగులకే సాధ్యపడుతుంది. మనస్సుతోపాటు ప్రాణంలో, శరీరంలోకూడ పరమేశ్వర ప్రకాశాన్ని పొందిన మహాయోగులే ఆ పని చేయగలుగుతారు. గురుదేవుల జీవితంలో సాధన జగత్తు యొక్క ఈ పరమ రహస్యం సహజంగా వెలికివచ్చింది.

## మోక్షంకోసం కాక – మానవాళి కోసం

సాధకులుగా గురుదేవులు అద్భుతమైన కొలబద్దలను నిర్మాణం చేశారు. విశ్వ జీవనాన్ని కేంద్రంగా చేసుకుని జరిపిన ప్రచండమైన సాధనాత్మక పురుషార్థం వానిలో ఒకటి. సాధారణంగా సాధకులు తమ జీవితాలను సరిచేసుకోవడం

**నాయకత్వం ఒక హోదా కాదు – ఒక బాధ్యత, ఒక క్రియ.**

కోసం, సంస్కరించుకోవడం కోసం, తమ మోక్షం కోసం సాధన చేస్తూ ఉంటారు. కానీ, గురుదేవులు ఇలా స్పష్టంగా ప్రకటించారు –

"నా సాధనకు లక్ష్యం మోక్షంకాని, నిర్వాణంకాని కాదు. దాని ప్రధాన లక్ష్యం జీవితం యొక్క, అస్తిత్వం యొక్క పరివర్తన."

"పీడిత మానవత యొక్క, విశ్వాత్మ యొక్క, వ్యక్తి సమాజముల యొక్క వ్యధ, వేదన నన్ను అశాంతికి గురి చేశాయి. కళ్లు నొప్పిపెడితే, కడుపులో నొప్పి వస్తే – మనిషి వ్యాకులత పొందుతాడు. ఆ నొప్పిని ఎలా తొలగించాలా అని మథనపడతాడు. నా మనఃస్థితి దాదాపు అలాంటిది. నా కోసం సుఖ సాధనాలను సమకూర్చుకునేందుకు తీరిక ఎక్కడిది? విలాస వస్తువులు విష పదార్థాలవలె కనిపించేవి. వినోద సాధనాలను, విశ్రాంతి సాధనాలను సమీకరించాలనే ఆలోచన ఎప్పుడైనా కలిగితే – నాకు ఆత్మగ్లాని కలిగేది. చావు దగ్గరపడిన రోగికి ప్రాణ రక్షణ చేసే గ్లాసెడు మంచినీళ్లను తన కాళ్లు కడుక్కోవడానికి వాడుకోవాలనే ఆలోచనలా నాకు మనస్తాపం కలిగించేది."

విశ్వ మానవులపట్ల పొంగి పొరలిన సంవేదన వారిలో విశ్వాత్మ బోధను మేలుకొలిపింది. ఫలితంగా – ప్రచండమైన సాధనాత్మక పురుషార్థం పర్వత శిఖరంవలె లేచి నిలచింది. "అర్జునునికీ, హనుమంతునికీ అందిన వరాలను ఈ యుగపు మహామానవులకు అందించాలి. మాకు అందిన మహత్తర అదృష్టాన్ని ఇతర ఆత్మలకు పంచాలి" – ఇందుకోసం జరిగింది ఆ పురుషార్థం. వారి జీవన సాధన సాధించిన ఫలితాలు వారి మాటలలోనే ఇలా ఉన్నాయి –

"మా తపశ్చర్య లక్ష్యం ప్రపంచంలోని ప్రతి జీవన రంగంలో భగీరథులను సృష్టించడం." "నవ నిర్మాణంయొక్క ఉదయించే నాయకత్వానికి తెరవెనుక మేము అవసరమైన శక్తినీ, పరిస్థితులనూ ఉత్పన్నం చేస్తాం."

మరో సందర్భంలో వారి లేఖిని వెలువరించిన భావం –

"రానున్న రోజులలో మేము ఏ అగ్నిలో తపిస్తామో, ఆ అగ్నియొక్క వేడిమిని అసంఖ్యాకులైన జాగృత ఆత్మలు అనుభూతి పొందుతారు. భవిష్యత్తులో జరిగే మహాభారత యుద్ధాన్ని నడపడానికై కర్మనిష్ఠులైన ఎందరో మహామానవులు తమ ప్రస్తుత మూర్ఛ నుండి మేలుకొని ముందుకువస్తారు. .... ప్రజాసేవకులతో కూడిన చతురంగబలం కలిగిన సేన అసాధ్యాన్ని సాధ్యం చేస్తుంది; నరకాన్ని స్వర్గంగా మార్చుతుంది. జ్వలించే మా జీవన క్రమం చూపే చివరి అద్భుతం అవుతుంది అది."

"మా జీవన సాధన విశ్వమానవులకు ఇచ్చే దానం వారి అదృష్టం యొక్క, వారి భవిష్యత్తు యొక్క దిశను ములుపు త్రిప్పడం నిశ్చయం. పరిశోధన కోసంకాని, రచన కోసం కాని – నేను ఎలాంటి సాధకుడనో తెలుసుకోవాలని కోరేవారు మహాకవి కాళిదాసు వ్రాసిన ఈ శ్లోకాన్ని గుర్తుచేసుకోవాలి –

**సర్వాతిరిక్త సారేణ సర్వతోజోభి భావినా ।**
**స్థితః సర్వోన్నతైనోర్వీ క్రాంతా మేరురివాత్మనా ॥**

**ఆకార సదృశ ప్రజ్ఞః ప్రజ్ఞయా సదృశాగమః ।**
**ఆగమైః సదృశారంభ ఆరంభ సదృశోదయః ॥**

(రఘువంశం 14-15)

అనగా –

"వారు దృఢత్వంలో అందరికన్న దృఢమైనవారు; తేజస్సులో అందరినీ మించినవారు; ఔన్నత్యంలో అందరికన్న ఉన్నతులు; వ్యాపకత్వంలో అందరికన్న వ్యాపకులు; మేరు పర్వతంవంటి ఆత్మ కలిగినవారు. వారి వ్యక్తిత్వం ఎంత ఉన్నతమో వారి ప్రజ్ఞ, వారి శాస్త్రజ్ఞత, వారి సాధన అంత ఉన్నతంగా ఉండేది; వారి సాఫల్యాలు అంత ఉన్నతంగా ఉండేవి."

– 1993 ఫిబ్రవరి అఖండజ్యోతి నుండి

★★★

**మన మేధస్సు ఒక జీర్ణకోశం. దానిలోకి ఎంత పంపామన్నది కాదు ప్రశ్న – ఎంత జీర్ణమయిందని.**

## ఆచరణలో అధ్యాత్మ

# పరమేశ్వర ప్రాప్తికి రాచబాట త్యాగం

డబ్బు పోయిందా? ఎందుకు ఏడుస్తున్నావు? దొంగలు ఎత్తుకుపోయారా? అయితే ఏడువు - ఇలా ఆలోచించే మిత్రుడా! ఎత్తుకువెళ్లేవారు మరొకరు ఎవరూ లేరు. ఒకే ఒకరు ఉన్నారు. ఆయన ఎన్నెన్నో సాకులతో నీ మనస్సును ఎత్తుకువెళ్లాలని కోరుతున్నాడు.

కృష్ణుడు తమ వెన్నను ఎత్తుకువెళ్లడం కన్న గోపికలకు అదృష్టం ఏముంది?

తన సర్వస్వం దోచుకోబడినవాడు ధన్యుడు - మనస్సూ, చిత్తమూ, మరేదీ మిగలకుండా.

బలి చక్రవర్తి జల కలశాన్ని చేతిలోకి తీసుకున్నాడు. వామన భగవానునికి మూడు లోకాలనూ దానం చేసివేశాడు. ఒక అసురుడు చేసినంత పనయినా మీరు చేయలేరా? ప్రపంచంలో నీకున్నదాన్ని అంతనూ అప్పగించు భగవానునికి. నీ బరువు తొలగిపోయింది. అప్పుడు ఈశ్వరునికి ఈశ్వరత్వాన్ని ఇచ్చేవాడివి అవుతావు నీవు. సూర్య చంద్రులు సైతం నిన్ను బిచ్చం అడుగుతారు.

జనం చెబుతూ ఉంటారు - అయ్యా! భజనలో మనస్సు నిలవడం లేదు అని, ఏకాగ్రత కుదరడం లేదని. ఏకాగ్రత ఎలా కుదురుతుంది - పిసినారితనంతో కోతిలా గుప్పిటినుంచి వస్తువులను ఎంత మాత్రం వదలవు, కానీ గుప్పిటిలో రాముణ్ణి బిగించాలని కోరుకుంటావు. ఆయన అంత అమాయకుడు కాడు - తనకు తానుగా నీ చేతుల్లోకి ఎక్కడానికి.

**జహా కామ్ తహా రామ్ నహీ, జహా రామ్ నహీ కామ్.** అనగా - కామం ఉన్నచోట రాముడు ఉండడు. రాముడు ఉన్నచోట కామం ఉండదు. రాముణ్ణి పొందాలంటే హనుమంతులం కావాలి. అతడు ముత్యాలనూ, హారాలనూ ముక్కలుచేసి పారవేశాడు - "వీటిలో రాముడు లేకపోతే, ఈ బహుమతిని ఎందుకు ధరించాలి, ఈ బహుమతిని నేను ఏమి చేసుకోవాలి" అంటూ.

సోదరా! సమాధి ఎప్పుడు లభిస్తుందో తెలుసా? ఏకాగ్రత ఎప్పుడు కుదురుతుందో తెలుసా? నీ వస్తువులు, నీ ధనం, నీ బంగళాలు, నీ ఇళ్లు - అన్నీ నీ మనస్సునుండి మాయమయినప్పుడు; భార్య, సంతానం, బంధు మిత్రులు - వీరందరిపై వ్యామోహం అంతమైనప్పుడు; అంతా స్వచ్ఛం అయినప్పుడు; రాముడి తుపాను వచ్చి, నీ ఖజానా అందులో కొట్టుకుపోయినప్పుడు. వెళ్లడానికి స్థలమే లేనప్పుడు - మనస్సు ఎక్కడికి వెళుతుంది? సహజంగా సమాధి స్థితి అందుతుంది.

"త్యాగరూపంలో జరిపే ఈ ఉపాసన కూడ ఇతర త్యాగాలవలెనే ఉంటుంది. చేయాలా వద్దా, ఎవరికయినా డబ్బు ఇవ్వాలా వద్దా - ఇదంతా మా ఇష్టం" - అని ఆలోచించే వ్యక్తి భ్రమలో మునిగి ఉన్నాడు. త్యాగ రూపంలో జరిపే ఈ ఉపాసన అవసరం; మరెక్కడా శాంతి దొరకనే దొరకదు కనుక అవసరం.

మనస్సులో ఈ కోరిక ఉన్నంతవరకు, ఆ ఇచ్ఛ ఉన్నంతవరకు మనస్సు ఏకాగ్రం కాదు. ఏ ఆశచేతా, ఏ అవసరంచేతా పీడించబడని వ్యక్తిమాత్రమే ప్రశాంతంగా ఉండగలుగుతాడు. ఈ వాసనలు తమకు తాముగా మనలను వదలవు. మనమే వాటిని వదిలించుకోవలసి ఉంటుంది. కనుక - జీవించాలనే ఆశనుకూడ వదులుకుని, మనస్సును బ్రహ్మానందంలో ముంచాలి. శరీరం ఏదో ఒక రోజున పోవలసిందే. ఎల్లకాలం వెంట ఉంటానని పత్రం వ్రాయించుకుని తెచ్చుకున్నది కాదు ఈ శరీరం. ఈ శరీరం లేనేలేదని ఈరోజునుండే తెలుసుకో. అనుమానం అన్నది లేకుండా బ్రహ్మానంద సాగరంలోనికి దూకు. ఆశ్చర్యం ఏమంటే - మనం ఈ కామనలను వదులుకున్నప్పుడు ఇవి తమకు తాముగా పూర్తవుతూ ఉండడం కనిపిస్తుంది.

మనస్సులో త్యాగం, జ్ఞానం నిండినప్పుడు, శాంతి సాక్షిగా మారి ఆలోచనా శక్తిలో ప్రవేశించినప్పుడు - మాయ అనే తెరగా ఉంటూ వచ్చిన ఈ ప్రపంచమే రామ దర్శన చిత్రాల నిరంతర ప్రవాహంగా మారిపోతుంది. అద్వైతం, ద్వైతముల శాస్త్రార్థంలో లీనమైనవాళ్లను ఆ వివాదంలో ఉండిపోనివ్వు. అందుకోసం ఈ బుద్ధిని శ్రమపెట్టడం అనవసరం. కానీ - బుద్ధి (అనగా సూక్ష్మ శరీరం) స్థాయినుండి దిగి కారణ శరీరంలో జ్ఞానభావ దీపం వెలిగినప్పుడు - వివాదాలు పరిష్కారం అయిపోతాయి. మనిషిలోని అంతర హృదయంలో రాముని ఢంకా మ్రోగనంతవరకు - అతడికి ఉపాసన రుచించదు; జ్ఞానం ఫలించదు; వేద సంహితల, ఉపనిషత్తుల అర్థం స్ఫురించదు.

★★★

**నిత్యసంతోషితో స్నేహం మనశ్శాంతికి మార్గం.**

తత్వచింతన

# సాఫల్యానికి సోపానం మనో నిగ్రహం

సామూహిక మానవమేధ పరిధి, బాహ్య ప్రపంచ ప్రతిబింబం మాత్రమే కాదు. బాహ్య చేతన, అంతర్ చేతన, ఉన్నత చేతన అనే మూడు పొరల వింతైన ప్రపంచమది. ఈ పొరల సంస్కరణే 'సాధన'యొక్క ఉద్దేశం. వస్తు ప్రపంచంపట్ల మన దృక్పథాన్ని పూర్తిగా మార్చడానికి ఈ సంస్కరణ, పవిత్రతలే కారణాలౌతాయి. సంస్కరించబడిన పవిత్రమైన మేధోశక్తి భౌతిక వస్తు ప్రపంచంపై తన ప్రభావాన్ని చూపుతుంది. ఈ పరివర్తన విధానాన్నే "మనోమయ కోశ సాధన" అంటాము.

## మనిషిలోని మనోబలం

దీక్షతో పరీక్షలకు చదివే విద్యార్థులు ఉత్తమ శ్రేణులతో కృతార్థులౌతారు. దీక్షగల రైతులు మంచి పంటను పండిస్తారు. ఉత్సాహవంతులైన మల్లయోధులు కుస్తీలో బిరుదులను పొందుతారు. తెలివి, చాకచక్యం నిండిన మేధస్సు వ్యాపారంలో విజయసాధన కొక వరంగా పరిణమిస్తుంది. సంస్కరించబడి కేంద్రీకృతమైన మేధస్సు 'సాధన'లో విజయం పొందడానికి సహాయకారి అవుతుంది. ఏకాగ్రత గల కళాకారులు ప్రేక్షకులను మంత్రముగ్ధులుగా ఉంచగలరు. వివిధ రంగాలలో వారివారి గమ్యస్థానాలు చేరటం - గొప్ప మేధాశక్తి లక్షణాలైన బలమైన సంకల్పం, కార్యదీక్ష, పూర్తి తాదాత్మ్యాలపైనే ఆధారపడి ఉంటుంది. మేధోశక్తిలోని తేడాలవల్లనే - సాధనాలలో సామ్యం ఉన్నప్పటికీ, ఫలితాలు వేర్వేరుగా ఉంటున్నాయి.

ప్రాణంలేని వస్తువులు ఉనికిని మాత్రమే కలిగి ఉంటాయి. ప్రాణం ఉన్నత తరహాలో ప్రత్యేకంగా ప్రకటిత మౌతుంది. అందువల్లనే ప్రాణులకు, నిర్జీవులకు వేర్వేరుగా సూత్రాలున్నాయి. నిర్జీవ వస్తువులకు స్వతంత్ర మనోశక్తి ఉండదు. కాగా మనోశక్తి ప్రభావంవలనే జీవికి పూర్తి అభివృద్ధి సాధ్యమౌతుంది. ఈ ఉన్నత లక్షణమైన మనోశక్తే మానవునికి, మానవేతర ప్రాణులకు గల ప్రత్యేకమైన తేడాను తెలుపుతుంది. మానవుడు అభివృద్ధి చెందిన చేతనకు అధిపతిగా భావించబడుతున్నాడు. ఎందుకంటే - అతని మనోస్థితి చాలా జాగృతంగా, బలంగా ఉంటుంది. ఈ జ్ఞానంతో కూడిన సంకల్పమే మానవుని చీకటి నుండి వెలుగులోనికి, మృత్యువు నుండి అమృతత్వానికి, అసత్యం నుండి సత్యంలోనికి నడిపిస్తుంది.

బలమైన మార్గనిర్దేశక మనోశక్తి తప్పనిసరిగా కోరిన ఫలితాల నిస్తుంది. 'యోగ వాశిష్ఠంలో' ఇలా వివరించబడింది -

**యథా భావనాయ చేతో యద్యథా భావయాత్యలం**
**తత్తత్ ఫలమ్ తదాకారమ్ తావత్మానమ్ ప్రపాష్యతి**

యోగ వాశిష్ఠం - 4/21/56-57

అనగా - "(ఓరామా) ఈ మనస్సు దృఢచిత్తంతో ఏదైతే కోరుతుందో ఆ పరిధిలో ఆ సమయంలో అదే ఉంటుంది, దాని కనుగుణంగానే ఫలితాల ననుభవిస్తుంది.

## బంధ మోక్షాలకు కారణం మనస్సు

అందువలన మేధస్సును నెమ్మదిగా నిశ్శబ్దంగా ప్రసరించేదిగా చేయడమే పురోగామి "సాధన" ముఖ్య పరమావధి. మేధస్సును పట్టించుకోనట్లయితే 'సాధన' సాధ్యం కాదు. యాంత్రికంగా శారీరిక వ్యాయామము లెన్ని చేసినా - సంస్కరించబడని, అస్థిరమైన మనస్సుతో 'సాధనా' రంగంలో ప్రవేశించినవారికి దానిలో విజయం సాధ్యం కాదు. శరీరాన్ని బాధించే ఉపవాసం, నియమాలు, శీత తాపములు భరించుట మొదలైనవాటిని, వ్యక్తి ఏమానసిక స్థితితో, ఏ భావనలతో నిర్వహిస్తున్నాడో గమనించవలసి ఉంటుంది. కేవలం శారీరిక క్రమశిక్షణలు - భంగిమలు శారీరిక శక్తివంటి కొద్ది లాభాలను మాత్రమే ఇవ్వగలుగుతాయి. కఠిన శారీరిక నియమాలను పాటించినా 'సాధన'లో అపజయం పొందిన కొందరు అజ్ఞానులు, సాధనలోని విధి విధానాలను నిందిస్తారు. మేధస్సుపై పూర్తి పట్టు సాధించకుండా దానిని నిర్లక్ష్యం చేసేవారి సాధన లేవైనా అపజయం పొందుతాయన్నదే నిజం. శరీరంపై కాక మేధస్సుపై

**నియమం నాగరికత : నియమ రాహిత్యం పశుత్వం.**

క్రమశిక్షణ, పట్టు సాధించితేనే, సాధన ప్రారంభమౌతుందనే విషయాన్నెపుడూ మరచిపోకూడదు. మేధావులు, తెలవిగలవారు ప్రకటించినదేమంటే – మేధస్సే బంధానికి, ముక్తికి కారణం.

**"మనఏవ మనుష్యానామ్ కారణమ్ బంధ మోక్షయో"**

మేధస్సులో ఊహించే అద్భుత శక్తి ఉంది. అది ఆ ఊహాచిత్రాలనెంత ప్రస్ఫుటం చేస్తుందంటే – వ్యక్తి ఒక చిన్న పిల్లవానివలె వాటి వెంటబడతాడు. రంగు రంగుల సీతాకోక చిలుకల వెనుక పిల్లలు పరుగెత్తుతారు. అదేవిధంగా – మేధస్సులో ఏయే కోరికలు, ఆలోచనలు రేకెత్తుతాయో, వాటిని సాధించేందుకు వ్యక్తి ముందుకు సాగుతాడు. అందువలననే మనస్సెల్లప్పుడూ చంచలంగా ఉంటుందని చెప్పబడింది. సాధారణంగా ఎక్కువకాలం మనస్సు ఒకే వస్తువుపై కేంద్రీకరించలేదు. ఒకసారి ఏదో ఆలోచన మేధస్సులో తళుక్కుమనగానే, దాన్ని సాధించడానికి గూటిని అల్ల నారంభిస్తుంది. మరికొంతకాలం తర్వాత మరో ఊహ మొదటి దానిని కప్పివేసి రెండోదాని సాధనకు గూటినల్లుతుంది. ఈ క్రమం సాగుతూ ఉంటుంది.

## మనస్సు చంచలం

ఈ మేధో అస్థిరత వెనుక ఆనందం పొందాలనే కోరిక ఉంటుంది. అందువలన, ఇంద్రియ భోగా లెక్కడ దొరుకుతాయని భావిస్తుందో, రంగుల ఊహ లల్లుతూ వాటిని పొందేందుకు మనసు ఉపక్రమిస్తుంది. మేధస్సు ఏదిశలో వెళితే, ఆ దిశలోనే శరీరం కూడ పనిచేయ నారంభిస్తుంది. ఒక పథకం పూర్తికాక మునుపే మేధస్సులో మరో ఊహ మెదలుతుంది. మేధస్సు దాని పథక రచనకు శ్రీకారం చుదుతుంది. ఇలా ఒక ఊహనుండి మరో ఊహలోనికి గెంతులువేస్తూ పోవటం అంతులేకుండా సాగుతుంది. కళ్ళెం వేయని మేధస్సుకిదే కార్యక్రమం. ఇంద్రియ భోగ తృప్తి నిచ్చే ఊహా పిశాచాలను అంతులేకుండా వెన్నాడుతూ – జీవితాన్ని అసంతుష్ట కోరికల సుడిగుండమనే నరకంగా చేస్తుంది. ఈ అసంతుష్ట మేధను గూర్చి గీతాచార్యుడైన కృష్ణ భగవానునితో అర్జునుడిలా అన్నాడు –

**యోయం యోగః త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన**
**ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్**
**చంచలం హి మనః కృష్ణ ప్రమాది బలవద్దృఢమ్**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్**

గీత 6/33,34

భావం:– ఓ మధు సుదనా, ఆత్మలన్నియు, ఈశ్వరునితో సమానములుగా దర్శించవలెననెడి యోగమును నీవు చెప్పియుంటివి. మనస్సు చంచలమైనది గాన, ఆ యోగం స్థిరంగా నిలుచునట్లు కన్పించదు.

ఓ కృష్ణా, నిలకడ లేక చలించునదై, ఒక చోట నిలుపుటకు శక్యముకానంత బలిష్టమై, వ్యాకులపరచు ఈ మనస్సును అడ్డుకొనుట గాలినడ్డుకొనుటవలె దుష్కరమని భావిస్తున్నాను.

## మనో నిగ్రహం కష్టం

కృష్ణ భగవానుడు కూడ మనస్సును నిగ్రహించుట కష్టతరమని ముందుగా రెండో అధ్యాయంలో ఇలా వివరించాడు :

**యతతోహ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః**

గీత 2/60

భావం:– కుంతీపుత్రా, నిష్కామకర్మ నాచరించు ప్రయత్న శీలుడగు పురుషునిగూడ ఇంద్రియాలు బలిష్టములై ఆత్మవైపు ప్రవర్తించు అతని మనస్సును ఒక్క ఉదుటన విషయ సుఖములలోనికి ముంచివేయును.

**ఇంద్రియాణాం హి చరతాం యన్మనోను విధీయతే**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంభసి**

గీత 2/67

భావం:– విషయానుభవం చేయు ఇంద్రియముల వెంటబడి, వానినే ధ్యానించ నారభించినచో, చుక్కానిలేని నావ గాలిచే తన గమ్యం నుండి భ్రష్టమైనట్లే, విషయ సుఖములనెడి నీట ప్రవాహంలో ఇంద్రియానుభవమనెడి గాలిచే, మనస్సనే నావ బలాత్కారంగా త్రోయబడి ఆత్మానందమనెడి గమ్యం నుండి భ్రష్టమగును.

**నిరపేక్షమైన సేవ మనిషిని ఉన్నతుణ్ణి చేస్తుంది.**

బుద్ధ భగవానుడు మనస్సు చంచలత్వాన్నిలా వివరించాడు :

**యోసహసాం సహసేన సంగమే మానుషే జినే**
**ఐకమ్ చ జైయ్య అతానం సావై సంగామ్ జుటాయో**

ధర్మపద - 103

భావం:- ఒక వ్యక్తి వేలకొద్దీ జనులను వేలసార్లు గెలిచినా, తన మనస్సును గెలవగలిగినాడే గొప్ప విజేత అనిపించు కుంటాడు.

సాధారణస్థితిలో అజ్ఞానంలో మునిగిన మనస్సు చంచలత్వం ప్రకృతి సిద్ధమైనదే. దాని నదుపులో ఉంచుట చాలా కష్టమే. అయినా, అది అసాధ్యం మాత్రం కాదు. మనస్సు చంచలత వలన కలిగే హానికరమైన అనర్థాలు, దాని నదుపులో ఉంచితే కలిగే లాభాలు వ్యక్తి గ్రహించగలిగితే, మనస్సును స్థిరత్వం వైపు ఉంచగలిగే దిశలోకి సాగిపోవడం తప్పక సాధ్యమౌతుంది. అత్యంత ఉష్ణోగ్రతగల సమయంలో కూడ, సూర్యకిరణాలు వెదజల్లబడి ఉండటంవలన శరీరం సహించగలుగుతుంది. అవే కిరణాలు ఒక కటకం ద్వారా ఒక చోట కేంద్రీకరించబడినచో ఏ శరీర భాగం కూడా వాటిని తట్టుకోలేదు. అవి ఏ బట్టనైనా కాల్చగలుగుతాయి. ఆ వేడితో ఎక్కడైనా నిప్పంటించవచ్చు. అనేక కార్యాలు సాధించడానికి నేడు సూర్య కిరణాలతో జనించే శక్తిని వాడుతున్నారు. కేంద్రీకృతమైన సూర్యకిరణాలవలె కేంద్రీకృతమైన మేధోశక్తి కూడ అనంతమైనది. విచ్చలవిడిగా ఉన్న మేధస్సుతో జీవితంలో ఏ ఆశయమూ సఫలం కాదు. సాధారణ జీవితంలో కూడా మేధోశక్తిని ఒకే ఆశయం వైపు కేంద్రీకరిస్తే, దాని శక్తి అనేకరెట్లు పెరుగుతుంది. అట్టి కేంద్రీకరించిన మేధస్సుతో కోరికలు నెరవేరుతాయి. పథకాలు అమలు జరుగుతాయి. ఏ రంగంలోనైనా విజయం పొందవచ్చు.

మేధోశక్తిని అదుపులో ఉంచుకోవడం ఆధ్యాత్మిక రంగంలో చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. పురాణ గ్రంథాలలో మనస్సును శత్రువుగాను, మిత్రునిగాను పేర్కొనడం జరిగింది. నియంత్రించబడిన మనస్సు అమృతం, కల్పవృక్షం (కోరిన కోరికలు తీర్చే దేవలోక వృక్షం)లతో సమానం. అనియంత్రిత మనస్సు ప్రాణాంతకమైన విషంతో సమానం. మనసుపై అదుపు లేకపోతే అది ఇంద్రియ సుఖానుభూతి పొందగోరి వాటి వెంటపడుతుంది. షడ్రుచులు కోరే నాలుక దాని నిబ్బందిపెడుతుంది. ఇంద్రసభలో ఉన్న అప్సరసలతో నాట్యమాడా లనిపిస్తుంది. నృత్యగానాలు, సంగీతం, వినోదం, పర్యటనలు, వనభోజనాలు, అందమైన దృశ్యాలు, పరిమళ ద్రవ్యాలు దాని నాకర్షిస్తాయి. అటువంటి ఇంద్రియ సౌఖ్యాల ననుభవించడానికే తన కాలన్నెక్కువగా గడపా లనుకుంటుంది. నాటకాలు, సినిమాలు చూడటం, ఆటలాడటం, క్లబ్బుకు వెళ్ళటం వంటి వినోదాలలో కాలం వెచ్చింపజూస్తుంది. శరీరాలంకరణకు, దాని విశ్రాంతికి సౌఖ్య సాధనాలను తప్పనిసరిగా ప్రోగుచేసి, తన అహాన్ని తృప్తిపరచడం కోసం అనవసరంగా ప్రయత్నిస్తుంది.

## మనస్సుపై అదుపు తప్పనిసరి

అందువలన ఫలితం లేని, ఆశయం లేని మానసిక ఆందోళనను ఆపి మనస్సును తప్పకుండా అదుపులో ఉంచుకోవాలి. నియంత్రించబడిన మనస్సే అన్ని సిద్ధులకూ తాళంచెవి. అదే అన్ని సాధనలకు, యోగాభ్యాసాలకు మూలాధారం. నియంత్రించబడిన మనస్సుకు గల శక్తులు అంతులేనివని ఇది వరకే చెప్పబడింది. ఈ ప్రపంచంలో అభివృద్ధేదైనా ఎవరైనా సాధించారంటే అది నియంత్రిత మేధోశక్తి ఫలితమే. ఒక వ్యక్తి యొక్క ఆనందంగాని, దుఃఖంగాని, బంధనంగాని, ముక్తిగాని అతని మేధోస్థితిపైనే ఆధారపడుతుంది. ప్రత్యక్ష అనుభవం వలన పొందిన జ్ఞానం కూడ మేధస్సువలన పొందినదే. "రథచక్రము యొక్క ఇరుసుకు అమర్చబడిన రేకులవలె, మేధస్సులో ఋగ్, యజుర్, సామవేదాల జ్ఞానం అమర్చబడింది" - అని మేధస్సు ప్రాముఖ్యతను గూర్చి ఋషులు చెప్పారు (శుక్ల యజుర్వేదము 34/5). మేధస్సు పవిత్రమై, స్థిరమై ఒక చోట నిలిచినచో, జీవిత విధానంలో వాసి మారుతుంది.

అందువలనే, మేధోశక్తిని నియంత్రించగలిగిన వ్యక్తి ఎవరైనా సరే ఈ ప్రపంచాన్నే జయించగలడని చెప్పబడింది.

- అనువాదం : బాసంగి శ్రీరాములు

★★★

**అంతరాత్మ ప్రబోధాన్ని పాటించడం స్వయం-అనుశాసనం.**

బోధ కథ

# దేశరక్షణకు ఉపకరించిన సిద్ధి

నాదిర్‌షా ఢిల్లీపైకి దండెత్తాడు. సుల్తాను మహమ్మద్‌షా అతనికి తగు సమాధానం చెప్పాడు. దాంతో నాదిర్‌షా వెనక్కుతగ్గి కొన్ని రోజులు మీరట్‌లో సైన్యంతో సహా విశ్రాంతి తీసుకొని అక్కడి నుండి ఇరాన్‌కి తిరిగి వెళ్ళిపోయాడు.

నాదిర్‌షా తాను ఢిల్లీమీద దండెత్తబోతున్నాడన్న సంగతిని చాలా గుప్తంగా ఉంచాడు. అతని సన్నిహిత సలహాదారులే అతని ఈ ఆలోచనను పసికట్టలేకపోయారు. కాని నాదిర్‌షాకి ఊహించని పరాభవం ఎదురయింది. మహ్మద్‌షా మొదటినుండీ ఎంత తయారుగా ఉన్నాడంటే – తానే ముందుగా ఆక్రమించడానికి సమాయత్తమయ్యాడు. ఇది నాదిర్‌షా కల్లోకూడా ఊహించనిది. నాదిర్‌షా ఆశ్చర్యంలో మునిగి ఉండగానే అతనికి మహమ్మద్‌షా నుండి ఒక ఉత్తరం వచ్చింది – "మీరు నా మీద దండెత్తబోతున్నారన్న సంగతి నాకు ఆరునెలల ముందే ఒక మహాసాధువు ద్వారా తెలిసింది." దీనికి ఋజువుగా తనకి ఆరు నెలల క్రితం ఆ సాధువు నుండి వచ్చిన ఉత్తరం ప్రతిని జత చేసాడు. ఆ ఉత్తరం చేరేటప్పటికి నాదిర్‌షా మనసులో ఢిల్లీ మీద దండెత్తాలన్న ఆలోచన కూడా లేదు. అయితే ఆరు నెలల తరువాత జరిగే విషయం మహమ్మద్‌షాకి ఇంత ముందుగా తెలిసింది.

మహమ్మద్‌షాకి ఈ విషయాన్ని వివరిస్తూ ఉత్తరం వ్రాసిన చరణ్‌దాస్ అనే సాధువు ఒక గొప్ప గాయత్రీ సాధకుడు. ఆయన జ్ఞాపకార్థం నేటికీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలోని శుకతార్ అనే గ్రామంలో గాయత్రీ జయంతినాడు ఒక పెద్ద మేళా జరుగుతుంది.

శ్రీ చరణ్‌దాస్ రాజ్‌స్థాన్‌లోని అల్వార్ జిల్లాలో ఉన్న డెహరా అనే గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పేరు మురళీధర్, తల్లి పేరు కుండోబాయి. మామూలు చదువుకి భిన్నంగా – ఆయన అభిరుచి వేదాధ్యయనం, స్వాధ్యాయాలమీద చాలా ఎక్కువ ఉండేది. గాయత్రీ ఉపాసనలోని మహిమ గురించి చదివినకొద్దీ ఆయనకు గాయత్రీమాత చరణాలపై అవ్యాజ్యమైన అనురాగం పెరుగుతూ వచ్చింది. ఆయనకు యజ్ఞోపవీత సంస్కారం జరిగింది. గాయత్రీ మంత్ర దీక్ష తీసుకోవడం జరిగింది. కాని యజ్ఞోపవీత సంస్కారం యొక్క ముఖ్య ఉద్దేశ్యం గురించి ఎవరూ ఆయనకి చెప్పలేదు. ఒకనాటి రాత్రి ఆయనకు కలలో శుకదేవుడు కనిపించాడు. ఆయన ద్వారానే శ్రీ చరణ్‌దాస్‌కు కలలో గాయత్రీ ఉపాసనకు ప్రేరణ లభించింది. అప్పటి నుండి ఆయన నియమిత గాయత్రీ ఉపాసనని ప్రారంభించారు.

మొదట్లో ఆయన ఎక్కువ సమయం నర్మదా నది ఒడ్డునే గాయత్రీ అనుష్ఠానం, పురశ్చరణలు చేస్తూ ఉండేవారు, కొద్దికాలం ఆయన దేశ సంచార నిమిత్తం బయలుదేరారు. ఆ పర్యటనలో ఆయనకి ముజఫర్‌నగర్‌లో శుకతార్ అనే స్థానం ఎంతో మనోహరంగా కనిపించింది. ఇక్కడే ఆయన అనేక చాంద్రాయణ వ్రతాలు చేశారు. గాయత్రీ ఉపాసనతో పాటుగా అష్టాంగ యోగ సాధన అభ్యాసం చేసారు. దీని పరిణామంగానే పవిత్రమైన గాయత్రి జయంతినాడు ఆయనకు గాయత్రీ మాత సాక్షాత్కారం లభించింది.

ఈ ఆత్మబోధ తరువాత ఒక రోజు ఢిల్లీని నాదిర్‌షా ఆక్రమించబోతున్నాడనే సంగతికి తట్టింది. ఒక వేళ యుద్ధంలో నాదిర్‌షా గెలిస్తే దేశం మొత్తం అతని కర్కశ పాలనకి గురవుతుంది. ఆ సాధువులో గల కరుణ జాగృతమయి మహమ్మద్‌షాకి ఉత్తరం వ్రాసేలా చేసింది. ఒకవేళ అతని తపస్సు అతనికి సహాయం చేయ్యకపోతే పరిస్థితులు ఎలా ఉండేవో ఎవరు ఊహించగలరు?

సిద్ధి అంటే అర్థం అద్భుతం కాదు – ఆత్మగౌరవం, సమాజసేవ వ్రతం. శ్రీ చరణ్‌దాస్ గాయత్రీ ఉపాసన వల్ల అనేక సిద్ధులు పొందారు. కాని సిద్ధుల మాయాజాలంలో ఆయన చిక్కుకోలేదు. తనకి చేసిన ఉపకారానికి ప్రతిఫలంగా మహమ్మద్‌షా ఆయనకి అనేక గ్రామాల జాగీర్ సంపద ఇవ్వబోతే, దానిని తిరస్కరించి ఆ సంపదను పాఠశాలలు నిర్మించడం కోసం, సమాజ కల్యాణం కోసం వినియోగించాల్సిందిగా మహమ్మద్‌షాకు ప్రేరణ ఇచ్చాడు. నాదిర్‌షా ఆయనను తన గురువుగా స్వీకరించి ఆయన ఆదేశాన్ననుసరించి తన దేశం తిరిగి వెళ్ళిపోయాడు.

అనువాదం : ఉషా సుందరి

★★★

పండుకు సువాసన; మనిషికి సౌజన్యం.

## మహిళా జాగరణ

# ధర్మ సంస్కృతులకు మూలవిరాట్టు మహిళ

"విద్యా సమస్తా సవవ దేవి భేదాః
స్త్రీయః సమస్తాః సకలా జగత్సు"

అనే దేవీ భాగవతంలోని శ్లోకంలో స్త్రీని మాతృమూర్తిగానే కాక, జగన్మాతృమూర్తిగా వర్ణించారు. స్త్రీలో అంతర్లీనంగా ఉన్న ఈ జగన్మాతృ దర్శనాన్ని మన భారతీయులంతా పూజించారు.

స్త్రీని గృహ లక్ష్మిగా, మాతృమూర్తిగా, హితైషిగా, దైవ స్వరూపిణిగా వర్ణించి, ఆరాధించే భావన మన భారతీయ సంస్కృతిది.

శ్రీ అంటూ స్త్రీని మంగళ దేవతగా ప్రతి నామవాచకానికీ ముందు, ప్రతి శుభకార్యానికీ ముందు చేర్చి ఆవాహన చేసే అత్యున్నత సాంప్రదాయం మనది.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవాః"

అనే మనుస్మృతిలో "ఎక్కడ స్త్రీలు పూజించబడతారో, అక్కడ దేవతలు సంతోషిస్తారు" అని స్పష్టంగా చెప్పబడింది.

"స్త్రీ లేని పురుషుడు అసంపూర్ణుడు."

"స్త్రీలు ఐశ్వర్యాధిదేవతలు. సిరి సంపదలతో తులతూగుతూ, అష్ట ఐశ్వర్యాలతో సుఖంగా జీవితం గడపాలనుకున్న పురుషుడు మొదట స్త్రీని గౌరవించాలి."

"తమ శ్రేయస్సుని కోరుకునే ప్రతి తండ్రి, భర్త, సోదరుడు స్త్రీని గౌరవించాలి."

భారతీయులు విశ్వమంతటినీ స్త్రీమూర్తిగా భావించారు. సృష్టి, స్థితి, లయ కారిణియైన ఆమెను "పరాశక్తి"గా సమాదరించారు. "నారీ రహితుడైన పురుషుడు పరిమళం లేని పుష్పం" అని మన ప్రాచీనులు భావించారు.

అసలు స్త్రీత్వమే గొప్పదని భగవద్గీత చెబుతోంది.

"కీర్తిః శ్రీర్వాక్చనారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా"

భారతీయుల తత్వం ఇక్కడే గోచరిస్తుంది.

ఋగ్వేదకాలం నుండి స్త్రీ ఇంటా బైటా అత్యున్నతమైన గౌరవ స్థానాన్ని పొందింది. వేదాధ్యయనం చేసిన స్త్రీలు బ్రహ్మవాదినులుగా ఉన్నట్లు, వీరు యజ్ఞోపవీతాలు ధరించి, జప తపాలు, హోమాలు చేసే అర్హత కలిగి ఉండి, శ్లోకరచనలు కూడా చేసినట్లు తెలుస్తోంది.

యాజ్ఞవల్క్యి, శ్రద్ధ, విశ్వర, వాక్, ఘోష, ఇంద్రాణి మొదలైన స్త్రీలెందరో మంత్ర ద్రష్టలుగా ప్రసిద్ధులైనారు.

సాయణుని భాష్యాన్ననుసరించి కొందరు స్త్రీలు విలువిద్య, ధనుర్విద్య, నేర్చుకొని యుద్ధాలు చేసినట్లు ఋగ్వేదం ప్రమాణాల్ని చూపిస్తోంది.

ఆనాడు నృత్యం, చిత్రకళలు, సాహితీ సమావేశాల్లో, వేదాంత చర్చల్లో, స్త్రీలు పాల్గొని పేరు ప్రఖ్యాతులు పొందారు. యాజ్ఞవల్క్యునితో తర్కించిన గార్గి ఇందు కుదాహరణ.

స్త్రీకి, ఆమె వ్యక్తిత్వానికీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యానికీ మన దేశంలో ఇచ్చినంత విలువ, గౌరవం అత్యున్నత స్థానం, యావత్ప్రపంచంలో మరే దేశంలోనూ ఇవ్వలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

"సురియోదేవీయుషగుం యోచమానా మరీయః
వయోషాయ ఛ్యేతుపశ్చాత్"

అంటే - లోకంలోని మనుష్యుడు స్త్రీని అనుసరించి ఎలా నడుస్తాడో, సూర్యుడు కూడా ఉషారాణిని అనుసరించి నడుస్తాడని అర్థం. అనగా పురుషుడు స్త్రీని అనుసరించి వర్తించాలని నిర్దేశించబడింది యజుర్వేదంలో.

ధర్మాచరణలోనూ, కుటుంబ విధుల నిర్వహణలోనూ,

**జ్ఞానంలేని సౌందర్యం పద్మంలేని కొలను.**

భారతీయ స్త్రీకున్న విశిష్ట స్థానం మరే ఇతర దేశాల స్త్రీలకూ లేదు. పురుషుడు కేవలం కుటుంబ పోషణ, సంరక్షణ బాధ్యతల్ని స్వీకరించి అందునిమిత్తం అధిక సమయం బైట గడపవలసివస్తుంది. ఆ సమయాల్లో స్త్రీ గృహ నిర్వహణ, పిల్లల సంరక్షణ, వారి చదువులు, వారి క్రమశిక్షణారాహిత్యాన్ని కనిపెట్టి తగువిధంగా సూచనలివ్వడం, దేశభక్తి పూరితాలైన కథల ద్వారా వారిని ఉత్తేజితుల్ని చేసి, దేశ సౌభాగ్యానికి, దేశ రక్షణకీ, దేశ సమైక్యతకి పాటుపడే లాగా వారికి చిన్నతనం నుండి తర్ఫీదు ఇవ్వడం (జిజియాబాయి శివాజీని హిందు మతోద్ధారకుడిగా తీర్చిదిద్దిన రీతి) వంటి గురుతరమైన బాధ్యత స్త్రీకి అప్పగించబడింది. 'మాతృదేవో భవ' అంటూ పిల్లలకి ఓనమాలు దిద్దించటం మన శిక్షా పద్ధతి.

ఇంతే కాదు. హిందూ స్త్రీ భర్తతో పాటు ఇంటి పనుల్లో, పొలాల్లో, గురుకులాల్లో, రాజకీయ రంగంలో, విద్వత్సభల్లో, యుద్ధ రంగాల్లో పాల్గొంటూ కూడా తన ప్రధాన పాత్రయైన మాతృస్థానాన్ని మరచిపోదు. ఇతర దేశాలవారికి ఈరకమైన భారతీయ స్త్రీ జీవితంలోని అలౌకికత్వం అందనిది, అర్థంకానిది.

కానుకగా ఇవ్వబడ్డ ముస్లిం సుబేదారుని అందమైన కోడల్ని సత్కరించి, గౌరవించి, ఇంటి ఆడబిడ్డలా, లాంఛనాలతో ఆమెను ఆమె భర్త వద్దకు పంపిన శివాజీలోని మహోదాత్తమైన వ్యక్తిత్వం ప్రపంచ చరిత్రకారుల కలాల కందనిది. అదీ స్త్రీ ఎడల హిందువులు చూపించే పూజనీయ భావం. స్త్రీ అంటే భోగవస్తువు అని భావించే పాశ్చాత్య సమాజానికి అర్థం కాని విషయమిది.

తల్లి, అక్క, చెల్లెలు, వదిన వీరంతా కన్నతల్లి ప్రతిరూపాలే అనుకునే విశిష్టమైన సంస్కృతి ఈ దేశానిది. నిజమైన స్త్రీ స్వాతంత్ర్యం ఈ దేశంలో మాత్రమే అనాది నుండి సాగుతోంది. ఈ స్వాతంత్ర్యంలో అంతర్లీనంగా మన సంస్కృతీ, సంస్కారాలున్నాయి.

స్త్రీ మన సంస్కృతికీ, ధర్మానికీ, మూల విరాట్టు. అందువల్లే ఇక్కడ సీత, సావిత్రి, అనసూయ, ఊర్మిళ వంటి ఆదర్శమూర్తులు జన్మించారు.

భారతీయ సాంస్కృతిక మూలస్తంభాలైన పురాణేతిహాసాలు పురుషులచే రచించబడటం వలన అందులోని స్త్రీ పాత్రలకి అన్యాయం జరిగిపోయిందనే వితండవాదం చేసే వారిక్కడ ఒక్క విషయం గమనించాలి.

ఏ యుగంలోనైనా స్త్రీ శీలవతిగా, గుణవతిగా ఉన్నప్పుడే ఆ కుటుంబం, ఆ సమాజం, ఆ దేశం పూజనీయంగా సుసంపన్నంగా ఉంటుంది. స్త్రీని అగౌరవ పరచిన కుటుంబం, అవమానించిన సమాజం నశించి తీరుతాయనే నగ్నసత్యాన్ని మన పురాణ పాత్రలు చాటి చెప్పాయి.

ఆదర్శానికీ, త్యాగానికీ కట్టుబడిన పుణ్యవతుల చరిత్రలను మనం సంస్కారపూరితమైన దృష్టితో పరిశీలిస్తేనే వాటి విలువ బోధపడుతుంది.

స్వయంవర నిర్ణయాధికారం వధువుకిచ్చి, వరమాల వేసే ఆచారం కలిగిన గొప్ప సంస్కృతి మనది.

మహమ్మదీయుల దండయాత్రల కాలంలో మన దేశంలో వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలు, బలవంతంగా రుద్దబడి, ఆ రోజుల్లోనే స్త్రీని భోగవస్తువుగా చూచే అసభ్య దృష్టి కలిగింది. అప్పుడే మన స్త్రీలు విధిగా ఆ దృష్టి నుండి రక్షించుకునేందుకు పరదాల మాటుకు చేరాల్సి రావటం, బాల్య వివాహాలు జరగటం ప్రారంభమైంది. ఆ తర్వాత ఆంగ్లేయ పాలన వలన మరో కొత్త సంస్కృతి దేశమంతా పాకి అది స్త్రీల హృదయాల్లో "పాశ్చాత్య మహిళ కున్న స్వాతంత్ర్యం మన స్త్రీలకు లేదేమో" అన్న ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ కలిగింది.

నిజానికి మన దేశంలో స్త్రీకున్న శక్తి సామర్థ్యాలు, స్వాతంత్ర్యం, ఏ విదేశీయ వనితకున్నాయి!

తల్లిగా తమ గురుతరమైన బాధ్యతల్ని నిర్వర్తించిన అహల్యాబాయి, జిజియాబాయి వంటి వీరమాతలు, మొల్ల, రంగాజమ్మ, మధురవాణి వంటి కవయిత్రులు, రాజ్యాలను సమర్థవంతంగా ఏలి, యుద్ధాలు చేసిన రుద్రమ్మ, ఝాన్సీరాణి వంటి వీరవనితలు – వీరంతా భారతీయ మహిళ వివిధ రంగాల్లో

**పరాజయం నుండి గుణపాఠం, విజయం నుండి వినయం నేర్చుకో.**

చూపించిన పాటవానికి ప్రతీకలు కారా!

గాంధీజీ ప్రారంభించిన సత్యాగ్రహోద్యమాల్లో వందలు వేల సంఖ్యలో స్త్రీలు పాల్గొనటంతో స్త్రీలు రాజకీయ రంగ ప్రవేశం చేశారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్, అవంతికాబాయ్ గోఖలే, వేదాంతం కమలమ్మ, సరోజనీ నాయుడు, లీలావతి మున్షీ, సుశీలా నయ్యర్, కమలాబాయ్ ఛటోపాధ్యాయ వంటి ఎందరో మహిళామణులు పురుషులు జైళ్ళకి వెళితే వారిస్థానే సాహసోపేతంగా సత్యాగ్రహోద్యమాన్ని నడిపి అటు ఆంగ్లేయుల్ని, ఇటు భారతీయుల్ని కూడా తమ సాహసోపేత కృత్యాలతో ఆశ్చర్య చకితుల్ని చేశారు.

ఉప్పు సత్యాగ్రహంలో 17,000 మందికి పైగా మహిళలు పాల్గొని, దాన్ని విజయవంతం చేసి, గాంధీజీ చేత "ఈనాడు భారతదేశంలోని మహిళలు వహించిన పాత్ర స్వర్ణాక్షరాలతో లిఖించదగినది" – అనిపించుకున్నారు.

"స్త్రీలు లేకుండా ఏ కాన్ఫరెన్సులు ఏ కమీషన్లు దేశ భవిష్యత్తును, దేశక్షేమాన్ని నిర్ణయించకూడదు. అలాగే దేశక్షేమం కోసం జరిగే ప్రదర్శనలు, స్త్రీలు పాల్గొనకుండా జరగకూడదు."

– ఇది నాటి మన స్త్రీల లక్ష్యం. క్విట్ ఇండియా ఉద్యమంలో ఈ లక్ష్యంతోనే పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోసు నాయకత్వంలో ఒక దళానికి అధినాయకియై యావత్ భారత జాతిని సంభ్రమాశ్చర్యాలలో ముంచింది కెప్టెన్ లక్ష్మి.

నాడు టెర్రరిస్టులుగా కూడా స్త్రీలు ఉద్యమాలు నడిపారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ప్రతీలత వడ్డేదార్, బీన్‌దాస్ ఖ్యాతి గన్న విప్లవ నాయకురాళ్ళు. ప్రతీలత చిట్టగాంగ్ ఆయుధ కర్మాగారంపై జరిగిన దాడిలో పాల్గొన్న వీరవనిత.

1947లో భారతదేశం రెండుగా చీలి శరణార్థుల సమస్య ఎదురైతే రాజకుమారి అమృతకౌర్, మృదులా సారాబాయ్, ధన్వంతరి రామారావ్ వంటి మహిళలు ఈ కాందిశీకులకు ఎనలేని సేవ చేశారు.

"మృదులా సారాబాయ్ వంటి మహిళలు 100 మంది ఉంటే నేను సాంఘిక విప్లవం తీసుకువస్తాను" – అన్నారు గాంధీజీ.

అయితే నాణానికి బొమ్మా బొరుసూ ఉన్నట్లే ఈనాడు సమాజంలో స్త్రీ కొన్ని సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే ఇవి కేవలం స్త్రీలకే సంబంధించినవి కావు. సమాజానిక్కూడా సంబంధించినవే. వీటి వలన ఎక్కువగా మానసిక వేదనకి గురౌతున్నది మహిళే.

ఇవి పేదరికం, అణచివేత, దోపిడి, నిరుద్యోగం, అజ్ఞానం, నిరక్షరాస్యత, అనారోగ్యం, అవినీతి, లంచగొండితనం, ధార్మిక జీవనం పట్ల నిర్లక్ష్యం, పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల దృష్ట్యా స్త్రీ పురుషులిద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన తప్పని పరిస్థితి, వరకట్నాల సమస్య, కట్నాల కారణంగా పెరిగిపోతున్న అవివాహిత స్త్రీల సమస్యలు, అశ్లీల సాహిత్యం, స్త్రీ అంగాంగాల్ని వీధుల్లో ప్రదర్శనకై నిలుపుతున్న సినిమాలు, వాల్‌పోస్టర్లు, ఎడ్వర్‌టైజ్‌మెంట్లు, కాన్వెంటు చదువుల పుణ్యమా అని హిందూ సంస్కృతి పట్ల పిల్లల వైముఖ్యం, అదే నవీన నాగరికతగా భావిస్తున్న సమాజం, కాన్వెంటు మొదలు యూనివర్సిటీ వరకూ కలరాలా వ్యాపించిన రాజకీయ కుల మత ప్రాంతీయ విదేశీ వ్యామోహంలో దేశ సంస్కృతీ సాంప్రదాయాలని మంటగలిపే అసమంజస వాదాలు, డ్రగ్స్, ఎదిగివస్తున్న పిల్లల్ని నేటి సమాజపు ప్రలోభాలనుండి మళ్లించేందుకు తీరిక, ఓపిక లేక ఆ పిల్లలు ఏ ఆకర్షణకు లోనై జీవితాల్ని పాడుచేసుకుంటారో అన్న ఆవేదనలు – ఇలా ఎన్నో ఎన్నెన్నో.....

ఇవన్నీ చాపకింద నీరులా దేశమంతా పాకిన పాశ్చాత్య సంస్కృతికి పుట్టిన విషపుత్రికలు.

వీటన్నింటికి ఒకరకంగా గురి తప్పిన ఉమన్ లిబ్ కారణమేమోనన్పిస్తుంది.

అంతర్గతమైన భావదాస్యం నుండి విముక్తి పొందకుండా బైట స్వాతంత్ర్యాన్ని పొందటం మనిషిని మరింత బానిసని

**పగకు పుట్టిల్లు పిడివాదం.**

చేస్తుంది.

ఈ విషయం సరిగ్గా గ్రహించలేక ఈ రోజు మనం అనుకుంటున్న ఈ ఉమన్ లిబరేషన్‌కి 23 సంవత్సరాల క్రిందట అమెరికాలో పెద్ద ఉద్యమాన్ని లేవనెత్తిన స్త్రీ బెట్టి ఫ్రైడెన్.

దీంతో అమెరికన్ ప్రభుత్వం అనేక చట్టాలు చేసి రాజకీయంగా, సామాజికంగా స్త్రీలకోసం అనేక మార్పులు చేసింది. ఫలితంగా మనం ఈనాడు అనుకరిస్తున్న పాశ్చాత్య మహిళ తయారైంది. ఆ తర్వాత అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆ చట్టాలను యథాతథంగా తమ దేశాల్లో శాసనాలుగా చేశాయి.

"తమ ఆలోచనల్ని తాము నిర్ణయించుకునే స్వాతంత్ర్యం, తమ అభిరుచుల్ని తాము అభివృద్ధి చేసుకొనే స్వేచ్ఛ హృదయంతో ప్రేమించగలిగే స్వేచ్ఛ, ఒక్క మాటలో చెప్పాలంటే మరొకరి నీడగా కాకుండా తనొక వ్యక్తిగా నిలబడగల స్వాతంత్ర్యం కావాలి" – ఇవీ ఉమన్ లిబ్ వలన స్త్రీ పొందాల్సిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు.

కాని ఈ విధంగా కాకుండా ఉమన్ లిబ్ విదేశాలలో వెర్రితలలు వేసింది. పర్యవసానంగా – అటు విదేశాల్లో, ఇటు స్వదేశంలో కూడా స్త్రీకి రక్షణ, గౌరవం, సుఖశాంతులు నశించాయి.

స్త్రీకి గృహంలో, సమాజంలో ఎంతటి విపరీత పరిణామాలు ఎదురయ్యాయో, భావితరం ఎంత పాడైపోయిందో "ది సెకండ్ స్టేజి" అనే మరో పుస్తకంలో (6 సంవత్సరాల క్రిందట) బెట్టి ఫ్రైడెన్ ఇలా వివరించింది.

"ఈ ఉమన్ లిబ్ వలన విడాకులు అధిక సంఖ్యలో వచ్చేశాయి. విడాకులు తీసుకున్న తల్లిదండ్రులు వేరు వేరు వివాహాలు చేసుకోవడం వలన వారి పిల్లలు అనాథలై, దొంగలై, డ్రగ్ ఎడిక్ట్స్‌గా, దేశాభిమానం ఏమాత్రం లేని ద్రోహులుగా, స్మగ్లర్లుగా, మానవత్వం లేని హంతకులుగా తయారయ్యారు" – అని వ్రాస్తూ తాను తీసుకువచ్చిన ఈ మూవ్‌మెంట్ వలన కలిగిన దుష్పరిణామాలకి తనని క్షమించమని కోరింది బెట్టి ఫ్రైడెన్.

ఆమె చివరికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకి పట్టుకొమ్మలాంటి హిందూ మహిళను కొనియాడుతూ –

"కొన్ని వందల సంవత్సరాల నుండి కొనసాగుతూ వస్తున్న భారతీయ గృహ జీవనాన్ని, హైందవ స్త్రీత్వాన్ని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేను సమర్థిస్తున్నాను. సామాజికాభివృద్ధికి, దేశోన్నతికీ, భారతీయ మహిళ మూలాధారం" అంది. ఆ పాశ్చాత్య వనిత మాటలు అక్షర సత్యాలు.

– డి.జి.విజయలక్ష్మి

## రాజేన్‌బాబు తర్కం

ఒక పర్యాయం డా.రాజేంద్రప్రసాద్ పాట్నా నుండి తన గ్రామమైన జీరాదేయి వెళుతున్నారు. స్టీమర్‌లోని క్యాబిన్‌లో ఒక యువకుడు ధూమపానం చేస్తున్నాడు. అతను అహంకారంతో, నిర్లక్ష్య వైఖరితో సిగరెట్ పొగ వదలుతున్నాడు. పొగవల్ల రాజేంద్రప్రసాద్‌కు ఎంతో కష్టంగా ఉంది. ఆయనకు పెద్దగా దగ్గు వచ్చింది. ఆయన కాసేపు ఎలాగో ఓర్చుకున్నాడు. కాని పరిస్థితి విషమిస్తున్నది. అప్పుడు మిక్కిలి శాంత స్వరంతో ఇలా అన్నాడు – 'బాబూ, ఈ సిగరెట్ నీదేనా?' సిగరెట్ పొగ గట్టిగా పీల్చుతూ తలపైకెత్తి ఆ యువకుడు గట్టిగా అన్నాడు, 'నాదికాక ఇది మీదా?' గర్వంతో కూడిన అతని కంఠస్వరానికి రాజేంద్రప్రసాద్ తత్తరపాటు చెందలేదు. ఆయనది మిక్కిలి శాంత స్వభావం. ఆయన ఇలా అన్నాడు, 'సిగరెట్ నీదే అయితే, దీని నుండి వచ్చే పొగ కూడా నీదే కావాలి మరి. దీన్ని ఇతరుల మీదకి వదలుతున్నావెందుకు?'

ఇది విన్నవెంటనే ఆ యువకుడు సిగ్గుపడ్డాడు. డా.రాజేంద్రప్రసాద్ ఎదుట తలవంచాడు. మన ప్రథమ రాష్ట్రపతి డా.రాజేంద్రప్రసాద్ ఇటువంటివాడు. ఆయన గంభీరుడు, శాంతిప్రియుడు, వినయశీలి.

**ప్రతిభలో ఒక శాంతి ప్రేరణ. మిగతాది అవిరళ కృషి.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 13

# ప్రాణాకర్షణకు సులభపద్ధతులు

ప్రాతఃకాలమున కాలకృత్యములు తీర్చుకొని, సాధన కొరకు ఒక శాంతి దాయకమైన ప్రదేశమునందు ఆసనము పరచి కూర్చొని, రెండు చేతులను మోకాళ్ళపై ఉంచి, వెన్నెముక నిటారుగా ఉంచి కళ్ళుమూసుకోవాలి.

ఊపిరితిత్తులలోని గాలినంతటిని పూర్తిగా బయటకు వదలి నిదానంగా ముక్కుద్వారా గాలి పీల్చటం ప్రారంభించాలి. భరింపగల్గినంత వరకు ఊపిరితిత్తులనిండా గాలి పీల్చాలి. కొంతసేపు లోపలనే అట్టి పెట్టాలి. తర్వాత గాలిని ముక్కు రంధ్రముల ద్వారా నిదానంగా బయటకు వదలాలి. ఊపిరితిత్తులు పూర్తిగా ఖాళీఅయిన తర్వాత శ్వాసను బంధించి, కొంచెము సేపయిన తర్వాత మరల నిదానంగా గాలి పీల్చడం ప్రారంభించాలి. ఇది ఒక ప్రాణాయామము.

శ్వాస లోనికి పీల్చడాన్ని పూరకమనీ, వదలడాన్నీ రేచకమనీ, బంధించడాన్ని కుంభకమనీ అంటారు. కుంభకంలో రెండు రకాలు. గాలి లోపల ఉంచి బంధిస్తే అంతః కుంభకమని, బయట ఉంచి బంధిస్తే బాహ్యకుంభకమని పిలుస్తారు. రేచక పూరకములకు ఒకే కాలం పట్టాలి. కుంభకమునకు అందులో సగం చాలు.

పూరకం చేసేటప్పుడు తాను జనశూన్య లోకమందు ఒంటరిగా కూర్చున్నట్లు నాలుగువైపులా విద్యుత్ వంటి చైతన్య జీవనశక్తి సముద్ర తరంగితమై ఉన్నట్లు భావించాలి. శ్వాస ద్వారా వాయువుతో పాటు ప్రాణశక్తిని కూడ లోనికి పీలుస్తున్నట్లు భావించాలి.

అంతఃకుంభకం చేసే సమయంలో చైతన్య ప్రాణశక్తి తన లోపల అంతటా నిండి ఉన్నట్లు సమస్త నసనాడుల యందు అంగ ప్రత్యంగముల యందు ఆ శక్తి స్థిరముగా ఉన్నట్లు, దానిని పీల్చుకొని దేహమునందలి రోమరోమము చైతన్యవంతము, వికసితము, తేజోవంతము, పరిపుష్టము అయినట్లు భావించాలి.

రేచకం చేసే సమయంలో శరీరమందు నిల్వఉన్న మలినములు, రక్తమందు నిల్వఉన్న విషములు, మనసునందు నిండిఉన్న ఆలోచనలు శ్వాసతోపాటు బయటకు వదులుతున్నట్లు భావించాలి.

బాహ్యకుంభకము చేసే సమయంలో, లోనున్న దోషములన్నియు బయటకు నెట్టబడి ద్వారములు బంధింపబడి మరల అవి లోనికి రాకుండా నిరోధింపబడినట్లు భావించాలి.

ఈ భావనతోపాటు ప్రాణాకర్షణ ప్రాణాయామము చేయాలి. మొదటి 5 సార్లు చేసి మెల్లగా ఓపికనుబట్టి పెంచుకుంటూ పోవాలి.

ఏకాంత స్థలంలోకి వెళ్ళి సమతల ప్రదేశంలో మొత్తటి ఆసనాన్ని పరచి, వీపుమీద (వెల్లికలా) పడుకొని ముఖం పై దిశలో ఉంచాలి. కాళ్ళు, నడుము, ఛాతీ, తల సరళరేఖలా ఉండాలి. రెండుచేతులు సూర్యచక్రంపైన (నడుము, పొట్టకలిసే చోటు అనగా ఆమ్లకోశము) ఉంచాలి. నోటిని మూసి ఉంచాలి. శరీరమును పూర్తిగా తేలికగా ఉంచాలి. అది ఒక నిర్జీవమైన వస్తువైనట్లు దానితో మనకు ఏమీ సంబంధము లేనట్లు భావించగనే శరీరం దానంతట అదే తేలికగా అయిపోతుంది. ఇప్పుడు మెల్లమెల్లగా ముక్కుద్వారా శ్వాసపీల్చుట ప్రారంభించాలి. దానితోపాటు దృఢమైన శక్తితో

**మనిషి స్వార్థంతో కోరే కోరికలను భగవంతుడు వినిపించుకోడు.**

ఈ విధంగా భావనచేయాలి – "విశ్వవ్యాప్తమైన అతిపెద్ద ప్రాణ భాండాగారమునుండి నేను స్వచ్ఛమైన ప్రాణమును ఊపిరితోపాటు పీల్చుచున్నాను. ఆ ప్రాణము నా యొక్క రక్తప్రవాహములోనూ నాడీ తంత్రుల ద్వారా ప్రవహించి సూర్యచక్రముతో కలసిపోతున్నది."

ఆ భావన ఎంత దృఢంగా ఉండాలంటే ప్రాణశక్తికి సంబంధించిన మెరుపువంటి కిరణాలు నాసికద్వారా దేహంలో తిరుగుతున్నట్లు చిత్రపటంవలె కన్పించాలి. దానిలో ప్రాణ ప్రవాహము ప్రవహిస్తూ రావాలి. భావన ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా ప్రాణశక్తిని పీల్చుకోగలరు.

ఊపిరితిత్తులలో గాలిని పూర్తిగా నింపి 5 నుంచి 10 సెకండ్లవరకు గాలిని ఆపాలి. మొదట 5 సెకెండ్లు చేసినప్పటికీ అభ్యాసము చేసిన తర్వాత 10 సెకండ్ల వరకు ఆపిఉంచవచ్చు. ఊపిరి ఆగిఉన్నంతసేపు లోపల కావలసినంత ప్రాణవాయువు నిండినట్లుగా భావించాలి. తరువాత గాలిని మెల్లమెల్లగా నోటిద్వారా బయటికి రప్పించాలి. బయటకువచ్చే గాలితో పాటుగా శరీరంలోని సర్వ దోషములు, రోగములు, విషములు బయటకు పోతున్నట్లుగా భావించాలి. 10 సెకండ్ల వరకు గాలి లోపలికి పీల్చకుండా ఉండి తదుపరి పైన చెప్పిన ప్రాణాయామము ప్రాణాకర్షణ చేయటం ఆరంభించాలి. ప్రాణాకర్షణకు ఆధారము ఊపిరి పీల్చి వదలటము కాదని ప్రాణము శరీరములోనికి ప్రవహిస్తున్నట్లు స్పష్టంగా చూడటము అని బాగా గుర్తు పెట్టుకోవాలి.

ఈ రకమైన ప్రాణాయామ క్రియను పది నిమిషాలతో ప్రారంభించి మెల్ల మెల్లగా అర్ధగంటవరకు పొడిగించాలి. శ్వాస ద్వారా పీల్చిన ప్రాణాయామము సూర్యచక్రములో నిండిపోతూ ఉండాలి. అంతేకాని నోటిద్వారా వదిలే సమయంలో గాలితో పాటు ప్రాణము కూడ బయటికి పోతున్నట్లు భావించితే చేసిన క్రియ అంతా వ్యర్థమైపోతుంది. దానివలన ఏవిధమైన లాభము ఉండదు.

సరి అయిన పద్ధతిలో ప్రాణాకర్షణ చేసిన సూర్య చక్రము జాగృత మవుతుంది.

ప్రక్కటెముకల సంధి, అన్నాశయము వద్ద ఉన్న గుంటలో సూర్యునితో సమానమయిన చిన్న ప్రకాశ బిందువు మానవ నేత్రములతో చూడబడగలదని ప్రతీతి. ఈ గోళము ప్రారంభమందు తక్కువ వెలుగుతో మసకగా కన్పించినా అభ్యాసంచేసిన కొలదీ పెరుగుతూ శుభ్రంగా, స్వచ్ఛంగా, మిక్కిలి ప్రకాశవంతంగా కన్పిస్తుంది. అభ్యాసం చేసినవారి కనుల ముందుగనే ఈ సూర్యచక్రము సూర్యసమానముగా వెంటనే కనిపిస్తుంది. ఈ ప్రకాశతత్వము ప్రాణశక్తియేగాని వేరు గాదు. దీని ప్రభావముచేత కఠిన కార్యములయందు అద్భుత సాఫల్యము కలుగును.

అభ్యాసం పూర్తి చేసి లేచి కూర్చోవాలి. రక్త ప్రసరణము త్వరితగతితో ఉన్నట్లు శరీరమంతటా ఒకరకమైన విద్యుత్తు ప్రసరిస్తున్నట్లు అనుభవం కలుగుతుంది. అభ్యాసం పూర్తి అయిన పిమ్మట ఒక్కచోట కొద్దిసేపు ప్రశాంతంగా కూర్చోవాలి. వెంటనే ఏ పనీ చేయకూడదు. స్నాన, భోజన, మైధునములు అసలు పనికిరావు.

పైన సర్వసాధారణంగా ఉపయోగించే శ్వాస–ప్రశ్వాస ప్రక్రియలు వర్ణింపబడినవి. దీనిని అభ్యసించడంతో మన గాయత్రీ సాధకులకు దౌర్బల్యము దూరమగును. ప్రాణవంతులు అగు లక్షణము ప్రకటితమగును. ప్రాణమయ కోశము యొక్క భూమికను దాటినంతటనే దశ ప్రాణముల పరిశోధన ప్రారంభింపవలెను.

★★★

**మన ధర్మం గంగనీరు; పరధర్మం ఎండమావి.**

ధారావాహిక : మిత్రమా! తెలుసుకో ఆత్మను-2

# మనిషికి నిజమైన మిత్రము అంతరాత్మ

పరమాత్మ ఆనంద స్వరూపుడు. ఆయన ప్రతి పనీ ఆనందంతో నిండి, ఆనందం కోసమే జరుగుతుంది. ఆనందాన్ని కలిగించి విస్తరింపజేయడానికే జరుగుతుంది. తాను క్రీడించడానికి, ఆటలాడుకోవడానికి, వినోద, మనోరంజనాలకు ఆయన ఈ జగత్తును నిర్మించాడు. ఆ లీలాధరుని లీలలు కేవలం ఆయనకే గాక ప్రతి చరాచర జీవికీ ఆనందాన్ని, ఉల్లాసాన్ని అందించేవిగా ఉంటాయి. ప్రతి ప్రాణీ నిరంతరమూ ఆనందాన్ని వెతుక్కోవడంలోనే మునిగి ఉంటుంది. తన అభిరుచికి తగిన ఆనందం ఎక్కడెక్కడ కనబడినా అక్కడకు జేరి అక్కడున్న ఏ వస్తువు తనకు ఆనందాన్నిచ్చేదిగా కనబడుతుందో దాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తుంది. నిజమైన ఆనందానికీ, మిథ్యా ఆనందాలకూ మధ్యగల తేడాను గమనించడంలో పొరపాటు జరుగవచ్చు. కానీ ప్రతి ప్రాణీ ఆనందాన్నే కోరుకుంటుందనడంలో సందేహం లేదు. పరిశుద్ధమైన లేదా అపరిశుద్ధమైన తన బుద్ధిని బట్టి ఎక్కడ ఆనందం కనబడినా అక్కడే తానుండాలని ప్రతిప్రాణీ కోరుకుంటుంది, దానినే పొందాలని తలుస్తుంది. ఈ కోరిక లేక ఆకాంక్ష కొరకే తన జీవితాన్నంతటినీ వినియోగిస్తుంది.

సత్, చిత్, ఆనందముల కలయికతో ఏర్పడిన రూపమే బ్రహ్మతత్వం. అందుకే మనం యీ మూడిటినీ కోరతాము, వాటినే వీలయినంత ఎక్కువగా పొందాలని ప్రయత్నిస్తాము. అందువలన మన ప్రవృత్తి బ్రహ్మప్రాప్తివైపుకే కలదని చెప్పాలి. ఇదే మన ప్రకృతి కూడా. ఈ జగత్తులోని జడ, చేతనాలన్నీ తమతమ ప్రకృతుల ప్రకారం ప్రవర్తిస్తాయి. జీవుడు కూడా అంతే. జీవుడు కోరుకునేది బ్రహ్మప్రాప్తిని. అది లేకుంటే అతని పని ఒక్క క్షణం కూడా ముందుకుసాగదు. తన ప్రకృతికి విరుద్ధంగా జీవునికి ఒక్క క్షణంకూడా విశ్రాంతి లభించదు.

అయినా ప్రాణి నీతిలేని, పనికిరాని దుర్మార్గపు పనులలోనే ఎక్కువ ఇష్టం చూపిస్తాడు. బద్ధకం, అహంకారం, వాసనలు, తృష్ణలకు వశుడై పోతాడు. లుబ్ధత్వంతో అంధకారాన్ని, దుఃఖాన్ని కలిగించేవైపుకే నడుస్తాడు. జీవుడిని ముంచెత్తే జడత్వ ప్రభావమే ఇందుకు కారణం. జీవుడు జడ, చైతన్యాల మిశ్రమ స్వరూపమనేది స్పష్టమైన విషయమే. చైతన్యరూపమైన బ్రహ్మ ఉనికి జీవుడిని సత్, చిత్, ఆనందములవైపుకు తిప్పుతుంది. కానీ జడత్వ ప్రభావంవల్ల అతను అటువైపునకు అనుకున్నట్లు కొనసాగలేడు. ప్రకృతి, మాయ, జడత్వాల నీడ అతనిని ఆక్రమించి ఉంటుంది. అందువల్ల అతనికి తన మార్గాన్ని నిర్ణయించుకోవడానికి అవసరమైన విధి విధానాలను చేబట్టడంలో బాధ ఏర్పడుతుంది. ప్రకృతి, మాయ, జడత్వాలు జీవుడిని తమవైపుకు లాగడం వలన అతడు దిగ్భ్రాంతికి లోనౌతాడు.

జడత్వ ప్రభావం ఎంత ఎక్కువైతే అంత ఎక్కువగా జీవుడు జడ పదార్థాల మీద ప్రేమను పెంచుకుంటాడు. వాటిమీద అధికారం, వాటిని ఎక్కువగా పోగు చేసుకోవడం, వాటిని తన సుఖానికి వాడుకోవడాలలోనే అతనికి ఇష్టం ఎక్కువగా ఏర్పడుతుంది. సోమరితనం, అహంకారం ఈ జడత్వానికి ప్రధాన చిహ్నాలు. జడపదార్థాలు జీవములేనివి. అందువలన ఎవరిలో జడత్వం ఎంతగా పెరుగుతుందో అతడు అంత సోమరిగా తయారౌతూ పోతాడు. అలాంటి జీవునికి ప్రయత్నం చేయడంలో పురుషార్థ, పరిశ్రమలలో ఇష్ట ముండదు. జీవుని చిత్తం ఈశ్వరీయ తత్త్వానికి విరోధిఅయిన సోమరితనమనే ఆసురీతత్త్వాన్ని తనలో నింపుకుంటుంది. జీవుని మనస్సు అధ్యయన, భజన, సత్కార్యాలలో లగ్నం కాకపోవడమే ఇందుకు గుర్తు. అదేవిధంగా వస్తు సంపదను ఒక సాధనంగా భావించి సమయానుసారం వాటినుంచి లాభాన్ని పొందడానికి బదులు వాటినే సర్వస్వంగా తలుస్తాడు. అవి పోతే ఏడుస్తూ

**శరీర పోషణకు అవసరమైనంతవరకే మనిషికి ధనంపై అధికారం - భాగవతం.**

కూర్చుంటాడు. నశించే నిర్జీవములైన పదార్థాల పట్ల పనికిరాని మమకారం పెంచుకోవడం జరిగిందనడానికి ఇవి నిదర్శనాలు. అహంకారమన్నది అసురత – తమో గుణానికి ప్రత్యక్షంగా కనబడే గుర్తు. క్షణక్షణం మారిపోయే వస్తువుల, పరిస్థితుల అనుకూలతల విషయంలో గర్వపడేవాడు ఈ జగత్తులోని ప్రతి పరమాణువు అతివేగంగా తన పరిధిలో తిరుగుతూ ఆయాపరిస్థితులను బట్టి తలక్రిందులౌతుందన్న విషయాన్ని మరిచిపోయినవాడే. నీటి బుడగవంటి క్షణిక సౌభాగ్యానికి ఉబ్బి తబ్బిబ్బవడ మేమిటి? నేడున్నది రేపెక్కడుంటుంది? అటువంటి దానికై అహంకరించే ప్రశ్న ఎక్కడనుంచి పుడుతుంది?

లోభ, మోహాలకు వశమై, వాసనా, తృష్ణల చేత ప్రేరితుడై ప్రాణి వివిధ రకాలయిన అకర్మలను, దుష్కర్మలను చేస్తూ ఎంతో విలువైన కాలాన్ని దురుపయోగం చేస్తాడు. ఇదే అజ్ఞానం. ఇదే మాయ. ఇదే అవిద్య. ఒక వైపున ఆత్మయొక్క సత్, చిత్, ఆనందముల మూల ప్రకృతి జీవుడిని ఉన్నత భూమికవైపునకు నడిచే ప్రేరణ ఇస్తుంది; మరొకవైపు జడత్వం, మాయల ప్రకోపం జీవుడిని ముంచెత్తుతూ ఉంటుంది. ఒక వైపున దైవీ ప్రకృతి జీవుడిని తనవైపునకు లాగుతుంటే, మరోవైపున ఆసురీ ప్రకృతి అతడిని తనవైపునకు లాగుతుంది. ఫలితంగా – ధర్మక్షేత్ర కురుక్షేత్రమైన అంతఃకరణలో అశాంతి, అసంతోషాలన్న మహాభారత యుద్ధ మేర్పడుతుంది. జడత్వం మనను బంధనాలలో బంధిస్తుంది. చైతన్యం ముక్తి సందేశాన్ని అందిస్తుంది.

ఈ మహాయుద్ధంలో ఎవరిమీద ఆత్మ తన స్వీకార ముద్రను వేస్తుందో అతనిదే గెలుపు. తన ఓటు ఏ పక్షం వైపున పడుతుందో ఆ పక్షానిదే గెలుపు. ఒక పిల్లవానిని ఇద్దరు తల్లులు తన వాడంటే తనపిల్లడంటూ న్యాయ పోరాటానికి దిగితే న్యాయాధిపతి ఆ పిల్లవాడు ఏస్త్రీ దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడతాడో, ఎవరిని తన తల్లిగా గుర్తిస్తాడో ఆమెయే వాని తల్లి అని తీర్పు చెబుతాడు. జడ, చైతన్యాలలో ఒకరు తల్లి, మరొకరు పరాయి ఆడది. రెండూ ఆత్మను తనది తనదంటూ తమవైపునకు లాక్కునే ప్రయత్నం చేస్తాయి. ఐతే తీర్పు ఆత్మాభిరుచిమీద ఆధారపడి ఉంటుంది. జీవునిముందు ఉత్థాన, పతనాలకు చెందిన రెండు త్రోవలూ తెరిచిఉన్నాయి. ఏది ఇష్టమో దానిని అతడు అనుసరించవచ్చు.

జీవుని మీద దైవీ, ఆసురీ చైతన్యాలు రెంటి ప్రభావమూ ఉంది. జీవుడు దేనివైపు ఉన్ముఖుడౌతాడో ఆ స్వరూపాన్ని తాను పొందుతూపోతాడు. జడత్వంలో, మాయలో మునిగిపోతే, అధోగతిని పొందుతాడు. పాపం, పతనం, నరకముల దుర్గతిలో మునిగిపోతూ ఉంటాడు. ఐతే ఆ జీవుడు తన మూల ప్రకృతి అయిన సత్ – చిత్ – ఆనందముల నిర్వహణను కొనసాగిస్తూపోతే, అతనికి బంధముల నుండి విముక్తి తప్పదు; అతనికి పూర్ణత్వం అనే లక్ష్యాన్ని పొందడానికి ఏవిధమైన కష్టమూ కలుగదు. మన నిజస్వరూపాన్ని గుర్తించగలగటం ఇందుకు అత్యవసరం.

## ప్రాధాన్యం మనసుకుకాక – ఆత్మకు

సామాన్యంగా బాహ్యమును మాత్రమే చూస్తూ, వింటూ, అర్థం చేసుకుంటూ ఉండే మనిషి జ్ఞాని కాజాలడు. కానీ అతడే నిజమైన జ్ఞాని అని భావించడం జరుగుతుంది. అందుకు కారణం భ్రమ. నిజమైన జ్ఞానం కానిదానిని జ్ఞానంగా తలుస్తూ, దాని ననుసరించి కార్యాలను ఆచరిస్తూ పోవడంవల్లనే మనిషి తన అసలు లక్ష్యమైన సుఖ, శాంతులవైపునకుగాక వాటికి వ్యతిరేకమైనవాటి వైపు నడుస్తాడు. నిజమైన జ్ఞాన అనుభవం కలిగినది మనిషి అంతరాత్మ. అది శుద్ధము, బుద్ధమునైన స్వయం చేతన. కనుక దానికి అజ్ఞానమన్న చీకటి అంటుకోదు. అది పరమాత్మయొక్క అంశ. కనుక పరమాత్మ వలెనే సదానందమయము. పరమాత్మ సన్నిధిలో అసత్యముండడం అసంభవం. అదేవిధంగా పరమాత్మ అంశయే ఐన ఆత్మలో అసత్యం ప్రవేశించడమన్నది కుదరదు.

మనిషి అంతరాత్మ దేనిని చూస్తుందో, దేనిని వింటుందో, దేనిని అర్థం చేసుకుంటుందో అదే సత్యం, అదే నిజమైన జ్ఞానం. 'అంతరాత్మ చెప్పు చేతలకు బద్ధుడైనవాడే సత్యాన్ని చూడగలుగుతాడు. నిజమైన జ్ఞానాన్ని

**చంద్రుడు రాహుగ్రస్తుడైనా అమృత కిరణాలనే ప్రసరింపజేస్తాడు – గాథాసప్తశతి.**

పొందగలుగుతాడు. అలాంటి మనిషికి దుఃఖ సంతోషాల వంటి ద్వంద్వాలు సహజంగా సమసిపోయి, సమస్థితి కలుగుతుంది. వెలుతురున్నచోట చీకటి జ్ఞానమున్న చోట దుఃఖం ఉండనేలేవు. వెలుతురు లేమియే చీకటి. జ్ఞానరాహిత్యమే దుఃఖం. దుఃఖానికి తనదంటూ ఒక మూలభూతమైన ఉనికి ఏదీ లేదు.

అంతరాత్మ మాటను వినడం, పాటించడమే అనుశాసనం. మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది కూడానా? అన్న సందేహం కలుగువచ్చు. ఔను, మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది. కానీ దాని మాట మన మాటవలె స్థూలంగా ఉండదు; శబ్దంతో కూడి ఉండదు. అది సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. బాహ్యములు, స్థూలములునైన చెవులతో దానిని వినడం కుదరదు. మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది. కానీ మౌనమైన ఆలోచనల స్ఫురణకు చెందిన భాషలో మాట్లాడుతుంది. కోలాహలంతో నిండిన తన మానసిక స్థితిలో మనిషి దాన్ని వినలేడు. అంతరాత్మ వాణిని వినాలంటే మనిషిలోని మానసిక కోలాహలం ఆగిపోవాలి.

అంతరాత్మ సాన్నిధ్యం మనిషిని దాని మాటలు వినగలిగేటట్లు చేస్తుంది. నిజానికి మనష్యునిలో అంతరాత్మ సర్వకాలాలలోను ఉండనే ఉంటుంది. కానీ ఆవిషయాన్ని తెలుసుకోవడానికై మనిషికి దానితో సన్నిహిత పరిచయం ఏర్పడాలి, దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. ఎంత దగ్గరగా ఉన్న వస్తువైనా అదేమిటో తెలుసుకోకపోతే దూరంగా ఉన్నదానితో సమానమే ఔతుందిగదా! రైలులో ప్రయాణం చేస్తున్నప్పుడు బుజం బుజం కలిపి కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు ఎంత దగ్గరగా కూర్చున్నా ఒకరికొకరు దూరంవాళ్ళే గదా! పరిచయమే లేని వ్యక్తుల మాట అట్లా ఉంచండి. జీవితాంతము ఒకరి ప్రక్కన ఒకరు జీవించిన వాళ్ళు కూడ తమ మధ్య ఆంతరికమైన పరిచయం లేకపోతే ఒకరి కొకరు దూరంవాళ్లే ఔతారు. వాళ్ళు ఒకరినొకరు సరిగ్గా అర్థం చేసుకోలేకపోతారు.

అంతరాత్మను తెలుసుకోవడానికి ఒకే ఒక ఉపాయముంది. అది – దాని విషయంలో నిరంతరం జిజ్ఞాస కలిగి ఉండడం. ఒక విషయంలో వ్యక్తి ఎంత సచేతనుడై ఉంటాడో అంతగా దానిని లోతులనుంచి తెలుసుకోకలుగుతాడు, ఏదో ఒక రోజున దానిని పూర్తిగా అర్థం చేసుకోగలుగుతాడు. మీ ఆత్మ విషయంలో చేతనతో కలిగి, తెలుసుకోవలెననే జిజ్ఞాస కలిగి ఉండండి. మీ ఆత్మను పరిచయం చేసుకుంటే, దాని మాటలు వినగలిగితే, అది చేసే మార్గనిర్దేశాన్ని అనుసరిస్తే – మీరు అజ్ఞానం నుంచి విముక్తు లౌతారు. జీవితంలో నిజమైన సుఖశాంతులు పొందుతారు.

మనిషి ఏ పని చేసినా, చాలావరకు అంతఃప్రేరణతోనే చేస్తాడు. ఐతే ఆ అంతఃప్రేరణ అంతరాత్మ ప్రేరణ కాదు. ఆ పని మానసిక ప్రేరణవల్ల చేసిన పని. ఆపని స్వభావం మనిషిని పతనం వైపునకు నడుపుతుంది; చంచలంగా ఉంటుంది; నిరంకుశంగా, అడ్డు ఆపులేకుండా ఉంటుంది; వ్యక్తికి అనేక యాతనలను, బాధలను కలిగిస్తుంది. అది ఇంద్రియాలద్వారా జరిగే పనుల రూపంలో ప్రేరణను పొంది, చివరకు మనిషిని అంధకారం వైపునకు లాక్కుపోతుంది.

మనిషి విశృంఖలంగా ప్రవర్తించే మనస్సు యొక్క ప్రేరణతో నడిచినంతవరకు అటువంటి మార్గంలోనే ముందుకు సాగుతాడు. ఆ మార్గం సుఖ దుఃఖాలు, శోక సంతోషాలు అన్న ముళ్లతో నిండి ఉంటుంది. నిజానికి మనిషి తన అంతరాత్మ వాణిని మనస్సు చేసే కోలాహలంలో వినలేకపోతాడు. మనస్సు స్వభావం గెంతులు, అరుపులతో నిండి ఉంటుంది. మనిషి అంతరాత్మ శాంతంగా, నిశ్చలంగా ఉంటుంది. అది మనస్సువలె కోలాహలం చేయదు, ఎగుర్లాటలు చేయదు. ఈ చపలత్వం వల్లనే మనిషి మనస్సు అతని అంతరాత్మను వెనుకకు త్రొక్కి మనిషికి పనికిరాని ప్రేరణల నిస్తూఉంటుంది. తీవ్ర స్వరంతోను, తీవ్ర ఆదేశాలతోను మనస్సు మనిషిని తనకు లోబరచుకుని తనకు దానుడిని చేసుకుంటుంది. కానీ శుద్ధము, బుద్ధము, శాంతమూ అయిన ఆత్మమాత్రం మనిషిని ఆవిధంగా తయారుచేయదు.

మనస్సు చేసే కోలాహలానికి చెవులు మూసుకునే గుణముండాలి అంతరాత్మ జిజ్ఞాసువుకు. ఆ పద్ధతిని అభ్యాసం

**ఆశలేనివానికి అడవి అయినా ఇల్లయినా ఒకటే.**

చేయాలి. అంతరాత్మ ఆదేశాలను విని వాటిని పాటించడం ప్రారంభించిన రోజునుంచి మనిషి నిజమైన సుఖాన్ని, శాంతిని పొందడానికి అధికారి ఔతాడు. తీవ్రమైన జిజ్ఞాసవల్ల మనిషి చెవి ఆ తన్మయత్వాన్ని అతి తేలికగా పొందగలుగుతుంది. అంతరాత్మ ఆదేశాన్ని తేలికగా వినడానికి ఆ తన్మయత్వం సహాయపడుతుంది. మనిషికి నిజమైన మిత్రము ఆత్మయే. అది ఎల్లప్పుడూ మనిషిని మంచి మార్గంలో నడవమనీ, చెడు మార్గం విషయంలో జాగ్రత్త పడమనీ హెచ్చరిస్తుంది. కానీ మనస్సు చేసే కోలాహలంలో మునిగిపోయి, మనిషి దాని హెచ్చరికను పట్టించుకోడు. అదే మిక్కిలి చింతించవలసిన విషయం. మనిషి నిజంగా దాన్ని వినదలుచుకుంటే, దానిమీదే ధ్యానం నిలిపితే – దాన్ని వినగలుగుతాడు. ఎన్ని కంఠస్వరాల చప్పుడులున్నా శిశువు తన తల్లి కంఠస్వరాన్ని అతితేలికగా గుర్తుపడతాడా లేదా?

అంతరాత్మ మనిషికి నిజమైన మిత్రము. అది అతని మంచిని కోరుకుంటుంది. ఐతే "అది అతనికి ప్రత్యక్షంగా కనబడదెందుకు? చాటుమాటుల్లో దాగుతుందేమిటి?" అన్న ప్రశ్నలు ఏ మనిషి మదిలోనైనా పుట్టవచ్చు. ఆ ప్రశ్నలకు అతి తేలికగా సమాధాన మియ్యవచ్చు. ఆత్మ ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా కనబడుతూనే ఉంటుంది. కానీ మనిషి దానిని చూడలేకపోతున్నాడు. దానిని చూడలేకపోవడం మనిషి చూపులో గల దోషం. సూర్యుడు ఎప్పుడూ ప్రత్యక్షమే. కానీ సూర్యునికీ, మన చుపునకూ మధ్యలో మేఘం ఏర్పడడంవల్ల అతడు మన కళ్లకు కనబడడు. అదే విధంగా మనిషికి, అతని ఆత్మకు మధ్య మనస్సు యొక్క ప్రాధాన్యం అన్న తెర ఉంటుంది. మనిషి మనస్సు యొక్క ఈ ప్రాధాన్యాన్ని కాదనగలిగితే, తప్పకుండా అతని అంతరాత్మ వెలుతురువలె అతని ముందు వెలుగుతుంది. అదే మానవ జీవనానికి పరమసార్థకత. ఆత్మయే తెలుసుకోదగినది, ఉపాసించదగినది, సాధించదగినది.

★★★

## నా పూజ ఇదే

ఆనాడు ఆదివారం. ఉదయాన్నే ఒక క్రైస్తవ వ్యక్తి దీనబంధు ఏండ్రూస్‌ను కలుసుకునేందుకు వచ్చాడు. సంభాషణ సాగుతోంది. ఇంతలో తొమ్మిది గంటలు అయింది. దీనబంధు ఏండ్రూస్ గడియారం చూచుకున్నాడు. 'క్షమించండి, నేను చర్చికి వెళ్ళాలి' అన్నాడు.

'చర్చికి నేను కూడా వెళ్ళాలి. పదండి నేనూ వస్తాను' – ఆ వ్యక్తి అన్నాడు.

'కాని, నేను మీరు వెళ్ళే చర్చికి పోవడం లేదు' – దీనబంధు ఏండ్రూస్ చెప్పాడు.

'అయితే మీరు ప్రార్థన ఎక్కడ చేస్తారు?' – ఆ వ్యక్తి ఆశ్చర్యంతో అడిగాడు.

దీనబంధు చిరునవ్వు నవ్వి ఆ వ్యక్తిని తనతో రమ్మన్నాడు. అతనిని తీసుకొని నగరంలోని శుభ్రమైన వీధులను దాటి హరిజన బస్తీలోని ఒక గుడిసె లోపలికి ప్రవేశించాడు. అక్కడ మంచం మీద 10–12 ఏండ్ల బాలుడు పడుకుని ఉన్నాడు. ఒక వృద్ధుడు విసనకర్రతో విసురుతున్నాడు. దీనబంధు ఆ వృద్ధుని చేతిలో నుండి విసనకర్ర గ్రహించి, 'బాబా, ఇక మీరు వెళ్ళండి,' – అన్నాడు.

వృద్ధుడు వెళ్ళిన తర్వాత తనతో వచ్చిన వ్యక్తితో అన్నాడు – 'ఇతడు అనాథ బాలుడు. క్షయరోగి. పొరుగున ఉన్న ఈ వృద్ధుడు ఇతని మంచి, చెడ్డలు చూస్తున్నాడు. కాని ఈ వృద్ధుడు 10 గంటల నుండి 2 గంటల వరకు పనికై వెళ్ళాలి. ఈ సమయంలో రోగికి నేను సేవ చేస్తున్నాను. 4 గంటల తర్వాత ఆ వృద్ధుడు తిరిగి వస్తాడు. నా పూజ, నా ప్రార్థన ఇదే. ఈ గుడిసెయే నా చర్చి.'

**శరీరం క్షణ భంగురం. గుణాలు కల్పాంతంవరకు ఉండేవి –** ఋగ్వేదం.

ధారావాహిక : సమాజానికి వెన్నెముక వానప్రస్థం-4

# వానప్రస్థం వాస్తవానికి రెండవ జన్మ

## బాల్యదశలోనే ఉపనయన సంస్కారం

ద్విజత్వానికి ప్రతీక యజ్ఞోపవీతం. ఆదర్శ జీవితాన్ని గడిపే వ్రతాన్ని బుద్ధి వికసించడంతోనే స్వీకరించడం అవసరం. భావనాశీలుడైన ప్రతి వ్యక్తీ తినడానికీ, కనడానికీ కాక - దైవ ప్రాప్తి కోసం జీవించాలి. అందుకై - బాలునికి ఆలోచనాశీలత ఉదయించగానే అతడి బుజాలపై ఈ బాధ్యతను మోపవలసి ఉంటుంది. మానవ జన్మను సార్థకం చేసుకునే విధి విధానాలను అతడికి నేర్పవలసి ఉంటుంది. ఉపనయన సంస్కారంలోని ఆశయం ఇదే.

**ప్రపంచంలో వ్యాపించి ఉన్న అజ్ఞానంతో పోరాడేవాడు బ్రాహ్మణుడు. అసమర్థతతో పోరాడేవాడు క్షత్రియుడు. లేమితో పోరాడేవాడు వైశ్యుడు. వాసన, తృష్ణలలో మునిగితేలే వ్యక్తి, తినడం కనడములను మించి ఆలోచించని వ్యక్తి అంత్యజుడు.** అంత్యజుల వంటివారు యజ్ఞోపవీతాన్ని ధరించే సాహసం చేయరు. వారిపై యజ్ఞోపవీతాన్ని బలవంతాన రుద్దలేము.

ఈ యజ్ఞోపవీత ధారణకు పరిపక్వ దశ జీవితపు తొలి సగం తర్వాత వస్తుంది. బ్రహ్మచర్యంలో, గృహస్థంలో కూడ ఉదాత్త దృక్పథాన్ని అనుసరించాలన్నది నిజమే. వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం జరపాలన్నది నిజమే. అయితే - శరీర, మనస్సు, కుటుంబ పరిధులను దాటి విశ్వ మానవ సేవా సాధనకు అంకితం అయినపుడే తీక్షణమైన పురుషార్థ జీవనం ప్రారంభం అవుతుంది. యజ్ఞోపవీతాన్ని ధరించేటప్పుడు చేసే ద్విజత్వ ప్రతిజ్ఞ - పరమార్థ పరాయణత ప్రతిజ్ఞ, ఈ జన్మలో మరోజన్మ ఎత్తే ప్రతిజ్ఞ - చాలకాలం చిన్నమొక్కగా ఉన్న తర్వాత వానప్రస్థంలో ఫలించి, పుష్పిస్తుంది. వాస్తవానికి, ద్విజత్వం యొక్క - రెండవ జన్మయొక్క - యోగ్యత, సామర్థ్యం వయసు మళ్లినపుడే ఉత్పన్నం అవుతాయి.

## వానప్రస్థం రెండవ జన్మ

ప్రకృతి ప్రసాదించిన జన్మను పొందడం తేలిక. అందులో మనిషి స్వయంగా చేయవలసింది ఏమీ ఉండదు. అందుకు సాహసం అవసరం ఉండదు. అంతా తన క్రమంలో జరిగిపోతుంది. మనిషి తనకు ప్రకృతి ఇచ్చిన పశు జన్మయొక్క ప్రవాహాన్ని తలక్రిందులుచేసి తాను నిర్మించిన జన్మాంతరాన్ని - రెండవ జన్మను - ప్రవేశపెట్టేటప్పుడు సాహసానికి పరీక్ష ఎదురవుతుంది. ఎందుకంటే - అప్పుడు మనిషి తన భావనల తీక్షణత ఆధారంగా పశు జన్మను వదలి దేవ జన్మలో ప్రవేశిస్తాడు. ఈ పౌరుషానికి పేరే వానప్రస్థం. వానప్రస్థం అంటే తనకు తానుగా బలిదానం కావడం.

యుద్ధరంగంలో శత్రువు తుపాకీకి తన గుండె బలి ఇవ్వడం తేలిక. ఎందుకంటే - యుద్ధ రంగంలో సైనికుల లక్ష్యం శత్రువు తల నరకడం, విజయలక్ష్మిని వరించడం. ఆ ఆకాంక్ష పూర్తి కాకపోవడం, దానికి బదులు తన తలను ఇవ్వడం కాకతాళీయం మాత్రమే. తనను తాను బలి ఇచ్చే వ్యక్తి మనః స్థితిలో ఇంతకు మించిన సాహసం ఉంటుంది. అతడు మొదటినుంచీ తన భౌతిక ఆకాంక్షలను వదులుకుని సాగుతాడు; తన అస్తిత్వం మొత్తాన్ని ప్రభు చరణాలకు సర్వ సమర్పణ చేస్తానని ప్రతిజ్ఞ తీసుకుంటాడు; తనకోసం కాక భగవంతుని కోసం జీవిస్తాడు; సంయమనపు అగ్నిలో తనను తాను కరిగించుకుంటాడు. భోగ సాధనాలనూ, సాఫల్యాలనూ వదులుకుని ఔదార్యాన్ని మనస్సులో స్థిరపరచుకుని, స్థితప్రజ్ఞుని పాత్రలో, అవధూత పాత్రలో, పరమహంస పాత్రలో ప్రవేశిస్తాడు.

ఈ వైరాగ్యం, ఈ బలిదానం వీర పురుషుల మార్గం. ఇది ముళ్లబాట. ఇలాంటి ఉదాత్త జీవనం గురించి ఊహించేవారు చాలమంది ఉంటారు. కానీ, అగ్ని పరీక్ష ఘడియ వచ్చేసరికి జారిపోకుండా మిగిలేవారు బహుకొద్దిమందే. మన సాంస్కృతిక వారసత్వం ప్రకారం - ప్రతి బ్రహ్మచారీ జీవితపు మలిసగంలో అలాంటి సాహసం చేయవలసి ఉంటుంది. ఇలా సాహసంతో రెండవ జన్మను స్వీకరించడమే వానప్రస్థం.

**చితి శవాన్ని కాలుస్తుంది. చింత మనిషిని కాలుస్తుంది.**

వానప్రస్థం ఒక సంస్కారం కూడా. ఈ సంస్కారంతోపాటు కొన్ని మహత్తర బాధ్యతలు బుజంమీద పడతాయి. బాల్యదశలోని సంస్కారాలు శిక్షణ స్థాయికి చెందినవి. అయితే, వివాహ సంస్కారంతో పాటు గురుతర బాధ్యతల బరువు వ్యక్తిమీద పడుతుంది. కొత్త కుటుంబానికి శ్రీకారం చుట్టడమేకదా వివాహం అంటే.

అలాగే వానప్రస్థంలో ప్రభుసమర్పిత జీవితం గడిపే వ్రతాన్ని స్వీకరించవలసి ఉంటుంది. మానవాళిని తన కుటుంబంగా పరిగణించవలసి ఉంటుంది. మానవాళి ప్రగతికి తన శక్తియుక్తులను ధారపోయవలసి ఉంటుంది. దేవ జీవనంలో ప్రవేశించే నూతన భూమిక ఇది.

## జీవితపు మలిసగం దేవభాగం

**జీవితపు మలిసగం దేవ భాగమనీ, దానిని దేవ ప్రయోజనాలకే వినియోగించాలనీ భారతీయ సంస్కృతి చెపుతోంది.** తొలి సగాన్ని భౌతిక కాంక్షలను తృప్తిపరచడానికి వినియోగించడం సబబే. ఆ దశలో ఇంద్రియాలనే గుర్రాలూ, మనస్సనే నెమలీ కదనుతొక్కుతూ, నాట్యం చేస్తూ ఉంటాయి. ముందు వెనుకలు ఆలోచించే వయస్సు కాదది. ఇంద్రియాలపై అదుపు అప్పుడు కష్టమవుతుంది. అలాంటి దశలో – వరద ఉధృతం తగ్గేవరకు వేచిచూడడంలో తప్పు లేదు.

అంతే కాదు. వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణముల ప్రాముఖ్యం తక్కువేమీ కాదు. కఠినమైన జీవిత పరీక్షలో నెగ్గుకురావడానికి అవసరమయ్యే సాధన సంపత్తిని సమకూర్చుకోవడం యౌవనం రాకముందునుంచే ప్రారంభం కావాలి. సంయమనంతో, వ్యాయామంతో శరీరాన్ని సుదృఢం చేసుకొనకపోతే, అనుభవాన్నీ అనుశాసనాన్నీ నేర్చుకొనకపోతే – గృహస్థ జీవితపు బరువు బాధ్యతలను ఎలా మోయగలుగుతాము ?

## సమాజానికి చిన్న నమూనా కుటుంబం

కుటుంబాన్ని నిర్వహించడం, మెరుగుపరచడం సమాజ నిర్వహణకు, సమాజ సంస్కరణకూ ఒక చిన్న నమూనా. గృహస్థ ఆశ్రమ నిర్వహణ మానవసేవకు ఒక చిన్న పరిశోధన శాల. ఆశలు బలీయంగా ఉంటాయి. వాటిని అదుపుచేయడం కష్టం. లాలసలూ, కామనల పంచరంగుల కలలూ కనిపిస్తూ ఉంటాయి. సుఖభోగాలను అనుభవించాలనే కోరిక ఉరకలు వేస్తూ ఉంటుంది. అయితే – సన్నిహితమై అనుభవంలోనికి వచ్చినప్పుడు, అవి దూరంనుంచి చూచినప్పుడే ఆకర్షకంగా కనిపిస్తాయని స్పష్టమవుతుంది. దగ్గరకు వచ్చినప్పుడు వాటిలో మంట, నిరాశతప్ప మరేవీ లేవని తెలిసివస్తుంది.

విత్తేషణ (ధన వ్యామోహం), పుత్రేషణ (సంతానంపై వ్యామోహం), లోకేషణ (పేరు ప్రతిష్ఠలపై వ్యామోహం)ల వెనుక మనిషి పిచ్చివానిలా పరుగులు తీస్తాడు. ధన లిప్స, ఇంద్రియ భోగములు, అహంకారాలను తృప్తిపరచడానికై తహతహలాడే మనస్సుకు ఆ విషపు ముళ్లు గుచ్చుకున్నప్పుడు – మత్తు దిగిపోతుంది; భ్రమ తొలగిపోతుంది. ఈ జంజాటాలు మలిసగంలో నుంచి కొంత సమయాన్ని తగ్గించవచ్చు. సగానికి బదులు మూడవ వంతుతోనే సంతృప్తిపడవచ్చు.

75 సంవత్సరాలలో మూడింట రెండ వంతులు కుటుంబం కోసం వినియోగించవచ్చు. అప్పుడు 50 నుండి 75 సంవత్సరాల వయస్సు వరకు 25 సంవత్సరాలపాటు వానప్రస్థ సన్యాస ఆశ్రమాలలో గడపవచ్చు.

ఈ వయస్సుకు ముందే వానప్రస్థాన్ని స్వీకరించడం సాధ్యమని భావించేవారు సంకోచించవలసిన అవసరం లేదు. 75 సంవత్సరాల ఆయుర్దాయంకూడ ధృవ సత్యం కాదు. మరణం ఏ క్షణంలో అయినా రావచ్చు. నవ యువకులు సైతం మరణించడం మనం చూస్తున్నాం. కనుక 75 సంవత్సరాల ఆయుర్దాయపు అంచనాను ఎంత తగ్గించి వ్యవహరించగలిగితే అంత మంచిది. దానిని పెంచడం తగదు. చిన్న పిల్లల బాధ్యతలు తీరకపోతే – అది వేరే విషయం.

ఆయుర్దాయం దృష్ట్యా 50 సంవత్సరాల వయస్సు స్థూలంగానే నిర్ణయించబడింది. ఆ వయస్సుకు ముందే తృష్ణా, వాసనలూ శాంతిస్తే, గతంలో సంపాదించిన ఆస్థి ఆధారంగా

**సుఖానికి మూలం ధర్మం** – చాణక్యుడు.

కాని, కుటుంబంలోని ఇతర వ్యక్తుల సహాయంతో కాని కుటుంబపు ఆర్థిక బాధ్యత నిర్వహణకు తగు వ్యవస్థ ఏర్పడితే – ఆ 50 సంవత్సరాల పరిధిని ఎంత తగ్గిస్తే అంత మంచిది. మానవ జన్మలోని ఒక్కొక్క క్షణం ముత్యంలాంటిది, వజ్రంలాంటిది. అమూల్యమైన ఆ సంపదను తినడం, కనడంవంటి పశు కర్మలకు ఎంత తక్కువ దుర్వినియోగపరిస్తే అంత మంచిది.

నిజానికి పరమార్థ పరాయణత్వం ప్రతి ఆశ్రమంలో, ప్రతి వయస్సులో, ప్రతి పరిస్థితిలో ఏదోవిధంగా, ఏదో స్థాయిలో కొనసాగుతూ ఉండవలసిందే. అయితే, దానికి పూర్తిగా అంకితమయ్యే స్థితి రావడాన్ని వానప్రస్థంగా పరిగణించవచ్చు. గృహస్థ ఆశ్రమాన్ని నిర్వహించకుండానే, బ్రహ్మచర్యంనుండి వానప్రస్థానానికి వెళ్లవచ్చు.

కానీ – ఒకసారి గృహస్థ ఆశ్రమంలో ప్రవేశించిన తర్వాత భార్యకూ, సంతానానికీ శారీరికంగా, మానసికంగా తగు ఏర్పాట్లు జరగకుండా, వారిని అనాథలుగా, నిరాశ్రయులుగా వదిలివేసి, భావావేశంలో పారిపోవడం తగదు. పిల్లల చదువు, ఉద్యోగం, వివాహం అనే బాధ్యతలు మూడూ ముందుగానే పూర్తిచేసుకోవడం మంచిది. ఇందుకోసం ముందునుంచీ సన్నాహాలు చేసుకోవాలి. ప్రాచీన కాలంలో వలె 30 – 35 సంవత్సరాల వయస్సు తర్వాత పిల్లలను కనడం నిలిపివేయాలి. 50 – 55 సంవత్సరాల వయస్సులో ఉద్యోగ విరమణ చేసే సమయానికి కుటుంబ సభ్యులందరూ స్వావలంబులు అయేటట్లు చూడాలి. ఇలా ముందుచూపుతో మొదటినుంచీ తగు ఏర్పాట్లు చేసుకుంటే – ఆ తర్వాత నిశ్చింతగా వానప్రస్థాన్ని స్వీకరించవచ్చు.

## ఆచరణాత్మకమైన సన్నాహాలు

ఇలా ముందుచూపుతో తగు ఏర్పాట్లు చేసుకోనివారికి కొద్ది అవకాశాలే మిగులుతాయి. గతంలో సంపాదించిన ఆస్థి పిల్లలు తమ కాళ్లమీద నిలబడేవరకు సరిపోతే, వ్యక్తి కుటుంబ బాధ్యతలనుండి తప్పుకోవచ్చు. ఇది ఒక మార్గం. తమ్ముళ్ల, చెల్లెళ్ల పోషణ భారం వహించి, పితృ ఋణంనుంచీ మాతృ ఋణంనుంచీ విముక్తి పొందాలనే ఆదర్శాన్ని పెద్దకొడుకు ముందుంచడం మరో మార్గం.

నేటి స్వార్థపూరిత వాతావరణంలో పెద్దకొడుకులలో పలువురు తల్లి దండ్రులనుండి ఆర్థికంగా లబ్ధిపొందిన తర్వాత ఉద్యోగం దొరకగానే భార్యతో వేరు కాపురం పెడుతున్నారు. ఋణ విముక్తి పొందాలనే ఆలోచనే రాదు వారికి. మిగిలిన ఆస్థిని ఏదోవిధంగా మ్రింగివేయాలనే ఆలోచన వస్తుంది వారికి. తమ్ముళ్ల గురించీ, చెల్లెళ్ల గురించీ వారికి పట్టదు. తండ్రి ఆస్థిలో వాటాకు వస్తారని వాళ్లమీద గుర్రుగా ఉంటుంది కూడా. సంతానం కోసం తహతహలాడే అజ్ఞానానికి శిక్ష ఈ పరిస్థితి. ఈ కలియుగంలో సంతానం సంఖ్యను పెంచుకుంటూ పోవడం ఉరిత్రాడును బిగించుకోవడమనే వాస్తవం వీరికి అర్థంకాదు.

కుటుంబ బాధ్యతను స్వీకరించడానికి తమ పెద్దకొడుకులు ఒప్పుకుని, తమ భార్యల చేతకూడ ఒప్పించగలిగితే – ఆ తండ్రులు అదృష్టవంతులే.

ముందుగా ఏర్పాటు చేసుకోవడంలో మరో మార్గంకూడ అవలంబించవచ్చు. భార్యను చదివించి, స్వావలంబిగా చేయవచ్చు. అయితే, సంతానం కనీసంగా ఉన్నప్పుడే కుటుంబ బాధ్యతలను భార్యకు వదిలి భర్త వానప్రస్థాన్ని స్వీకరించడం తేలిక అవుతుంది. పెద్ద సంసారాన్ని ఒంటరిగా ఈదడం ఆమెకు కష్టసాధ్యం అవుతుంది. పిల్లల కడుపులు నింపడం ఒక్కటే చాలదు. వాళ్లకోసం ఇంకా చాలా బాధ్యతలను మోయవలసివస్తుంది. అందుకు భర్త సహకారం అవసరం అవుతుంది.

పారమార్థిక జీవితాన్ని గడపాలనే వ్రతాన్ని స్వీకరించిన భార్యా భర్తలు మరో పని చేయవచ్చు. సంతానాన్ని కనే జంజాటంలో పడకుండా ఉండవచ్చు. అప్పుడు వారు ఏ వయస్సులో అయినా వానప్రస్థంలో ప్రవేశించవచ్చు. సంతానం కలగని దంపతులు అదృష్టవంతులు. భగవంతుని కృప తమపై వర్షించిందనీ, దేవ జీవనానికి పూర్తిగా అంకితమయ్యే సౌభాగ్యాన్ని ఆయన తమకు ప్రసాదించాడనీ వారు ఆనందించవచ్చు.

★★★

**సుఖాలన్నింటిలో తృప్తి శ్రేష్టమైనది – చాణక్యుడు.**

## ధారావాహిక : వృద్ధాప్యం జీవిత నవనీతం-4

# వృద్ధులపట్ల యువతరం బాధ్యత

భారతీయ సంస్కృతికి కేంద్ర బిందువు కుటుంబం. ఆశ్రమాలు నాలుగింటిలో గృహస్థాశ్రమం అత్యంత ప్రధానమైనది. మిగతా మూడు ఆశ్రమాల రక్షణ, వ్యవస్థల బాధ్యతకూడ గృహస్థులకు ఉంటుంది.

కాగా – ప్రతి వ్యక్తికీ తనదైన స్వతంత్రమైన మనుగడ ఉంది. అతడి కర్మ సంస్కారాల ప్రకారమే అతడికి ఈ జీవితం లభించింది. ఈ జీవితంలోకూడ అతడు చేసే మంచి, చెడు పనుల ఫలాన్ని తానే అనుభవించవలసి ఉంటుంది. ఇతరులు ఎవరూ అందులో భాగస్వాములు కాలేరు.

కానీ – కుటుంబం దృష్టిలో, సమాజం దృష్టిలో ఏ మనిషి అయినా ప్రపంచంలో ఒంటరిగా ఉండడు; ఒంటరిగా జీవించలేడు. అతడి పుట్టుకయే తల్లితండ్రుల పురుషార్థంవల్ల జరుగుతుంది. అతడి పోషణ, విద్యా బుద్ధులు, అన్న వస్త్రాలు, వృత్తి వ్యాపారాలు – అన్నీ ఇతరులపై ఆధారపడి ఉంటాయి. వారి సహకారం లేనిదే ఏదీ సాధ్యపడదు. ప్రతి మనిషీ వారికి ఋణపడి ఉంటాడు. ఆ ఋణాన్ని తీర్చుకోవడానికి సాధ్యమైనంతవరకు కృషి చేయడం అతడి కర్తవ్యం.

మనిషికి సంక్రమించిన ఋణాలు ముఖ్యంగా మూడు – దేవ ఋణం, పితృ ఋణం, ఆచార్య ఋణం. ఈ ఋణాలను గురించి ప్రతి మనిషీ పూర్తిగా తెలుసుకోవాలి.

### దేవ ఋణం నుండి విముక్తి

పరమపిత పరమాత్మయొక్క అపరిమిత కృపవల్ల మనకీ మానవ జన్మ లభించింది. మనం జీవితంలో నిరంతరంగా ప్రగతి సాధించడం కోసమై భగవంతుడు మనకు నలువైపులా మంచి చెడు పరిస్థితులను నిర్మాణం చేశాడు. పురుషార్థానికీ, ప్రాయశ్చిత్తానికీ ఎన్నెన్నో అవకాశాల తలుపులను ఆయన మనముందు తెరచి ఉంచాడు. మనం చేయవలసినది ఇంతే: మనం నిద్రావస్థనుండి మేలుకోవాలి. పురోగమించడానికి సంకల్పశక్తితో కృషి చేయాలి. పరమాత్మ చూపిన అనంతమైన కృపకు మనం సదా కృతజ్ఞులముగా ఉండాలి. ఆస్తికులముగా ఉండాలి. సదా ఆయనను స్మరించాలి. "సర్వే భవంతు సుఖినః" (సర్వ జీవులూ సుఖించాలి) అనే ఆయన నిర్ణయించిన మానవ ధర్మాన్ని పాటించాలి. భూగోళపు, పర్యావరణపు రక్షణ కోసం, పవిత్రత కోసం, ఉన్నతి కోసం క్రియాశీలంగా సహకారం అందించాలి. ఈ విధంగా మనం దేవ ఋణంనుండి విముక్తి పొందగలుగుతాము.

### పితృఋణంనుండి విముక్తి

తల్లిదండ్రుల కృపవల్లనే మనకు ఈ మానవ జన్మ లభించింది. మాతృ గర్భంలోనే వారు మనకు తగు పోషణ అందించారు. జన్మించిన తర్వాత వారు మనల్ని పెంచి పోషించారు. మనల్ని అన్ని విధాలా రక్షించారు. మన పోషణలో ఏ కొంచం ఉపేక్ష జరిగినా, మనం జీవించి ఉండకపోయే వాళ్లమేమో. ఇదంతా చేయడానికి తల్లి – తండ్రులు ఎన్నెన్ని కష్టాలు పడ్డారో మనం ఊహించలేము. మన చదువు సంధ్యలలో, వ్యాపార ఉద్యోగాలలో, బహుముఖ ప్రగతిలో వారు తమ ప్రతిభ మొత్తాన్ని, శక్తి సామర్థ్యాలు మొత్తాన్ని సమర్పణ చేశారు. తాము స్వయంగా ఎన్నెన్నో కష్ట నష్టాలను సహించి, మన సుఖ సమృద్ధుల కోసం సదా కృషి చేశారు. వారి ఋణంనుండి విముక్తి పొందడం ఈ జీవితంలో సాధ్యం కానేకాదు. మనం ఇంతవరకే చేయగలుగుతాం – వారిని గౌరవించాలి; వారిపట్ల సదా ప్రేమాదరాలు చూపాలి; వృద్ధాప్యంలో వారు అశక్తులుగా, నిస్సహాయులుగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధతో, తను మన ధనములతో వారికి సేవ చేయాలి.

### ఋషి ఋణంనుండి విముక్తి

ప్రపంచంలో మనం ఇంతవాళ్లం అయ్యామంటే, ఇకముందుకూడ ప్రగతి సాధిస్తామంటే – దాని అంతటిలో సమాజ

**ఆధ్యాత్మిక విద్య అంటే మనిషి అహంకార రహితుడు కావడం** – రమణ మహర్షి

సహకారం మనకు అడుగడుగునా అందుతూ ఉంటుంది. మనకు మార్గదర్శనం చేయడం కోసం మన ఋషులూ, మనీషులూ, సమాజనేతలూ లెక్కలేనన్ని గ్రంథాలు రచించారు. వారి స్వాధ్యాయం వల్లనే, వారి పరిశోధనవల్లనే మనం నేడు అన్నివిధాలా ప్రగతి పొందగలుగుతున్నాం. గురువులనుండీ, అధ్యాపకుల నుండీ మాత్రమే కాక – సమాజంలోని ప్రతి వ్యక్తినుండీ మనం అనుక్షణం ఎంతో కొంత నేర్చుకుంటున్నాం. అందరూ ఏదో ఒక రూపంలో మనకు ఉపకారాలు చేస్తున్నారు. ఇదే ఋషి ఋణం. సమాజ సేవద్వారా, పరమార్థం ద్వారా, సదాచారం ద్వారా మాత్రమే మనం ఈ ఉపకారానికి ప్రత్యుపకారం చేయగలుగుతాము. సమాజంలోని అందరి కళ్యాణానికి సాధనాలుగా మారే విధంగా మనం మన ప్రతిభనూ, శక్తి సామర్థ్యాలనూ సదా వినియోగించాలి. మనవల్ల ఎవ్వరికీ ఎన్నడూ హాని జరగకూడదు. స్వయంగా కష్టపడుతూ ఆనందంగా సమాజ సేవ చేయడంద్వారానే మనం ఈ ఋణం నుండి విముక్తి పొందగలుగుతాము.

## వృద్ధుల ఆశీస్సులు శుభప్రదాలు

ఈ విధంగా – ప్రపంచంలోని ప్రతి వ్యక్తిమీదా భగవంతుని ఋణం, తల్లి దండ్రుల ఋణం, సమాజ ఋణం ఉన్నాయి. వాటిని తీర్చుకోవడంలో ప్రతి వ్యక్తీ అనుక్షణం నిమగ్నం కావాలి. కుటుంబంలోని తల్లిదండ్రులనూ, ఇతర వృద్ధులనూ అందరినీ పరిపూర్ణమైన శ్రద్ధాభావంతో తగువిధంగా సేవించడం మన పరమ పవిత్ర కర్తవ్యంగా మనం భావించాలి. ఈ సేవ ఫలితంగా వారినుండి లభించే శుభాశీస్సులు దేవుడు ఇచ్చే గొప్పవరాల కన్న ఉన్నత స్థాయికి చెందినవి. అవి మనను అన్నివిధాలా శుభాన్ని అందిస్తాయి.

## భోగవాదపు దుష్ప్రభావం

పాశ్చాత్య సంస్కృతి దుష్ప్రభావంవల్ల, భోగవాద సిద్ధాంతపు దుష్ప్రభావంవల్ల నేటి మన సమాజం తన ఉన్నత భావాలకు దూరం అవుతోంది. స్వార్థంలో, అహంకారంలో మునిగిఉన్న వ్యక్తి రకరకాల దుర్ వ్యసనాల విషవలయంలో చిక్కుకుపోతున్నాడు. ఈ స్థితిలో ఉమ్మడి కుటుంబ సంప్రదాయం పూర్తిగా దెబ్బతింటోంది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం కావడమే వృద్ధుల సమస్యలకు మూల కారణం. పరస్పర ఆత్మీయత, కుటుంబ భావన లోపించడంతో, వ్యక్తి స్వకేంద్రితుడు అవుతున్నాడు, తనను గురించి ఆలోచిస్తున్నాడు. తన స్వార్థం గురించీ, తన సుఖ సాధనాలను గురించీ మాత్రమే శ్రద్ధ తీసుకుంటున్నాడు. అతడి దృష్టిలో మిగిలినవన్నీ పనికిమాలినవి, సమయాన్నీ డబ్బునూ వృథా చేసేవి. కనుకనే అతడు వృద్ధులైన తల్లి దండ్రులను బరువుగా పరిగణిస్తున్నాడు. వారిని ఉపేక్షిస్తున్నాడు, వేధిస్తున్నాడు. వారి కష్టాలను తొలగించడానికి బదులు, వాటిని పెంచుతున్నాడు. గత 50 – 60 సంవత్సరాలుగా ఈ పరిస్థితి రోజు రోజుకూ మరింతగా దిగజారిపోతోంది.

## తరాల అంతరం అన్నది భ్రమ

ఇటీవల కొద్ది సంవత్సరాలుగా 'తరాల అంతరం' అనే ఒక కొత్త ఆలోచన జనంలో ప్రవేశించింది. యువజనులు వృద్ధులను ఛాందసవాదులుగా తిరోగమనవాదులుగా పరిగణించి, వారిని ఉపేక్షిస్తున్నారు. తమను ప్రగతిశీలురుగా భావించుకుంటున్నారు. ఇందుకు తరాల అంతరం కారణమని పదేపదే వాదిస్తున్నారు.

మరి వాస్తవం ఏమిటి? ఒకే వయస్సు గల వారిలో, ఒకే స్థాయి గల వారిలో కూడ తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఉంటున్నాయి. సోదరులమధ్య పొరపొచ్చాలు ఉంటున్నాయి. భార్యా భర్తల మధ్య వివాదాలు వస్తున్నాయి. ఆప్తమిత్రులు సైతం ఆలోచనలలో వైరుధ్యం ఏర్పడి శత్రువులుగా మారుతున్నారు. మరి ఇది ఎలాంటి తరాల అంతరం? తాము మరింత తెలివిగలవాళ్లమని అనుకోవడం, అహంకారానికి దాసులై ఇతరులు చెప్పే మంచి విషయాలను సైతం అవహేళన చేయడం, తమ ఆలోచనలను బలవంతాన ఇతరులమీద రుద్దాలనే కోరిక – వీటివల్లనే ఇలా జరుగుతోంది. తాము చేసే ఈ చెడ్డ పనిని న్యాయబద్ధమని నిరూపించడానికే జనం తరాల అంతరం అనే ఆయుధాన్ని వాడుతున్నారు. వాస్తవానికి – తరాల అంతరం అన్నది ఒక భ్రమ మాత్రమే.

జనం ఒకరి ఆలోచనలను మరొకరు శ్రద్ధగా విన్నప్పుడు, ఎదుటి వ్యక్తి ఆలోచనలకు తగు గౌరవం ఇచ్చినప్పుడు, అవసరాన్ని

**సత్యం, శీలం, పవిత్రత, ఏకత్వం కలిస్తే దైవత్వం.**

బట్టి నచ్చజెప్పి అనునయించి ఆ ఆలోచనలలో తగు సవరణలు సూచించినప్పుడు – ఇలాంటి సమస్యలు ఏర్పడవు. అహంకారాన్ని వదులుకున్నప్పుడు, ఒకరికి ఒకరు నచ్చజెప్పడానికి ప్రయత్నించినపుడు – ఇద్దరిమధ్యా సామరస్యం నిలచి ఉంటుంది. చిన్న పిల్లలకు అహంకారం ఉండదు. కనుక, పెద్దవాళ్లుకూడ వారిముందు తమ అహంకారాన్ని ప్రదర్శించరు. కనుకనే, చిన్నపిల్లలు తమ తాతలతో, నాయనమ్మలతో అరమరికలు లేకుండా హాయిగా కబుర్లు చెపుతారు; ఆనందంగా ఉంటారు. అహంకారాల ఘర్షణయే వాస్తవానికి తరాల అంతరం. ఈ అహంభావాన్ని వదులుకుని మనం వృద్ధులను గౌరవించే స్వభావాన్ని అలవరచుకోవాలి.

ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యం నిలచి ఉన్నంత వరకు, మన సమాజంలో ఇలాంటి సమస్య ఏదీ ఏర్పడలేదు. పరస్పర స్నేహంతో, సహకారంతో కుటుంబంలోని వృద్ధులను, బలహీన వ్యక్తులను గౌరవించేవారు, ఆదరించేవారు. ఒకే గృహంలో, మూడు నాలుగు తరాలవారు సుఖంగా, ఆనందంగా జీవించేవారు. అన్ని రకాల కష్ట నష్టాలనూ, కొరతలనూ నవ్వుతూ భరించేవారు. పరస్పరం సహకరించుకోవడంలో ప్రతి వ్యక్తీ గర్వపడేవాడు, అది భగవానుని పూజగా పరిగణించేవాడు.

ఈ కుటుంబ భావన ప్రాముఖ్యాన్ని గుర్తించి దానిని పునరుద్ధరించే బాధ్యత నేటి యువతరంపై ఉన్నది. కుటుంబం నుండి వేరుపడి వారు గడుపుతూన్న ఏకాకి జీవితంలో, స్వార్థ జీవితంలో తాత్కాలిక ప్రయోజనం కొంత కనబడవచ్చు. కానీ, వాస్తవానికి దానివల్ల నష్టమే హెచ్చు. యువజనులు ఈ సత్యాన్ని గుర్తించాలి. ఆ తర్వాత పరిస్థితి చేయిదాటిపోయినప్పుడు – ఇక పశ్చాత్తాపమే మిగులుతుంది.

మన మహర్షులు విశ్వ బంధుత్వ భావనను వ్యాప్తి చేశారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమనీ, ప్రతి జీవీ ఆ కుటుంబంలోని ఒక సభ్యుడనీ బోధించారు. కానీ, నేడా భావనలు లోపించిపోయాయి. వాటి స్థానంలో ప్రతి విషయాన్నీ డబ్బుతో తూచే అలవాటు పెరిగిపోయింది. ప్రతి వస్తువూ అమ్మకానికి ఉన్నదే – చివరికి తన శీలంకూడ. దేశ భక్తి, సమాజ ప్రగతి, కుటుంబ ప్రాధాన్యం – ఇవన్నీ డబ్బుముందు కొరకాకుండా పోతున్నాయి. విశ్వాన్ని కుటుంబంగా పరిగణించే సంప్రదాయం పోయి, విశ్వం ఒక మార్కెట్ అయిపోయింది.

యువజనులు తమతోనే ఈ పునరుద్ధరణ కార్యాన్ని ప్రారంభించాలి. తమ కుటుంబంలో కుటుంబం భావనను పెంపొందించేందుకు కృషి చేయాలి. పరస్పర విశ్వాసానికీ, సహకారానికీ అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబంలోని వృద్ధులైన తల్లి దండ్రులకూ, నిస్సహాయులైన ఇతర వ్యక్తులకూ సముచిత గౌరవం ఇవ్వాలి, సముచిత సహకారం అందించాలి. వారిపట్ల ఆత్మీయంగా వ్యవహరించాలి. ఇలా తమ గృహంలోనే స్వర్గాన్ని నిర్మాణం చేయాలి.

మీ ఇరుగు పొరుగున, మీ పేటలో, మీ గ్రామంలో ఉన్న ఇలాంటి వృద్ధులను, బలహీనులను మీరు ఆదుకోవాలి. కొంత సమయాన్ని మిగుల్చుకుని వారితో కబుర్లు చెప్పాలి, వారిని నవ్వించాలి. వారి కష్ట సుఖాలు తెలుసుకోవాలి. మీరు వారిని మీ కుటుంబంలోని సభ్యులుగా పరిగణిస్తున్నారనే అనుభూతిని వారిలో కలిగించాలి.

మీవంటి సమర్థుల సహకారంతో సమాజంలో వృద్ధుల శ్రేయస్సుకు కార్యక్రమాలను ప్రారంభించండి. వారి శారీరిక, మానసిక, ఆర్థిక సమస్యలను వాటిద్వారా పరిష్కరించండి. నేడు సమర్థులైన పలువురు వ్యక్తులు ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం తన ఊళ్ళు వదలి ఇతర ఊళ్లలో ఉండవలసివస్తోంది. ఇంటిలో ఉండి వృద్ధులైన తల్లి దండ్రులకు సేవ చేయాలనే కోరిక ఉన్నప్పటికీ, వారా పని చేయలేకపోతున్నారు. ఈ లోపాన్ని పూరించడానికై – వారు తాము ఉన్న ఊళ్లో ఇరుగు పొరుగున ఉన్న వృద్ధులను తమ తల్లిదండ్రులవలె పరిగణించి, వారికి గౌరవం, సహకారం అందించి, వారి ఆశీస్సులు పొందవచ్చు.

మీరు మీ ప్రతిభనూ, శక్తి సామర్థ్యాలనూ వృద్ధుల హితంకోసం తప్పక వినియోగించండి. మీ సంపాదనలో కొంత భాగాన్ని ఇందుకోసం నియమబద్ధంగా సమర్పిస్తూ ఉండండి. ఈ విధంగా మీరు మీ పిల్లలకు ఒక ఆదర్శాన్ని అందించగలుగుతారు. అది భవిష్యత్తులో మీకు ప్రయోజనకారి అవుతుంది.

★★★

**నిగ్రహం కోసమే విగ్రహం – జిల్లెళ్లమూడి అమ్మ.**


# ధారావాహిక : దివ్యజీవన దర్శనం-31

# స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతి-3

## పారబ్ధాన్ని అతిక్రమించిన సంఘటన

జపం పూర్తికాకపోతే ఆందోళన చెందవద్దని ఒక రోజున మార్గదర్శక సత్తానుండి ఆదేశం లభించింది. తన కర్మను, స్వాతంత్ర్య యజ్ఞంలో ఆహుతిని కూడ, అనుష్ఠానంగా పరిగణించవలసిందని ఆయన ఆదేశించారు. అయినా, శ్రీరామ్ నిర్ణీత సమయంలో సంధ్యకూ, వాంఛిత సంఖ్యలో జప - ధ్యానములకూ తగినంత సమయాన్ని కేటాయించేవారు. ఎప్పుడైనా కొంత మిగిలిపోతే మిగిలిపోయేది.

జరార్‌నుండి తిరిగివచ్చేటప్పుడు సాయంకాల జపం పూర్తికాలేదు. మిగిలిపోయిన జపానికి మరునాటి ఉదయం తగు సమయాన్ని కేటాయించారు. ఉదయం ఎనిమిది గంటలు అయింది. జపం పూర్తయిన తర్వాత నివేదన జరగవలసి ఉంది. సమర్పణ పాఠాన్ని ఇలా ఉచ్చరించారు - **ఇతి సంధ్యోపాసనాఖ్యేన కర్మణాం శ్రీపరమేశ్వరః ప్రీయతాం న మమ । శ్రీ పరమేశ్వరః ప్రీయతాం న మమ ।।** అలా పఠించగానే, అంతస్సులో ఒక బోధ మేలుకొన్నది - తన ఆత్మచేతనయే చెపుతూన్నట్లు: జపం, తపం పరమేశ్వరుని ప్రీతి కోసం అయినప్పుడు, ప్రారబ్ధాన్ని క్షయం చేయడానికి దాన్ని ఎందుకు వినియోగించాలి?



నిన్న దొనోరియాజీ వద్ద కూర్చొని చేసిన ప్రార్థన, ధ్యాన - ధారణలకు సంబంధించిన ప్రశ్న అది.

ఆ క్షణంలోనే సమాధానం వచ్చింది -

ప్రారబ్ధాన్ని క్షయం చేయడానికి కాక, రాష్ట్ర యజ్ఞంలో ఆహుతులు ఇచ్చే వ్యక్తుల యోగ క్షేమం కోసం అది జరిగిందని.

మళ్లీ ప్రశ్న వచ్చింది -

ఏది ఏమయినా - నీ సాధనను లౌకిక ప్రయోజనాల కోసం వినియోగించకూడదు. పరమేశ్వరుడు నిర్మించిన కర్మఫల విధానంలో జోక్యం కలిగించుకోవడమే అవుతుంది ఇది. నీ తపస్సుకూడ తగ్గిపోతుంది.

ఈ ప్రశ్నదే పైచేయి అయింది. మీమాంస కొద్దిగా పెరిగింది. ఎదురుగా ప్రతిష్ఠితమైన గాయత్రీమాత వెలుగును పరికించారు. కొంతసేపు ఏకాగ్రతతో అలా పరికిస్తూ ఉండిపోయారు.

ఆ విగ్రహంలో చిరునవ్వులాంటిది కనిపించింది. పెదిమలు కదులుతూన్నట్లు తోచింది. అస్పష్టమైన ధ్వని వస్తోంది. కానీ, చెపుతూన్నది ఏమిటో స్పష్టం కావడం లేదు. ఆ ఉద్బోధ ఇది -

**ప్రారబ్ధాన్ని అతిక్రమించడానికే సాధకుడు సాధన చేస్తాడు.** చివరికి అందరూ పరమాత్మలో లీనం కావలసిందే. దాన్ని సహజ రీతిలో జరగనిస్తే - ఎవరికీ సాధన చేసే అవసరమే ఉండదు. కానీ, ప్రకృతిపై విజయాన్ని పొందాలి. ప్రకృతి నిర్మించిన బంధనాల నుండి విముక్తి పొందాలి, మన పురుషార్థంద్వారా విముక్తి పొందాలి.

సమాధానం లభించింది.

నివేదన పూర్తయిన వెంటనే శ్రీరామ్ తిరిగి ప్రార్థన చేశారు - మాతా! దొనోరియాజీకి ఆరోగ్యం ప్రసాదించు; ఆయనకు జీవితాన్నీ, శక్తినీ ప్రసాదించు.

ప్రార్థన పూర్తయింది. ఆ ప్రార్థన గాయత్రీ మాతకు వినిపించిందనే విశ్వాసంకూడ ఏర్పడింది.

మూడు నాలుగు రోజుల తర్వాత - శ్రీ దొనోరియా యోగక్షేమాలు తెలుసుకోవడానికై తన మిత్రులతోపాటు జరార్‌కు వెళ్లాలని శ్రీరామ్ ఆలోచించసాగారు. సహచరుల గోష్ఠిలో ఈ ఆలోచన జరిగింది. సూరజ్ పాల్ ఆగడాలను అంతంచేయడానికి వ్యూహరచనకూడ ఆ గోష్ఠిలో జరిగింది. ఆ వ్యూహం ప్రకారం - దొనోరియాజీనే అందుకు అగ్రగామిని చేయాలి. ఆ గ్రామంలో

**నావద్ద నాకు కావలసిందితప్ప మరేదీ లేదు. నేను ఎవరికి ఎందుకు భయపడాలి? -** బసవేశ్వరుడు.

నివసించే వ్యక్తి ప్రతిఘటిస్తే విజయం మరింత నిశ్చితం అవుతుంది.

శ్రీరామ్ వారి ఇంటికి వెళ్లి చూచారు. ఆయన పరిస్థితిలో పూర్తి మార్పు రాలేదు. అయితే, అది పూర్వంకన్న మెరుగయింది. దొనోరియాజీకి స్పృహ వచ్చింది. శ్రీరామ్ బృందం వారి ఇంటికి వెళ్లినప్పుడు ఆయన నిద్రపోతున్నారు. ఇంటిలోనివారిని ఆయన పరిస్థితి గురించి అడిగి, శ్రీరామ్ వైద్యుని వద్దకు వెళ్లారు. ఆయనను అడిగారు. ఆయన ఇలా అన్నారు–

"భగవంతుడు కరుణించాడు. ఇన్ని రోజులు కోమాలో ఉన్న తర్వాత ఆశ కొద్దిగానే ఉంటుంది."

శ్రీరామ్ ఆయనను ఇలా అడిగారు –

"దొనోరియాజీ తలమీద చాలా దెబ్బలు తగిలాయి. ఆ గాయాలు మానడానికి ఎన్ని రోజులు పడుతుంది?"

వైద్యుడు ఇలా జవాబిచ్చాడు –

"8–10 రోజులు పట్టవచ్చు. మొదట్లో ఎలాంటి ఆశా లేకపోయింది. స్పృహ తిరిగివచ్చింది కనుక, ఈ విషయం అంచనా వేయగలుగుతాము."

వైద్యునివద్ద కొద్ది సమయం గడిపి, శ్రీరామ్ విప్లవవాది అయిన తన మిత్రుని వద్దకు వచ్చారు. ఆయన నిద్రలేచారు. స్పృహ వచ్చిన తర్వాత రోజులో చాలాసార్లు నిద్ర వస్తోంది. ఆయన శ్రీరామ్‌ను చూచారు. చూడగానే గుర్తుపట్టారు. ప్రణామం చేయాలని లేవబోయారు. పడుకుని ఉండవలసిందిగా శ్రీరామ్ ఆయనకు చెప్పారు.

శ్రీరామ్ ఆయనతో ఇలా చెప్పారు –

"భారతమాతకు మీ అవసరం ఉంది. ఆమె ఆశీస్సు మీకు జీవితాన్నీ, ఆరోగ్యాన్నీ ఇస్తోంది."

### అత్యాచార రాజ్యంతో పోరాటం

ఆ మాట విని దొనోరియాజీ చిరునవ్వు నవ్వారు. ఆయన నోటినుండి గంభీర ప్రకటన ఇలా వెలువడింది –

"త్వరగా కోలుకోవాలి. ఎందుకంటే – మా గ్రామంలోని అత్యాచార రాజ్యాన్ని అంతం చేయాలి."

సూరజ్ పాల్ నడుపుతూన్న అత్యాచార రాజ్యం ప్రస్తావన అది. సంభాషణ చాలాసేపు సాగింది. సంయుక్త పరగణాలలో, ఇతర ప్రాంతాలలో, సంస్థానాలలో జరుగుతూన్న ఉద్యమాల పరిస్థితిపై చర్చ అందులో హెచ్చుగా ఉంది. మాటల మధ్య – జరార్ జాగీర్దారును ఓడించే విషయం కూడ ప్రస్తావనకు వచ్చింది. శ్రీరామ్ ఇలా సూచించారు – "పది పన్నెండు రోజులలో మీ ఆరోగ్యం కుదుటబడితే, మీరు సూరజ్ పాల్ భవంతి ఎదుట కూర్చోండి; మీతోపాటు ఇతరులుకూడ కూర్చుంటారు; వచ్చేపోయేవాళ్లకు మీమీద జరిగిన అత్యాచారం గురించి చెప్పండి."

దొనోరియాజీ ఉత్సుకత కనబరచారు. "పది పన్నెండు రోజుల తర్వాత ఎందుకు? ఆ పని ఇప్పుడే ఎందుకు చేయకూడదు?"– అని ప్రశ్నించారు.

ఆయనలోని ఉత్సాహం చూచి గోపీనాథ్ ఇలా అన్నాడు–

"ఆరోగ్యం మరీ చెడిపోకపోతే, ఇప్పుడూ కూర్చొనవచ్చు. గాయాలు ఇంకా అలాగే ఉన్నాయి. వీటిని చూస్తే జనం బాగా ప్రభావితులు అవుతారు."

గోపీనాథ్ చెప్పిన ఈ ఆలోచన అందరికీ నచ్చింది. అయినా – మూడు నాలుగు రోజులు ఆగడం అవసరమని అంతా భావించారు. ఆ భవంతి బయట జేష్ఠమాసపు ఎండలో గుడారం వేయడం ప్రమాదరహితం కాదు. ఏమైనా – ధర్నాకు సన్నాహాలు చేయడానికి మూడు నాలుగు రోజుల సమయం అవసరం.

ప్రజలకు సమస్యను వివరించడానికీ, పోస్టర్లు తయారుచేయడానికీ మూడు నాలుగు రోజులు పట్టింది. శ్రీరామ్ ఈ వ్యవస్థ అగ్రభాగాన ఉన్నారు. సూరజ్ పాల్ అత్యాచారాలను వర్ణిస్తూ పెద్దపెద్ద అక్షరాలతో పోస్టరు తయారుచేశారు. ఆ ఆగడాలను అంతంచేయడం ధర్నా లక్ష్యమని ఆయన ఆ పోస్టరులో వ్రాశారు. జాగీర్దారు భవంతికి సుమారు 25 అడుగుల దూరంలో చిన్న వేదికను నిర్మించారు. దానికి అచ్ఛాదన ఏర్పరచారు. ధర్నా ప్రారంభమయ్యే రోజున రావసిందిగా ఆగ్రా నుండి శ్రీకృష్ణదత్త పాలీవాల్‌ను ఆహ్వానించారు. ఆయన రావడంతో, ఆయనతోపాటు ఇతర నాయకులు కూడ వచ్చారు. ఇలా పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొనడంతో, సూరజ్ పాల్ కంగుతిన్నాడు. గూండాలచేత ధర్నా ఎత్తివేయించడానికి ప్రయత్నిస్తే, ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతుందనే భయం పట్టుకుంది అతడికి. ఆగ్రా

**కళ్లకు రెప్పలు ఉన్నట్లు – పనికి విశ్రాంతి ఉండాలి.**

నుండి నాయకులు వచ్చారు. పాలీవాల్‌జీ వంటి ప్రాంత స్థాయి నాయకుడు కూడ వచ్చారు. కనుక, ఎలాంటి బలప్రయోగం జరిపినా, వ్యతిరేక ఫలితాలు వస్తాయని అతడు గ్రహించాడు.

ధర్నా ప్రారంభమైన తర్వాత శ్రీరామ్ వెళ్లిపోయారు. రెండు మూడు రోజుల కొకసారి పరిస్థితిని సమీక్షించడానికి వచ్చేవారు ఆయన. ధర్నా సమాచారం పత్రికలలో ప్రచురితం అవుతూవచ్చింది. ధర్నా స్థలానికి ప్రజల రాకపోకలు పెరిగాయి. సూరజ్ పాల్ దురాగతాలు అందరికీ తెలిసినవే. కానీ, గతంలో ఎవరూ దాన్ని గురించి చర్చించేవారు కారు. దొనోరియాజీ గుడారంలలోకి ఎవరెవరు వస్తున్నారో, వారు ఏమి మాట్లాడుకుంటున్నారో సూరజ్ పాల్ తన గూఢచారులద్వారా తెలుసుకుంటున్నాడు. ఇలా వచ్చే ప్రతి వార్తతో అతడి అహంకారంపై ఒక్కొక్క దెబ్బ పడుతూవచ్చింది.

పది పన్నెండు రోజులు గడిచాయి. అతడు శ్రీరామ్‌తో సంప్రదింపులు ప్రారంభించాడు. తాను స్వయంగా ముందుకురాలేదు. ఒక మధ్యవర్తిని పంపాడు. శ్రీరామ్ ఇలా జవాబు పంపించారు –

"మీరు స్వయంగా దొనోరియాజీ వద్దకు వెళ్లండి. ఆయన చెప్పే మాటలు శ్రద్ధగా వినండి. ఆయనకు సంతృప్తి కలిగేలా జవాబు చెప్పండి."

అలా చేస్తే తన పరువు పోతుందని సూరజ్ పాల్ బావించాడు. కానీ, గ్రామంలో తనపై తిరుగుబాటు వస్తుందని ఆయన భయపడ్డాడు. ప్రజల మనసులు మారుతున్నాయని తన గూఢచారులద్వారా అందుతూన్న సమాచారాన్నిబట్టి అతడికి స్పష్టమవుతోంది.

## జగీర్దారుకు కనువిప్పు

ప్రభుత్వ వర్గాలలోని తన శ్రేయోభిలాషులను అతడు సలహా అడిగాడు. దొనోరియాజీతో, ఆయన మిత్రులతో రాజీ చేసుకోవడమే విజ్ఞత అని వారు సలహా ఇచ్చారు. రాజీకీ, సంప్రదింపులకు రూపురేఖలు తయారుచేసే బాధ్యత శ్రీరామ్‌కు అప్పగించబడింది. విజయం సాధించినందుకు ఆయన దొనోరియాను అభినందించారు. ఒక చిన్న సంప్రదింపుల కార్యక్రమం ఏర్పాటుచేశారు. అదులో సూరజ్ పాల్ దొనోరియాచేత లస్సీ త్రాగించాడు. ఆయన తన కుమారుడని అన్నాడు. ఎలాంటి సహకారం కావాలన్నా నా భవంతి తలుపులు ఎప్పుడూ మీకు తెరచే ఉంటాయి – అన్నాడు.

గతంలో జరిగినదానికి సూరజ్ పాల్ క్షమార్పణ కోరలేదు. కోరతాడని ఎవరూ ఆశించలేదు. సహకారం ఇవ్వడానికి అతడు చేసిన వాగ్దానంలోనే క్షమించ మనే భావం ఇమిడి ఉంది.

ఈ సంఘటన తర్వాత జమీందారు ఆగడాలు దాదాపు అంతమైనాయి. అతడి సాయుధ గూండాల దుశ్చర్యలకూడ చాలవరకు ఆగిపోయాయి. విజయోత్సవం జరపాలని కొందరు మిత్రులు సూచించారు. శ్రీరామ్ దాన్ని ఆమోదించలేదు. విజయోత్సవం జరపడంవల్ల సూరజ్‌పాల్ అహం దెబ్బతింటుంది. అలా జరగడంలో ఔచిత్యం లేదు. ఒకరిని ఓడించటం మన లక్ష్యం కాదు. న్యాయంతో, శాంతితో కూడిన వాతావరణాన్ని ఏర్పరచడం మన లక్ష్యం. ఆ వాతావరణం ఏర్పడడం ప్రారంభమయింది. అది చాలు – ఇదీ శ్రీరామ్ వ్యక్తంచేసిన అభిప్రాయం.

గత సంవత్సరం ప్రారంభమైన సహాయనిరాకరణ ఉద్యమం ప్రభావం ఇంకా ఉంది. 1931లో 'గాంధీ – ఇర్విన్ ఒప్పందం' జరిగింది. ఆ తర్వాత ఉద్యమం దాదాపు నిలిపివేయబడింది. ప్రభుత్వంకూడ దమన చర్యలను వదులుకున్నది. ఎదురుబదురుగా కూర్చుని వ్యవహారాలను పరిష్కరించే మార్గం అవలంబించబడింది. దమన విధానపు చట్టాలు ఉపసంహరించబడ్డాయి. హింస, విధ్వంసం ఆరోపణలు ఉన్నవారిని మినహాయించి – రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేశారు. ఈ విధంగా – ఉద్యమం, అరెస్టుల వేడి తగ్గింది. అయితే – సహాయ నిరాకరణవల్ల మేలుకొన్న చైతన్యం ప్రగాఢం అవుతూ వచ్చింది.

## "సైనిక్" పత్రికకు సహకారం

ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొన్న రోజులలో "సైనిక్" పత్రిక విజృంభించింది. ఉద్యమం వార్తలు ప్రచురించే ప్రముఖ మాధ్యమం అది. గాంధీ – ఇర్విన్ ఒప్పందం తర్వాత జాతీయ భావనలపై అంకుశం ప్రయోగించబడలేదు. అయితే, ఉద్యమం మందకొడిగా సాగుతోంది. ఫలితంగా – సైనిక్ పత్రిక కూడ కొంత మందగించింది. పాలకుల కోపానికి గురి

ప్రశాంత చిత్రమే ప్రేమకు నెలవు.

అవుతామేమో అనే భయంతో కొందరు కార్యకర్తలు పత్రికను వదిలివేశారు. ఈ భయం నిరాధారమైనదే. అయినా, సంశయగ్రస్తులైన నలుగురైదుగురు పత్రిక వదిలి వెళ్లిపోయారు. వార్తలలో తీవ్రత, సంచలనం తగ్గడంతో, పత్రిక ప్రసారం కూడ కొద్దిగా తగ్గింది.

ఈ పరిస్థితులలో పాలీవాల్‌జీ శ్రీరామ్‌తో ఇలా అన్నారు – "వీలుంటే మీరుకూడ కొద్ది సహకారం అందించండి." ఎలాంటి సహకారం కావాలో అడగడం శ్రీరామ్‌కు అవసరం అనిపించలేదు. ఆయన 'సరే' అన్నారు. శ్రీరామ్‌ను సంపాదకీయ విభాగంలో నియమించారు. నియామక పత్రాలు, వేతనాదుల నిర్ణయం ఆనాటి పరిపాటి కాదు. కుటుంబంలోని అతిథులుగానో బంధువులుగానో సంస్థలలో వ్యక్తులను చేర్చుకునేవారు.

శ్రీరామ్‌కూడ ''సైనిక్'' కుటుంబంలో సభ్యులు అయినారు.

## ఆగ్రాలో నివాసం

ఆవల్‌ఖేడానుండి ప్రతిరోజూ వచ్చివెళ్లాలని మొదట్లో ఆలోచించారు. కొద్దిరోజులు అలా జరిగింది కూడా. అయితే, ఆ తర్వాత ఆగ్రాలోనే బసచేయడం అవసరం అయింది. ఇందుకు తాఈజీ అనుమతి లభించడం లేదు. కనుక, ఆగ్రాకు రోజూ వచ్చే క్రమాన్ని కొద్దిసమయం నిలిపివేశారు. వ్యాసాలు, శాశ్వత ప్రాముఖ్యం కలిగిన వార్తలు, ఫీచర్లు మున్నగువాటిని ఆవల్‌ఖేడాలోనే ఉండి తయారుచేసేవారు. మూడవరోజునో, నాల్గవ రోజునో ఆగ్రా వచ్చి వాటిని ఇచ్చేవారు. అంతకుముందు ఇచ్చిన 'మేటర్' ప్రూఫ్‌లు అక్కడే కూర్చుని దిద్దేవారు. ఇంటికి తిరిగివచ్చేవారు. శ్రీరామ్ ఇలా వెళ్లివస్తూ ఉండడం, ఆగ్రాలో ఉద్యమాదులలో తీరికనేది లేకుండా పాల్గొంటూ ఉండడం – ఇదంతా తాఈజీ గమనిస్తున్నారు. వారానికి రెండు మారులు ఆయన ఆగ్రా తప్పకుండా వెళ్లివస్తున్నారు. ఆగ్రాకు మరికొన్ని మారులు వెళ్లవలసిన వచ్చేది కూడా. ఇలా ఆయన తీరికనేది లేకుండా పనిలో నిమగ్నం కావడం చూచి, తాఈజీ ఒక రోజున ఆయనను తనవద్ద కూర్చోబెట్టుకున్నారు. ఆయన నుదురు చేతితో నిమురుతూ ఇలా అడిగారు –

"బాగా చిక్కిపోయావు. తిండి సయించడం లేదా?"

"అలాంటిదేమీ లేదు. కడుపునిండా తింటున్నాను. రోజంతా పని చేస్తున్నాను. చిక్కిపోతే, ఈ పనంతా ఎలా చేయగలుగుతాను?"

– అని శ్రీరామ్ జవాబిచ్చారు. తాఈజీ ఈ జవాబును ఏమాత్రం పట్టించుకోలేదు. ఆమె ముందుగానే తన మనసులో ఏదో ఏర్పాటు నిర్ణయించుకుని కూర్చున్నారు. శ్రీరామ్ స్పష్టీకరణను వినకుండా ఆమె ఇలా అన్నారు –

"వెళ్లి రావడంలో చాలా ఇబ్బంది కలుగుతోందికదూ. నన్ను నేను నచ్చజెప్పుకుంటాను. పాలీవాల్‌జీతో పాటే ఉండు."

"అలాగే".

– అని శ్రీరామ్ అన్నారు. తాఈజీ తన కన్నీరు తుడుచుకున్నారు. "ఆయన ఇక్కడికి వచ్చినప్పుడు చూచాను. చాలా మంచి వ్యక్తి. ఆయనకు చేయూత ఇవ్వు." కొంచం ఆగి ఆమె ఇలా అన్నారు –

"మధ్య మధ్యలో ఇక్కడికి వస్తూ ఉండు. వారంలో ఒక రోజు ఇక్కడ తప్పక ఉండాలి."

ఈ నిర్దేశం ఇచ్చిన తర్వాత ఆమె భవంతిలోని గుమాస్తాగారితో ఆగ్రాలో ఏర్పాట్లు చూడమని చెప్పారు. ఏర్పాట్లు ఏమి చేయాలి? తనతోపాటుగా ఉండవలసిందని పాలీవాల్‌జీ ప్రతిపాదించారు. అయినా – స్వంతంగా బస ఏర్పాటు చేసుకోవడమే మంచిదని తాఈజీ అభిప్రాయం.

ఆగ్రాలో నివసించడం ప్రారంభించిన తర్వాత, శ్రీరామ్ ఆవల్‌ఖేడాలోని కార్యక్రమాల నాయకత్వాన్ని గోపీనాథ్‌కు అప్పగించారు. ఏ విషయంలో అయినా సలహా కావలసివస్తే – అతడు "సైనిక్" పత్రిక కార్యాలయానికి రావచ్చు, లేదా తననే ఆవల్‌ఖేడా పిలిపించుకుని మాట్లాడవచ్చు. అదీ ఏర్పాటు. శ్రీరామ్ లేఖని ఇప్పుడు పాత్రికేయ మార్గం పట్టింది. ఆయన చదవడంలో, వ్రాయడంలో ఏకాగ్రతతో నిమగ్నం అయినారు. "సైనిక్" అప్పుడు పత్రిక కార్యాలయం మాత్రమే కాదు; స్వరాజ్య సమర సేనానులకు ఆశ్రయ స్థలం కూడా. అక్కడ ఆ సేనానులు సమావేశాలు జరుపుతారు; వ్యూహరచన చేస్తారు; రాత్రి బాగా పొద్దుపోతే అక్కడే నిద్రపోతారుకూడా.

★★★

**ఆశ, భయం విడదీయరానివి.**

వార్తలు

# విజయవాడలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

మే 7న విజయవాడలో కనకదుర్గమ్మ వారధి దగ్గర పంచకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీ ఎమ్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యం వహించారు.

విజయవాడలో మే నెలలో జరిగిన ఇతర యజ్ఞాలు; 4న సవితా ఫార్మావద్ద; 8న శ్రీ ఎమ్.రామారావు గృహంలో; 10న శ్రీ పి.ఎస్.ఆర్.ఎస్.స్వరూప్ గృహంలో; 13న శ్రీ కోగంటి సాంబశివరావు గృహంలో; 14న శ్రీ కె.శ్రీనివాసరావు గృహంలో; 17న డా॥శ్రీనివాసరావు గృహంలో; 18న శ్రీ ఎమ్. మస్తాన్‌రావు గృహంలో; 23న శ్రీ వి.నగేశ్ గృహంలో; 24న శ్రీ ఎమ్.గురునాథరావు గృహంలో; 27న శ్రీ టి.ప్రసాద్ గృహంలో; 28న శ్రీ కె.రామమోహనరావు గృహంలో.

## భీమిలిలో సత్యనారాయణ వ్రతం, గాయత్రీ యజ్ఞం

మే 3న భీమిలిలో శ్రీలక్ష్మీ గణపతి నూతన గృహప్రవేశం సందర్భంగా శ్రీసత్యనారాయణ వ్రతం, గాయత్రీ యజ్ఞం జరిగాయి. అవతారం రాజు దంపతులు, రామాకుమారి దంపతులు, రాజ్యలక్ష్మి దంపతులు, శ్రీమతులు రూపవాణి, దంతులూరి పద్మావతీ రాజు, శాంతికుంజ్ ప్రతినిధి శ్రీకృష్ణకాంత్ టికారియా, శ్రీ బి.బి.రాయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విశాఖ పట్నంలో యజ్ఞోపవీత సంస్కారం

విశాఖపట్నం గాజువాకలోని గాయత్రీ చేతనా కేంద్రంలో మే 7న చిరంజీవులు విజయకుమార్, చిరంజీవిలకు యజ్ఞోపవీత సంస్కారం జరిగింది. శ్రీయుతులు కృష్ణకాంత టికారియా, పి.వి.పండా సంస్కారాన్ని నిర్వహించారు. శ్రీమతి సావిత్రమ్మ ప్రసంగించారు. నరసింహ మహాపాత్రో దంపతులు, శ్రీమతి ఊర్మిళా దేవి కార్యక్రమానికి సహకారం అందించారు. శ్రీయుతులు రఘురామ పండా, పాండవ మహాపాత్రోలతో సహా 50 మంది పాల్గొన్నారు.

మే 12న విశాఖ ఎన్.ఎ.డి సమీపంలోని సాకేతపురంలో శ్రీబుద్దరాజు బుచ్చి అప్పలరాజు గృహంలో, మే 21న విజయనగరం దాసన్నపేటలోని శ్రీమతి పద్మావతిరాజు గృహంలో, మే 22న విశాఖజిల్లా రెడ్డిపల్లిలో గాయత్రీ యజ్ఞాలు జరిగాయి.

## పార్వతీ పురంలో వసంత నవరాత్రి అనుష్ఠానం

పార్వతీపురంలో వసంత నవరాత్రి సందర్భంగా 18మంది సాధకులు 9లక్షల 60వేల గాయత్రీ జపం చేశారు. శ్రీ పి. వసుంధరా దేవి ఆధ్వర్యంలో శ్రీయుతులు సుదర్శన బ్రహ్మ అగ్నిహోత్రి, సంతోషబ్రహ్మ అగ్నిహోత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు.

★★★

## అనువాదకులకు ఆహ్వానం

పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు రచించిన హిందీ గ్రంథములను తెలుగు చేయడానికి అనువాదకులను ఆహ్వానిస్తున్నాం. అనువాదం సరళ వ్యావహారిక భాషలో ఉండాలి. అనువాదకులు తమ అర్హతలను, అనుభవాన్నీ తెలుపుతూ దిగువ చిరునామాకు లేఖలు వ్రాయగలరు.

**శ్రీ అశ్విని సుబ్బారావు**
గాయత్రీ చేతనా మరియు ధ్యాన కేంద్రం,
అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్డు, మూసాపేట,
హైదరాబాదు – 500018, ఫోన్ : 9848043256

## జులై, ఆగస్టు నెలలలో పర్వదినాలు

**జులై :**

1. కూర్మ షష్ఠి
7. తొలి ఏకాదశి
11. వ్యాస పూర్ణిమ, గురు పూర్ణిమ
17. దక్షిణాయన పుణ్యకాలం
30. నాగపంచమి

**ఆగస్టు :**

1. తులసీదాసు జయంతి
4. వరలక్ష్మీవ్రతం
9. రక్షాబంధన్
15. స్వాతంత్ర్య దినోత్సవం
    అరవింద జయంతి
16. కృష్ణాష్టమి
20. నారాయణగురు జయంతి
27. వినాయక చవితి
28. ఋషిపంచమి

నెమ్మదిగా దృఢంగా పెరిగే మొక్క – మైత్రి.

# గాయత్రీ చేతన మరియు ధ్యాన కేంద్రంలో
# సంజీవని విద్య శిబిరం

ఆత్మీయ సోదరునికి/సోదరీమణికి

నమస్సులు

గురుసత్తా యొక్క సూక్ష్మ సంరక్షణ మీ అందరికీ అందుతూ ఉన్నదని మేము నమ్ముతున్నాం.

దక్షిణ ప్రాంతాలలో గాయత్రీ పరివార్ కార్యకలాపాలను విస్తరింపజేయడానికై హైదరాబాదులో గాయత్రీ చేతన మరియు ధ్యాన కేంద్రం నిర్మించబడింది. వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం అనే లక్ష్యాల సాధన కోసం కేంద్రంలో సంజీవని విద్య శిబిరం ప్రారంభించబడింది. ప్రతి నెల 20 నుండి 29వ తేదీ వరకు శిబిరం జరుగుతుంది.

ఈ తొమ్మిది రోజుల సాధన శిబిరంలో పాల్గొన గోరేవారు 20వ తేది సాయంత్రం 4:00 గంటలలోగా కేంద్రానికి చేరాలి.

24,000 గాయత్రీ మంత్ర జప అనుష్ఠానం జరపగోరే పరిజనులకు ఈ శిబిరం ఒక సువర్ణ అవకాశం. శిబిరంలో జీవించే కళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) విషయమై ఆధ్యాత్మిక విజ్ఞానం సమన్విత పద్ధతిలో బోధించబడుతుంది.

శిబిరంలో పాల్గొనే వారి భోజన ప్రసాదం మున్నగు వాటికి ఉచిత వ్యవస్థ ఉంటుంది. శిబిరం ప్రధానంగా తెలుగు మాట్లాడే వారి కోసం రూపొందించబడింది.

భౌతిక వాదపు ఆకర్షణకు లోనయి, నేడు మనిషి అశాంతికి, ఉద్విగ్నతలకు గురి అవుతున్నాడు. ఈ స్థితిలో ఆత్మిక ప్రగతి కోసమై ఆధ్యాత్మిక అనుష్ఠానాన్ని జరపడం తప్పనిసరి అవుతోంది. ఈ తొమ్మిది రోజుల సాధన అనుష్ఠానం ద్వారా వ్యక్తి తన బ్యాటరీని చార్జ్ చేసుకోగలుగుతాడు. తద్వారా సంవత్సరం పొడవునా తన వ్యక్తిగత, కుటుంబ, సామాజిక బాధ్యతలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించగలుగుతాడు.


శిబిరంలో త్రికాల సంధ్యావందనం, యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, యజ్ఞం, జపం, సాత్విక భోజనం మున్నగు కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి రోజూ వివిధ విషయాలపై మూడు ప్రవచనాలు ఉంటాయి. జీవితాన్ని నియమబద్ధం చేయడానికై - నిద్ర లేచినప్పటి నుండి నిద్రపోయేవరకు నిర్ణీత సమయంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. శిబిరంలో పాల్గొనగోరే వారు ముందుగానే శిబిరం నుండి అనుమతి పత్రాన్ని పోస్టు ద్వారా కాని, ఫాక్స్ ద్వారా కాని పొందవలసి ఉంటుంది. ఆ అనుమతి పత్రాన్ని వెంట తీసుకురావలసి ఉంటుంది. దుప్పటి, రోజూ వాడే బ్రష్, టూత్ పేస్ట్, సబ్బు, దుస్తులు మున్నగు వాటిని వారే తెచ్చుకోవాలి. శిబిరంలో ఉన్నప్పుడు పంచ కట్టుకోవాలి, బాగా వృద్ధులు, బలహీనులు అయినవారు శిబిరానికి రాకూడదు. చిన్న పిల్లలను తీసుకొని రాకూడదు. రోజులో 24 గంటలూ శిబిరంలోనే ఉండాలి. బయటకు వెళ్ళిరావడానికి మధ్యలో ఒక రోజు అవకాశం ఉంటుంది.

ఆత్మిక జీవనంలో, వ్యావహారిక జీవనంలో సమృద్ధిని సాధించడానికై సంవత్సరంలో కనీసం ఒకసారి తప్పకుండా అనుష్ఠానం జరపడం అవసరమని పరిజనులకు గుర్తు చేస్తున్నాం.

## నియమావళి

1. బ్రాహ్మీముహూర్తమున జాగరణ
2. నేలపై శయనించటం
3. బ్రహ్మచర్య పాలన
4. సాత్వికాహారము
5. జపము - తపము
6. సాధన
7. త్రికాల సంధ్యావందనము
8. సంగీతము - సత్సంగము
9. ధ్యానము
10. ప్రాణాయామము
11. యోగ, ఆసన, నిత్యయజ్ఞము
12. తమ పనులు తామే చేసుకొనుట
13. ఒక గంట శ్రమ దానము
14. 30 మాలల గాయత్రి జపము (ప్రతి దినము)
15. మిత భాషణము - మౌనము

మీ సోదరుడు



(డా॥ ప్రణవ్‌పండ్యా)

మీ సోదరి



(శైలబాల పండ్యా)


# సద్గురు లీలామృతం

## శిష్టాచారాన్ని సద్వినియోగం చేస్తే

ఒక రోజున ఉన్నత పదవిలో ఉన్న ఒక అధికారి తన మిత్రునితోపాటు తపోభూమికి విచ్చేశారు. ఒక గదిలో ఆయనతో సమావేశం ఏర్పాటయింది. ఇద్దరూ పలుమారులు వద్దంటున్నా, గురుదేవులు పట్టుపట్టి వారిని కుర్చీల మీద కూర్చోబెట్టారు. ప్రఖ్యాతి పొందిన ఒక సంత్ తమను ఇలా గౌరవిస్తారని వారు అసలు ఊహించనయినా ఊహించలేదు. సుమారు అరగంటపాటు సంభాషణ సాగింది. ఆ తర్వాత వారిద్దరూ బయటికి వచ్చారు.

ఆ ఉన్నతాధికారి కారులో కూర్చుంటూ తన మిత్రునితో ఇలా అన్నారు –

"వండర్‌ఫుల్ పర్సన్! ఎవ్విరివన్స్ ఆనర్ ఈజ్ సేఫ్ ఇన్ హిజ్ హాండ్స్ (అద్భుతమైన వ్యక్తి! ప్రతి వ్యక్తి గౌరవాన్ని ఆయన కాపాడతారు)."



ప్రక్కన నిలబడి ఈ మాటలు వింటున్న ఒక కార్యకర్త ఈ వ్యాఖ్యను గురుదేవులకు వినిపించాడు. వారు చిరునవ్వుతో ఇలా అన్నారు –

"శిష్టాచారంలో, ప్రశంసలో అద్భుతమైన శక్తి ఉంది. ఈ శక్తిని సద్వినియోగం చేయడం ద్వారా నీవు మొత్తం ప్రపంచం హృదయానికి సమ్రాట్టువు కాగలుగుతావు."

## నేను చాకలివాణ్ణి

విమర్శలు మామూలు వ్యక్తిని ఇబ్బంది పెడతాయి, హైరానపెడతాయి, ఉద్విగ్నుణ్ణి చేస్తాయి. మహాపురుషులు విమర్శలకు బాగా వినోదిస్తారు; తమ గూఢార్థాన్ని వ్యక్తం చేస్తారు.

ఒక రోజున బయటినుంచి ఒక కార్యకర్త బాధగా ఇలా అన్నాడు –

"గురూజీ! మీరు బ్రాహ్మణులు కారనీ, వడ్రంగి అనీ కొందరు అంటున్నారు."

అప్పుడు గురుదేవులు పత్రిక చదువుతున్నారు. పత్రికను మేజా బల్లమీద పెడుతూ ఆయన ఇలా అన్నారు –

"అలాగా! అయితే నేనంత గొప్పవాణ్ణి కాను. అసలు నేను కడజాతివాణ్ణి, చాకలివాణ్ణి."

కార్యకర్త చకితుడు అయినాడు. అది చూచి గురుదేవులు బిగ్గరగా నవ్వసాగారు. నవ్వు ఆగిన తర్వాత ఇలా అన్నారు –

"చూడు. నా పని సంస్కృతిని శుద్ధిచేయడం, శుభ్రం చేయడం. మరి నేను కడజాతివాణ్ణి కదా, చాకలివాణ్ణి కదా."

కల్లా కపటంలేని గురుదేవుల ఈ భావాన్ని చూచి, ఆ కార్యకర్త నిశ్చేష్టుడు అయిపోయాడు.

## సంస్కృతం కాదు – సంస్కృతి

యుగనిర్మాణ విద్యాలయంలో మొదటి శిబిరం ముగింపునకు వస్తోంది. ప్రఖ్యాతి పొందిన ఒక సంస్కృత అభిమాని అప్పుడు గురుదేవులను కలుసుకోవడానికి విచ్చేశారు.

గురుదేవులు ఆయనను వెంటతీసుకుని తపోభూమిలోని వివిధ కార్యకలాపాలను చూపి వివరించారు. ఆ క్రమంలో విద్యాలయం సంగతి వచ్చింది. స్వావలంబనలో శిక్షణ, జీవన సంస్కరణ కార్యక్రమాలు, విద్యార్థులను ప్రజాసేవకులుగా మలచే ప్రక్రియ – అన్నీ ఆయనకు స్పష్టం చేశారు. ఆ పెద్దమనిషి అన్నీ వినీ విననట్లు విన్నారు. అర్ధమనస్కంగా విన్నారు. ఆయన ఒకే విషయం పదేపదే చెప్పుకువస్తున్నారు –

"ఇదంతా సంస్కృతంలో ఎందుకు బోధించడం లేదు ? మీరు సంస్కృతానికి అగ్రప్రాధాన్యం ఎందుకు ఇవ్వడం లేదు?"

గురుదేవులు విని విని ఇలా జవాబిచ్చారు –

"సంస్కృతానికి బదులు సంస్కృతికి అగ్ర ప్రాధాన్యం ఇస్తున్నాను. ఇక్కడ నేను సంస్కృతానికి బదులు సంస్కృతి నేర్పుతున్నాను."

గురుదేవులు ఈ మాట కొంచెం తీవ్రమైన స్వరంతో అన్నారు. అక్కడ ఉన్న వ్యక్తులు నిశ్చేష్టులు అయినారు. కొద్దిసేపు ఆలోచించి ఆ సంస్కృతాభిమాని ఇలా అన్నారు –

"మీరు చెప్పింది సముచితమే. మీరు చేస్తున్న ఈ కృషి స్వామి శ్రద్ధానంద కృషి కన్న తక్కువది కాదు." ★

**నిర్లక్ష్యాన్ని మించిన శత్రువు లేదు.**

# మిమ్ములను దేవతలుగా మార్చే పుస్తకములు

| | | |
|---|---|---|
| 1. | స్త్రీలకు గాయత్రీ సాధన | 2.00 |
| 2. | ధైర్యం విడవకండి | 2.00 |
| 3. | మానసిక సంతులనము | 2.00 |
| 4. | గాయత్రి–సమస్యలకు ఒక విలక్షణ పరిష్కారం | 2.00 |
| 5. | సద్గురు వచనామృతం | 2.00 |
| 6. | ఏమి తినాలి ? ఎలా తినాలి ? | 2.00 |
| 7. | నిత్యజీవితంలో తులసి | 2.00 |
| 8. | తల్లి దీవెన (మాతాజీ సూక్తులు) | 2.00 |
| 9. | అమృత బిందువులు | 2.00 |
| 10. | గృహస్థజీవనమే ఒక తపోజీవనం | 2.00 |
| 11. | ఉపాసన – చాలీసా | 3.00 |
| 12. | పవిత్ర జీవనం | 4.00 |
| 13. | సంస్కారములు పుణ్యపరంపర | 4.00 |
| 14. | మార్పు యొక్క మహత్తర క్షణాలు | 5.00 |
| 15. | మరణం తరువాత మనస్థితి ఏమిటి ? | 5.00 |
| 16. | గృహానా కర్మణో గతిః | 5.00 |
| 17. | గృహలక్ష్మి ప్రతిష్ట | 5.00 |
| 18. | స్వాతంత్ర్య సంగ్రామ సేనాని | 5.00 |
| 19. | బాలలకోసం గాయత్రీ చాలీసా చిత్రావళి | 5.00 |
| 20. | మూలికా చికిత్సా శాస్త్రం | 5.00 |
| 21. | ప్రతిభావంతులారా లేవండి. ముందుకు రండి! | 5.00 |
| 22. | సమయదానమే యుగధర్మం | 5.00 |
| 23. | సందేహాలు సమాధానాలు | 5.00 |
| 24. | జీవన సాధనకు బంగారు సూత్రాలు | 5.00 |
| 25. | వర్తమానపుసవాళ్ళు – యువావర్గం | 5.00 |
| 26. | దీప యజ్ఞము | 5.00 |
| 27. | యజ్ఞము – ఒక సమగ్ర శాస్త్రం | 5.00 |
| 28. | ఆసన – ప్రాణయామాలు | 5.00 |
| 29. | వంటింటి వైద్యం | 5.00 |
| 30. | మంత్రలేఖనం | 5.00 |
| 31. | శ్రాద్ధకర్మ వివేచన | 5.00 |
| 32. | గాయత్రీ హవన విధి | 8.00 |
| 33. | మీ ఆరోగ్యం – ఆయుర్వేదం | 8.00 |
| 34. | గో సంరక్షణే మన సంరక్షణ | 8.00 |
| 35. | ప్రతి అక్షరమూ ఒక శక్తిధారయే | 10.00 |
| 36. | ఏకాంత సహచరులు | 10.00 |
| 37. | ఆరోగ్య సమస్యలు – సమాధానాలు | 10.00 |
| 38. | ఉపాసన – సాధన | 10.00 |
| 39. | నేను ఏమిటి | 10.00 |
| 40. | నారీ మహాత్మ్య ప్రకరణము | 15.00 |
| 41. | వేదములు దివ్య సందేశము – కుటుంబము మరియు ఆరోగ్యం | 15.00 |
| 42. | సూర్య విజ్ఞానము | 18.00 |
| 43. | శ్రీమద్భాగవతకథ | 18.00 |
| 44. | అమృతకలశం | 25.00 |
| 45. | ఆత్మకథ | 25.00 |
| 46. | యోగ విజ్ఞానము | 25.00 |
| 47. | యోగ దర్శనము | 30.00 |
| 48. | గాయత్రీ 24 శక్తి ధారలు | 30.00 |
| 49. | మాతాజీ చరిత్ర | 30.00 |
| 50. | వేదముల దివ్యసందేశం | 40.00 |
| 51. | గాయత్రీ మహావిజ్ఞానము – 1 | 30.00 |
| 52. | గాయత్రీ మహావిజ్ఞానము – 2 | 30.00 |
| 53. | గాయత్రీ మహావిజ్ఞానము – 3 | 25.00 |
| 54. | గాయత్రీ మహావిజ్ఞాన్ – బౌండు | 100.00 |
| 55. | ప్రార్థన యొక్క ప్రత్యక్ష చమత్కారాలు | 5.00 |
| 56. | పతంజలీ యోగదర్శనం | 8.00 |
| 57. | ఏకాంత సహచరులు | 10.00 |
| 58. | కుండలినీ మహావిజ్ఞానం | 18.00 |
| 59. | మంత్రలేఖనం | 5.00 |
| 60. | శ్రీమద్ భాగవత కథ | 15.00 |
| 61. | శ్రాద్ధకర్మ – వివేచన | 5.00 |
| 62. | ఆత్మహత్యలెందుకు | 2.00 |
| 63. | ఆధ్యాత్మిక – కామవిజ్ఞానం | 15.00 |
| 64. | స్వరయోగంతో దివ్యవిజ్ఞానం | 10.00 |
| 65. | సంస్కారముల పుణ్యపరంపర | 4.00 |
| 66. | వివాహ సంస్కార వివేచన | 3.00 |
| 67. | ప్రాణాంతక వ్యసనాలు | 4.00 |
| 68. | స్వాతంత్ర్య సంగ్రామ సేనాని | 5.00 |
| 69. | కల్పసాధన | 10.00 |
| 70. | రామాయణ కల్పవృక్షం | 5.00 |
| 71. | క్రాంతి శిఖరం | 5.00 |
| 72. | యుగయజ్ఞ పద్ధతి | 5.00 |
| 73. | యుగసంగీతం | 5.00 |
| 74. | ప్రజ్ఞాపురాణ కథలు | 8.00 |
| 75. | కర్మకాండ భాస్కర్ | 80.00 |
| 76. | మన గౌరవ – గరిమ | 2.00 |
| 77. | ఋగ్వేద భూమిక | 4.00 |
| 78. | నవయుగనిర్మాణానికి గాయత్రి పరివార్ | 4.00 |
| 79. | గాయత్రీ రామాయణం | 2.00 |
| 80. | గాయత్రి యొక్క నారీ స్వరూపము | 5.00 |
| 81. | గాయత్రీ సహస్రనామ స్తోత్రము | 3.00 |

YUGASHAKTI GAYATRI (Telugu Monthly), July - 2006
RNI No. APTEL / 2000/1656. Postal Reg. No. L-II/RNP/H-HD-953/2006-08

# హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో వివాహ సంస్కారం



హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో వివాహ సంస్కారం నిర్వహిస్తున్న శ్రీయుతులు గోవర్ధన్ లోహానీ, హీర్‌సింగ్ రాజపురోహిత్, రాజు ఆరసీ.



వివాహ సంస్కారం స్వీకరిస్తున్న వరుడు శ్రీ వి.రామకృష్ణ ప్రసాద్, వధువు శ్రీమతి మంజుల.

# కోయంబత్తూరులో యోగ శిబిరం



శిబిరంలో యోగం అభ్యసిస్తున్న సాధకులు.

Global Head Quarters :
GAYATRI TEERTH, SHANTIKUNJ,
Haridwar - 249411 Ph: (01334) 260602, 261955, 260309
Fax : (01334) 260866, E-mail : shantikunj@awgp.org,
southindiazone@awgp.org, website : www.awgp.org

Chief Editor : Dr. PRANAV PANDYA
Printed & Published By Sri B.CH.V.SUBBA RAO (Aswini)
(For SRI VEDAMATHA GAYATRI TRUST)
5-283, H.P.Road, Moosapet, Hyderabad-500 018.
Printeda at Bharathi Art Printers, Chikkadapally, Hyderabad - 20

If Undelivered please return to: GAYATRI CHETANA KENDRA & MEDITATION CENTER,
Near Aswini House, H.P.Road, Moosapet, Hyderabad - 500 018, Ph : 040 - 32986922, 09392506888.
E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

SUNDAR GRAPHICS : 9391030025